ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

అన్నమయ్య

fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-5-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 120 పేజీలు: 10+4 వెల: 8.00


**లోయలో పడిన బస్సు: 22 మంది దుర్మరణం**

**గ్రీన్‌కార్డుపై యుటర్న్: నిబంధనలు సడలించిన యుఎస్**

5లో

# 7 నుంచి రాష్ట్రమంతా యోగాంధ్ర

## 14 రోజులు నిర్వహణ.. 21న యోగాడే

## అమరావతిలో 25 వేల మందితో రాష్ట్రస్థాయి కార్యక్రమం

## గ్రామ స్థాయినుంచి కోటిమంది పాల్గొనేలా కార్యాచరణ

## యోగాంధ్ర-26పై సమీక్షలో సిఎం చంద్రబాబు



శనివారం అమరావతిలో యోగాంధ్ర 2026 పై మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, మే 30, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా యోగాంధ్ర2026 నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా డే నిర్వహణకు సంబంధించి మంత్రులు, అధికారులతో సిఎం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా యోగాంధ్ర 2026పై తలపెట్టిన కార్యక్రమాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. యోగాంధ్ర 2026 కార్యక్రమంలో భాగంగా జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాజధాని అమరావతిలో 25 వేల మందితో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. రాజధాని ప్రాంతంలోని కృష్ణా నదీ వంతెనపై యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వెస్ట్ బైపాస్ రోడ్ నిర్మాణంలో భాగంగా నదిపై నిర్మించిన బ్రిడ్జిపై కార్యక్రమం ఇంటర్నేషనల్ యోగా డే జూన్ 21న నిర్వహిస్తారు. అలాగే అదే రోజు జిల్లా కేంద్రాల్లో 1000 మందితో నిర్వహించే కార్యక్రమాల్లో మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో, అన్ని స్థాయిల్లో, అన్ని విభాగాల్లో నిర్వహించాలని సీఎం సూచించారు. మొత్తంగా కలిపి కోటి మంది భాగస్వాములు అయ్యేలా కార్యాచరణ సిద్దంచేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 1.50 లక్షలమంది ట్రైనర్లకు అదనంగా మరో లక్ష మందిని ట్రైనర్లుగా చేసేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఒక జిల్లా ఒక థీమ్ తో 14 రోజుల యోగాంధ్ర నిర్వహిస్తారు. జిల్లాల్లో యోగాంధ్ర నిర్వహణకు జిల్లాకు రూ.25 లక్షల చొప్పున నిధులు కేటాయించారు.

**అన్ని శాఖల సమన్వయం... కోటి మంది భాగస్వామ్యం..**

ఆరోగ్య, మానవవనరులు, మునిసిపల్, పంచాయతీ రాజ్, దేవాదాయ, ఐటీ శాఖల సమన్వయంతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి జిల్లాలోని రెండు ప్రముఖ టూరిస్టు ప్రాంతాల్లో అంటే 56 టూరిస్టు కేంద్రాల్లో ప్రత్యేక సెషన్స్ నిర్వహిస్తారు. ఒక రోజు రెండు జిల్లాలచొప్పున 500మందితో టూరిస్టు ప్రాంతాల్లో యోగా నిర్వహిస్తారు. అలాగే 14 రోజుల పాటు పార్కులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వర్ణవార్డు, స్వర్ణ గ్రామం కార్యాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమాలునిర్వహిస్తారు. యోగాంధ్ర ఈవెంట్స్ కు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవార్డులు చేస్తారు.

**యోగాపై మంతెన సత్యనారాయణ రాజు ప్రత్యేక వీడియోలు..**

రాష్ట్ర ప్రభుత్వ యోగా, నాచురోపతి విభాగ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు యోగాంధ్ర నిర్వహణకు సంబంధించి రూపొందించిన పోస్టర్‌ను సిఎం చంద్రబాబు ఆవిష్కరించారు. యోగాపై అవగాహనకు, శిక్షణకు తాను చేపట్టిన కార్యక్రమాలను సత్యనారాయణ రాజు సీఎంకు వివరించారు. 90 ఆసనాల వీడియోలు, 21 ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఆసనాలు వీడియోలు, రోజు వారీ సాధన కోసం యోగాసనాలు, ప్రాణాయామంపై >>2



శనివారం అచ్యుతాపురం సెజ్ లోని అంతర్జాతీయ వస్త్రతయారీ సంస్థను సందర్శించిన కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్

# మహిళా సాధికారతలో 'బ్రాండిక్స్' భేష్

## అచ్యుతాపురం సెజ్‌లోని వస్త్ర తయారీ సంస్థలను పరిశీలించిన కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్

## జౌళి రంగంలోనే ఉపాధికి భారీ అవకాశాలు: మంత్రి

**అనకాపల్లి (అచ్యుతాపురం), మే 30, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్త్ర పరిశ్రమ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, బ్రాండిక్స్ తరహాలో మరిన్ని పరిశ్రమలు ఇక్కడికి వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్ర పారిశ్రామిక రంగానికి బలమైన ఊతం లభిస్తుందని కేంద్ర జౌళి శాఖమంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. శనివారం అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ప్రముఖ అంతర్జాతీయ వస్త్ర తయారీ సంస్థ 'బ్రాండిక్స్' ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా సంస్థలో జరుగుతున్న వస్త్ర ఉత్పత్తుల తయారీ, అంతర్జా >>2

# కర్ణాటక సిఎల్‌పి నేతగా డికె



## సిద్దరామయ్య ప్రతిపాదనకు ఏకగ్రీవ ఆమోదం

## 3న సిఎంగా పదవీ ప్రమాణం

## నలుగురు డిప్యూటీ సిఎంలకు డికె 'నో'

**బెంగళూరు, మే 30:** కర్ణాటక ముఖ్యమంత్రిగా డికె శివకుమార్ పగ్గాలు చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం బెంగళూరులో జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సిఎల్పీ నేతగా డికె శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ సిఎం సిద్ధరామయ్య డికె పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా సమర్థించారు. దీంతో కర్ణాటక కాంగ్రెస్ సిఎల్పీ నేతగా డికె శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎఐసిసి పరిశీలకులు ప్రకటించారు. కేవలం పది నిమిషాల్లోనే సీఎల్పీ భేటీ ముగిసింది. కొత్త ముఖ్యమంత్రి డికె శివకుమార్ ప్రమాణస్వీకారోత్సవం జూన్ 3వ తేదీ జరుగుతుంది. రాష్ట్ర కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జిసి చంద్రశేఖర్ ప్రకటించారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవం లోక్‌భవన్‌లో జరుగుతుందని నిరాడంబరంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే సిఎం ప్రమాణ స్వీకారోత్సవ వేదికను లోక్‌భవన్‌కు మార్చినట్లు చంద్రశేఖర్‌చెప్పారు. డికె శివకుమార్ శనివారం ఉదయం లోక్ భవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌తో భేటీఅయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధిం >>2

## క్వాంటం వ్యాలీపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

### కమిటీ చైర్మన్‌గా శైలజ నియామకం

**విజయవాడ,మే 30,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి క్వాంటం వ్యాలీ, క్వాంటంటెక్నాలజీస్, బయోసైన్సెస్ రంగాల్లో వ్యూహాత్మక మార్గదర్శకత్వం, ప్రణాళికలు అమలు ప్రక్రియలను పర్యవేక్షించడం కోసం ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించి ఐటిశాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. క్వాంటం వ్యాలీ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు వీలుగా యాక్షన్‌ప్లాను రూపొందించేందుకు వేర్వేరు రంగాలతో కూడిన నిపుణులతో ఈ కమిటీ వేసినట్లు పేర్కొన్నారు. 20 సభ్యులుఉండే ఈ కమిటీకి సిఎస్ఐఆర్ బిజినెస్ డెవలప్‌మెంట్‌హెడ్ శైలజ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

కోఛైర్మన్‌గా సెంటర్ ఫర్ సింథటిక్ బయాలజీ అండ్ బయోమాన్యుఫాక్చరింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పవన్ కె. ధార్‌ను నియమించారు. ఐటిశాఖ డైరెక్టర్ గీతాంజలి సభ్య కార్యదర్శిగా వ్యవహరించనున్నారు. కమిటీలో సివి శ్రీధర్, శేష రఘునాథన్, రాజ్‌గోపాల్ శ్రీనివాసన్, అమిత్ రాయ్, అమోఘ్ అప్సింగేకర్, వెంకట్ సుబ్రమణ్యం, సౌరి గుడ్లవల్లేటి, రియాజ్ సయ్యద్ సభ్యులుగా ఉంటారు. ఫార్మాస్యూటికల్ రంగం నుండి సురేష్ పోడ, ప్రవీణ్ రావు అక్కినేపల్లి, రాధా రంగరాజన్, విజయ్ పాండే, శశికాంత్, రామ్ విశ్వకర్మను సభ్యులుగా నియమించారు. విద్యారంగం నుండి దేవా ప్రియాకుమార్, ప్రొఫెసర్ ఆరత్ కల్రా, ప్రొఫెసర్ కస్తూరి సాహా టాస్క్‌ఫోర్స్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

# చెత్తనుంచి ఇంధనం ఉత్పత్తి



శనివారం కొండవీడులోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటును పరిశీలిస్తున్న డి.సిఎం పవన్

## కొండవీడులోని జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను పరిశీలించిన డి.సిఎం పవన్

## త్వరలో మరో 6 ప్లాంట్ల ఏర్పాటు

## డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా ఎపి: డి.సిఎం

**గుంటూరు మే 30 ప్రభాత వార్త ప్రతినిధి :** చెత్త నుంచి సంపద సృష్టించే మార్గాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. పల్నాడు జిల్లా కొండవీడులోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటును శనివారం పవన్ కల్యాణ్ సందర్శించారు. ఈ సందర్భంగా చెత్త నుంచి విద్యుత్తు తయారీ ప్రక్రియను ఆసాంతం పరిశీలించి, వివరాలను తెలుసుకున్నారు. చెత్తను ఎలా వేరు చేస్తారు, ఎలా శుద్ధి చేస్తారు, దేనికి ఉపయోగిస్తారనే విషయాలను ప్లాంటు అధికారులు డిప్యూటీ సిఎంకు వివరించారు. ముఖ్యంగా చెత్తను బాయిలర్లలో మండించడం ద్వారా విద్యుత్తు తయారీ ఎలా జరుగుతుందో, చివరికి బూడిదను ఇటుకల తయారీకి ఎలా వినియోగించుకోవచ్చో అధికారులు క్షుణ్ణంగా పవన్ కల్యాణ్‌కు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ రాష్ట్రంలో రోజువారీగా 7,200 టన్నుల పొడి చెత్త ఉత్పత్తి అవుతోందని కొండవీడు జిందాల్ ప్లాంటు సామర్థం రోజువారీ 1,400 టన్నుల పొడి చెత్తను ప్రాసెస్ చేసి, సగటున 20 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగలదని తెలిపారు. దాన్ని రాష్ట్ర విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానం చేయడంతో రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చగలదని పేర్కొన్నారు. విశాఖపట్నంలోనూ జిందాల్ ప్లాంటు ఉత్తరాంధ్ర రీజియన్ చెత్తను సేకరించి 15 మెగావాట్లు విద్యుత్తు ఉత్పాదన చేస్తోందని తెలిపారు. ఈ తరహా ప్లాంట్లు రాష్ట్రంలో త్వరలో మరో ఆరు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దీనిలో కాకినాడలో ఇప్పటికే పనులు మొదలు కాగా, నెల్లూరు, కడప కర్నూలు, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో కూడా త్వరలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. బయో మిథలైజేషన్ ప్లాంట్ల నుంచి బయోగ్యాస్ కూడా ఉత్తత్తి చేయవచ్చుని.. పూలు, పండ్లు, కూరగాయాలు, ఆహార వ్యర్థాలను ఉపయోగించి, క్రమ పద్ధతిలో వేరు చేసి దాని ద్వారా గ్యాస్ ఉత్తత్పి చేయవచ్చుని అన్నారు.

**కాలుష్యరహిత పుష్కరాలు**

గోదావరి పుష్కరాలను కాలుష్యరహితంగా నిర్వహించాలనే పట్టుదలతో కూటమి ప్రభుత్వం ఉందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు. గోదావరి నదిలో కలుస్తున్న వ్యర్థాలను పూర్తిస్థాయిలో అరికట్టేలా చిత్తశుద్ధితో ప్రణాళికను అమలు చేయాలని భావిస్తున్నామని అన్నారు. చెత్త నిర్వహణను పక్కాగా చేసేందుకు జిందాల్ అనుసరిస్తున్న విధానాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలకు సంబంధించి 268 పంచాయతీలు ప్రత్యక్షంగా భాగస్వామ్యం అవుతాయని, ఈ పంచాయతీల్లో చెత్త నిర్వహణ అనేది చాలా కీలకమని తెలిపారు. నదిలోకి వ్యర్థాలను విడుదల చేయకుండా, నదిని అందంగా, కాలుష్య రహితంగా తీర్చిదిద్దడం మీద పంచాయతీల అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని >>2




# ఢిల్లీలో పేలుళ్ల కుట్ర భగ్నం

## పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు 9 మందిని అరెస్టు చేసిన పోలీసులు

## భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి వరుస పేలుళ్లకు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు పన్నిన కుట్రను ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు శనివారం నాడు భగ్నం చేశారు. రక్షణ, పోలీసు బలగాలు మొహరించే కీలక స్థావరాలు, ప్రార్థన స్థలాలను ఉగ్రవాదులు టార్గెట్ చేసినట్లు పోలీసులు తేల్చారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది ఉగ్రవాదులు అరెస్టవగా వారి వద్ద నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ ఉగ్రవాదుల్లో కొందరు నేపాల్‌కు చెందిన వారుండగా వీరికి పాకిస్థాన్‌లో ఆశ్రయం పొందుతున్న అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అండదండలున్నట్లు వెల్లడయ్యింది. ఉగ్రవాదులను ఢిల్లీ పోలీసులు రహస్య >>2

# ఇంకా విభిన్న వాతావరణం



## అనంతపురం జిల్లా హుస్సేన్ పురంలో 51 మి.మీ వర్షపాతం

## నంద్యాల జిల్లా సంజామలలో 41.4° ఉష్ణోగ్రత

**విజయవాడ,మే30,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పిడుగులతో కూడిన వర్షాలు, కొన్నిచోట్ల ఎండ ప్రభావంతో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం 5 గంటల నాటికి అనంతపురం జిల్లా హుస్సేన్ పురంలో 51మిమీ, కడప జిల్లా పెద్ద పసుపల్లెలో 45మిమీ, చిత్తూరు జిల్లా గంగవరంలో 41.7మిమీ, అనంతపురం జిల్లా వెన్నపూసపల్లెలో 31.5మిమీ, కడప జిల్లా ఉప్పలూరులో 29మిమీ, తొర్రివేముల 26మిమీ, పొత్తిపాడులో 26మిమీ, నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 20. 5మిమీ వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. మరోవైపు శనివారం రాష్ట్రంలో నంద్యాలజిల్లా సంజామలలో 41.4డిగ్రీలు, అనంతపురంజిల్లా హుస్సేన్ పురంలో 40.2, కర్నూలుజిల్లా బస్తిపాడు, మార్కాపురంజిల్లా కంభం, వైఎస్సార్ కడపజిల్లా మంగపట్నం 40 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో క్రమంగా ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గి కొన్నిప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీల మధ్య రికార్డు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇక ఆదివారం 17 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. మన్యం జిల్లా సీతంపేట మండలం పోలవరం జిల్లా చింతూరు, దేవిపట్నం, కూనవరం, మారేడుమిల్లి, రంపచోడవరం, వరరామచంద్రాపురం, ఏలూరు జిల్లా.. బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు. కృష్ణా >>2

# డిస్టిలరీల నుంచి వందల కోట్లు వసూలు

## ప్రణయ్ ప్రకాశ్ అక్రమాలపై ఎసిబి కోర్టులో సిట్ ఛార్జిషీటు

## ఎపి లిక్కర్ కేసు

**విజయవాడ, మే 30, ప్రభాతవార్తప్రతినిషధి:** ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ దర్యాప్తులో అత్యంత కీలకమైన అంశాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి,. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్). ఎసిబి కోర్టులో తాజాగా మరో అనుబంధ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఈ ఛార్జిషీట్‌లో నిందితుడు ప్రణయ్ ప్రకాశ్ ఆర్థిక లావాదేవీలను సిట్ ఆధారాలతో కోర్టు ముందుఉంచింది. సిట్ సమర్పించిన నివేదిక ప్రకారం.. వివిధ డిస్టిలరీల నుంచి వందల కోట్ల రూపాయల మేర వసూళ్లకు పాల్పడిన వ్యవహారంలో ప్రణయ్ ప్రకాశ్ అత్యంత కీలక సూత్రధారిగా వ్యవహరించారు. ఈ వసూళ్ల పర్వంలో ఆయన ఒంటరిగాకాకుండా, లూప్‌లో ఉన్న పలువురు ప్రభావవంతమైన వ్యక్తులతో కలిసి ఒక సిండికేట్‌గా పనిచేసినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది. ప్రణయ్ ప్రకాశ్ మద్యం అక్రమ సంపాదనతో ఎలాంటి విలాసవంతమైన జీవితాన్ని గడిపారనేది సిట్ ఛార్జిషీట్‌లో వివరంగా >>2

# ఇంటర్ విద్యార్థులకు వేసవి సెలవులు హెచ్చింపు

**విజయవాడ,మే 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో విద్యార్థులకు ఇచ్చిన వేసవి సెలవులు త్వరలో ముగియనున్నాయి.. కళాశాలలు, పాఠశాలలు పున:ప్రారంభం అయ్యేందుకు మరికొద్దిరోజులే సమయం ఉంది. విద్యాశాఖ ఇప్పటికే కొత్త విద్యాసంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్లను విడుదల చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వం జూనియర్ కాలేజీలకు వేసవి సెలవులు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్ బాషా జూనియర్ కాలేజీలకు వేసవి సెలవులను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వేసవి సెలవులు అనంతరం జూన్ 1వ తేదీన జూనియర్ కళాశాలలు పున: ప్రారంభం కావాల్సి ఉంది. అయితే, జూన్ 1వ తేదీనకాకుండా 6వ తేదీన పాఠశాలలు పున:ప్రారంభం చేసేందుకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ నిర్ణయించింది. ఎందుకంటే.. జూన్ ఐదో తేదీ వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉండటంతో ఈ మార్పులు చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం.. జూన్ 6వ తేదీ నుంచి జూనియర్ కాలేజీలు పున: ప్రారంభించాలని సూచించారు. అయితే, అకడమిక్ క్యాలెండర్ ప్రకటించిన మిగతా కార్యక్రమాల్లో ఎలాంటి మార్పూ ఉండదని తెలిపారు. పాఠశాలల విద్యార్థులకు జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు కొనసాగనున్నాయి.



శనివారం బోధగయలోని విమానాశ్రయంలో మయన్మార్ అధ్యక్షుడు యు మిన్ ఆంగ్ హ్లైంగ్‌కు స్వాగతం పలుకుతున్న బీహార్ గవర్నర్ సయ్యద్ అలా హస్నైన్

## దేశంలోనే తొలిసారి ఎపిలో 'పిఎంసేతు' పథకం అమలు

**విజయవాడ,మే 30,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే తొలిసారి ఎపిలో పిఎం సేతుపథకం అమలు కానుంది. దేశంలోనే తొలిసారి ఎపిలో పిఎంసేతు పథకం అమలుకు అవకాశం కల్పిస్తూ కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ నిర్ణయం తీసుకుంది. ఆర్సెల్లార్ మిత్తల్ భాగస్వామ్యంతో విశాఖ ఐటిఐ రూపురేఖలు మారనున్నాయి. కోర్సు పూర్తికాగానే ఉద్యోగాలు పిఎంసేతు అమలు అవకాశాన్ని కేంద్రం ఎపికి కల్పించడం విశేషం. అందుకు అనుగుణంగా విశాఖ ఐటిఐ క్లస్టర్ స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌కు కేంద్రం ఆమోదించింది. విశాఖలో ఐటీఐల ఆధునీకరణకు అకడమిక్ భాగస్వామిగా 'నామ్‌టెక్' ఉండనుంది. ఐటీఐల ఆధునీకరణకు రూ.60 వేల కోట్ల బడ్జెట్‌తో 'పిఎంసేతు' రూపకల్పన కానుంది. హబ్ అండ్ స్పోక్‌విధానంలో ఐటిఐ విద్యార్థులకు సరికొత్త సాంకేతిక శిక్షణను ఇవ్వనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఐటిఐ విద్యార్థులకు సరికొత్త సాంకేతిక శిక్షణ అందుతుంది. 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో భాగంగా ఐటిఐలను కేంద్రం బలోపేత చేస్తుండటం గమనార్హం.

## జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సు దగ్ధం

**ఇంజిన్‌లో మంటలు గమనించిన వెంటనే ఆపేసిన డ్రైవర్**

**ప్రయాణికులు వెంటనే దిగిపోవడంతో తప్పిన పెను ప్రమాదం**

**డ్రైవర్ అప్రమత్తతతో 36మంది ప్రయాణికులు సురక్షితం**



ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన బస్సు

**చిట్యాల రూరల్, మే 30, ప్రభాతవార్త :** ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పూర్తిగా దగ్ధమైన ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి 65పై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఇంజిన్‌లో మంటలు చెలరేగడాన్ని గమనించిన డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి బస్సును వెంటనే రహదారి పక్కకు నిలిపివేసి ప్రయాణికులను సురక్షితంగా బయటకు పంపించడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెయిన్‌బో ట్రావెల్స్‌కు చెందిన ఎన్‌ఎల్ 07 బి0886 నెంబరు గల ప్రైవేటు ట్రావెల్స్ బస్సు శుక్రవారం రాత్రి 8:45 గంటలకు హైదరాబాద్‌లోని లింగంపల్లి నుంచి కాకినాడకి 36 మంది ప్రయాణికులతో బయలుదేరింది. శనివారం తెల్లవారుజామున 2.40 గంటల సమయంలో చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారుకు రాగానే అంతర్గతంగా చోటుచేసుకున్న విద్యుదాఘాతంతో ఇంజిన్‌లో ఒక్కసారిగా పొగలు రావడం ప్రారంభమైంది. దీన్ని గమనించిన డ్రైవర్ నాగరాజు వెంటనే అప్రమత్తమై బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. డ్రైవర్, క్లీనర్ ప్రయాణికులను గట్టిగా అరుస్తూ కిందికి దిగిపోవాలని సూచించారు. దీంతో నిద్రలో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురై హుటాహుటిన బయటకు పరుగులు తీశారు. అందరూ సురక్షితంగా దిగిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తం వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులంతా ప్రాణాలతో బయటపడినప్పటికీ... లగేజ్ క్యాబిన్‌లోని బ్యాగులు, ఇతర విలువైన సామాగ్రి బస్సులోనే పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. బస్సులో మంటలు చెలరేగడానికి ప్రాథమికంగా బ్యాటరీ లేదా ఇంజిన్ విభాగంలో జరిగిన షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం కారణంగా 65 నెంబర్ జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు, ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది వెంటనే చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## ఇంకా విభిన్న వాతావరణం

>> జిల్లా.. ఘంటసాల, మొవ్వ..గుంటూరు జిల్లా.. కాకుమాను, పొన్నూరు బాపట్ల జిల్లా.. బాపట్ల, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో(17) వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. దక్షిణ ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర వరకు సముద్ర మట్టానికి సగటున 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని తెలిపారు.

దీని ప్రభావంతో ఆదివారం అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లోనూ చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.ఆకస్మికంగా ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ క్రింద నిలబడొద్దని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.

## హథీరామ్‌జీ మఠం అధిపతిగా అర్జున్‌దాస్ కొనసాగింపు

### సుప్రీం కోర్టు కీలక తీర్పు

**తిరుపతి, మే 30 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రియ భక్తుడైన హథీరాంజీబావాజీ మఠం నిర్వహణకు సంబంధించి సుప్రీం కోర్టు కీలక తీర్పువెలువడించింది, ఈ ఉదంతంలో ఇప్పటికే హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టుకొట్టివేసింది. అర్జున్‌దాస్‌కు మఠాధిపతి హోదా కొనసాగించాలని పేర్కొంది. అర్జున్‌దాస్‌పై గతంలో వచ్చిన ఆరోపణలపై విశ్రాంత న్యాయమూర్తి వడ్డేపల్లి రామారావుతో విచారణ కమిటీ ఏర్పాటుచేసి, యేడాది లోగా నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దేశవ్యాప్తంగా ముఖ్యంగా తిరుపతి జిల్లాలో తిరుపతి పరిసరాల్లో ఉన్న కోట్లాదిరూపాయలు విలువైన మఠం ఆస్తులపర్యవేక్షణకు జస్టిస్ దుప్పల వెంకటరమణ నేతృత్వంలో కమిటీ వచ్చి విచారణ చేయనుంది. మఠం ఆస్తుల జాబితా తయారుచేసి రక్షణ చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో కీలకంగామారింది. ఇప్పటికే తిరుపతి పరిసరాల్లో మఠంభూములు అన్యాక్రాంతమవ్వడం, కొందరు ఆక్రమించుకుని ఇళ్లు, అపార్టుమెంట్లు,పెద్దపెద్ద భవనాలు నిర్మించుకోవడం జరిగింది. ఈ వ్యవహారంపై పెద్ద దుమారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు జోక్యంతో కమిటీ ఏర్పాటుతో అక్రమార్కులకు రైళ్లు పరుగెడుతున్నాయి.

# రాష్ట్రమంతా యోగాంధ్ర

>> 7 వీడియోలు, యోగా సందేహాలు ప్రశ్నలుసమాధానాలపై చేసిన వీడియోలను పబ్లిక్ డొమైనులో పెట్టనున్నట్లు తెలిపారు. మీడియా, సోషల్ మీడియా, వివిధ డిజిటల్ ఫ్లాట్ ఫామ్స్ ద్వారా వీటిని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. 8142404888 నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఈ వీడియోలను డౌన్ లోడ్ చేసుకోవచ్చని సత్యనారాయణ రాజు వివరించారు. సమీక్షలో మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్‌తో పాటు సిఎస్ సాయి ప్రసాద్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీర పాండియన్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ అథారిటీ సమావేశం..**

రాజధాని అమరావతిలో నిర్మాణాలు, వేగవంతంగా జరాగలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సిఆర్‌డిఎ అథారిటీ సమావేశం జరిగింది,.హాజరైన పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, సిఎస్ సాయి ప్రసాద్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఎడిసి, సిఆర్‌డిఎ, ఇతర శాఖల ఉన్నతాధికారులు హాజరై రాజధాని నిర్మాణం ఇతర సమావేశాలపై చర్చించారు. ఇతర ప్రతిపాదనలపై సిఆర్‌డిఎ అథారిటీ సమావేశంలో చర్చించారు, అమరావతిలో ఇప్పటివరకూ 114 సంస్థలకు 1269 ఎకరాలు కేటాయించాం. వీటిలో 70 ప్రభుత్వ సంస్థలు,44 ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. భూములు కేటాయించిన వాటిలో బ్యాంకులు 16,ఉద్యోగుల ఇళ్ల కోసం 8 బ్యాంకులకు,విద్యాసంస్థలు 22,రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు 13,కేంద్రప్రభుత్వ సంస్థలు 17,వైద్య సంస్థలు 7,హోటల్స్ 14,క్రీడా సంస్థలు 2,ఇతర సంస్థలు 5 ఉన్నాయి. ఇక నిర్మాణాల దశను చూస్తే 20 సంస్థలు నిర్మాణం కొనసాగుతుండగా,9 సంస్థలు నిర్మాణం పూర్తయ్యాయి.18 సంస్థలు నగదు చెల్లించే దశలో,25 సంస్థలు అగ్రిమెంట్ దశలో,మరో 38 సంస్థలు డిజైన్ల దశలో ఉన్నట్లు మంత్రి నారాయణ చెప్పారు.

# కర్ణాటక సిఎల్‌పి నేతగా డికె

>> చిన ఏర్పాట్లపైనే వీరిద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌కు డికె లేఖ అందించారు. ఆయన వెంట సిద్ధరామయ్యతోపాటు పలువురు సీనియర్ కేబినెట్ సహచరులు కూడా ఉన్నారు. గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ ఆదివారం ధర్మస్థలలో జరిగే ఉపరాష్ట్రపతి పర్యటనకు హాజరుకావాల్సి ఉంది. ఇందుకోసం ఆయన ఈ రోజే బెంగళూరు వెళ్తున్నారు. గవర్నర్ అందుబాటులో ఉండరనే ఉద్దేశంతోనే, సీఎల్పీ సమావేశానికి ముందే డికె ఆయనతో భేటీ అయినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సిఎం అయ్యాక, కొత్త మంత్రి వర్గంలో సిద్ధరామయ్య కుమారుడికి చోటు దక్కే అవకాశాలున్నాయి. సీఎం పదవికి రాజీనామా చేసి ఢిల్లీ వెళ్లిన సిద్ధరామయ్య, కొత్త క్యాబినెట్‌లో తన తరఫున మంత్రుల జాబితాను పార్టీ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ పరిశీలన కోసం అందించారు. అందులోనూ తన కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్రకు ఉపముఖ్యమంత్రి పదవితోపాటు, కీలక శాఖలు కేటాయించాలని ప్రత్యేకంగా కోరినట్లు తెలుస్తోంది. అయితే సిద్ధరామయ్య ప్రభుత్వంలోని మంత్రుల్లో దాదాపు సగం మందికి కొత్త మంత్రివర్గంలో చోటు దక్కకపోవచ్చని సమాచారం.

**నలుగురు ఉపముఖ్యమంత్రులకు డికెశివకుమార్ నో**

కర్ణాటక సిఎంగా పగ్గాలు చేపట్టబోతున్న డికె శివకుమార్ తన క్యాబినెట్‌లో నలుగురు ఉప ముఖ్యమంత్రుల ప్రతిపాదనకు నో చెప్పారు. ఈ విషయంలో తన నిర్ణయాన్ని ఆయన అధిష్ఠానానికి తెలియజేశారు. కర్ణాటక కాంగ్రెస్‌లో చాలామంది సీనియర్లు ఉన్నందున కొందరిని మాత్రమే ఉపముఖ్యమంత్రులుగా ఎంపిక చేయడంవల్ల పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి రేగుతుందని పార్టీకి వివరించారు.

జూన్ 3న డికె శివకుమార్‌తోపాటు కొద్దిమంది మాత్రమే మంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తారని తెలుస్తోంది. రాష్ట్ర నాయకత్వం, కాంగ్రెస్ అధిష్ఠానం మధ్య సంప్రదింపుల అనంతరమే తదుపరి మంత్రివర్గ విస్తరణ ఉంటుందని సమాచారం. కర్ణాటక అసెంబ్లీలో మొత్తం 32 మందిని మంత్రివర్గంలోకి తీసుకునే వీలుంది. మంత్రివర్గం కూర్పుపై చర్చలను కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే ముమ్మరం చేసింది.పలువురు సీనియర్ మంత్రులను క్యాబినెట్‌లోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఆ సీనియర్‌లలో ఎంబీ పటేల్, జి పరమేశ్వర, కేజే జార్జి, ప్రియాంక్ ఖర్గే, యతీంద్ర సిద్ధరామయ్య, కేబీ గౌడ, లక్ష్మీ హెబ్బాల్కర్, బి సురేష్, సంతోష్ లాడ్ పేర్లు ఉన్నాయి. అసెంబ్లీ స్పీకర్ పదవికి రేసులో సీనియర్ మంత్రులు హెచ్ఎం మునియప్ప, హెచ్‌కే పటేల్ ఉన్నారు. కాంగ్రెస్ అధిష్టానం, శివకుమార్, సిద్ధరామయ్య మధ్య సంప్రదింపుల ఆధారంగానే మంత్రివర్గం తుది కూర్పు ఉంటుందని చెబుతున్నారు.

## రిటైర్డ్ ఎస్‌డిసికి 6 శాతం పెన్షన్ కోత

**విజయవాడ,మే 30,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి పరిధిలో మిగులు భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో రిటైర్డ్ ఎస్‌డిసి మిరియాల దాసుపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆయన పెన్షన్లో 6 శాతం కోత విధించింది. విజిలెన్స్ డిజి ఇచ్చిన విచారణ నివేదిక ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాజధాని పరిధిలో మిగులు భూములను అప్పటి రెవెన్యూ అధికారుల అండదండలతో ముప్పా కోటేశ్వరరావు అనే వ్యక్తి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని నిర్ధారించారు. దీనిపై విచారించగా.. అప్పటి ఎస్‌డిసి దాసు సహకరించారని విచారణలో తేలింది. దీనిపై విజిలెన్స్ విచారణ అనంతరం దాసుపై చర్యలు తీసుకుంటున్నట్లు అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం దాసు రిటైరైన నేపథ్యంలో ఆయనకు అందే పెన్షన్లో 6 శాతం కోత విధించాలని నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఢిల్లీలో పేలుళ్ల కుట్ర భగ్నం

>> ప్రాంతంలో విచారిస్తున్నారు. ఈ యేడాది గణతంత్ర దినోత్సవం నాడు ఢిల్లీలో పేలుళ్లకు ఉగ్రవాదులు పన్నిన కుట్ర భగ్నం కాగా అంతకు మించిన ఉగ్రదాడికి పాక్ టెర్రరి స్టులు రెడీ అవగా చివరి నిమిషంలో ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు దానిని అడ్డుకున్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దేశ రాజధానిలో మరోసారి భారీ ఉగ్ర కుట్రకు వ్యూహాలు రచిస్తున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా అన్ని నగరాల పోలీసులు అప్రమత్తంగా వుండడం తెలిసిందే. ఉగ్రవాదులు ఢిల్లీని టార్గెట్ చేశారని పక్కా సమాచారం వుండడంతో ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు లోతుగా విచారించగా కొందరు ఉగ్రవాదులు నక్కిన రహస్య ప్రాంతం గురించి సమాచారం అందింది. దీంతో శనివారం ఉదయం ఆ ప్రాంతంపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల సందర్భంగా తొమ్మిది మంది ఉగ్రవాదులు పట్టుబడ్డారు. వీరిలో భారత్‌కు చెందిన వారితో పాటు నేపాల్ వాసులు కూడా వున్నారని తెలిసింది. ఉగ్రవాదుల వద్ద అధునాతన తుపాకులు, హ్యాండ్ గ్రేనేడ్లు, పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. తుపాకులను వెంటనే స్వాధీనం చేసుకున్న పోలీసులు హ్యాండ్ గ్రేనేడ్లు, పేలుడు పదార్థాలను నిపుణుల సమక్షంలో జాగ్రత్తగా స్వాధీనం చేసుకుని అవి పేలకుండా తగిన భద్రత మధ్య ఫోరెన్సిక్ లాబ్‌కు తరలించారు. కాగా ఉగ్ర నెట్ వర్క్‌ను ఢిల్లీ పోలీసులు ఛేదించడం వెనుక దావూద్ ఇబ్రహీం అనుచరుడు సలీం డోలా అరెస్టు, అతను ఇచ్చిన సమాచారం వుందని తెలిసింది. భారత్‌లో జరిగిన అనేక నేరాలు, ఘోరాలకు కారకుడైన సలీం డోలా నెల రోజుల క్రితం టర్కీలో పట్టుబడగా అతన్ని భద్రతా బలగాలు దౌత్య మార్గంలో భారత్‌కు రప్పించారు. 2020 నుంచి ఇతను పరారీలో వుండగా ఇస్తాంబుల్‌లోని బేలిక్‌దుజులో రహస్యంగా వుండగా టర్కీ పోలీసుల ఆపరేషన్‌లో పట్టుబడ్డాడు. టర్కీలో ఇతనిపై మాదక ద్రవ్యాలకు సంబంధించిన అనేక కేసులుండగా ఆ కేసుల్లోనే ఇతన్ని అరెస్టు చేశారు. అనంతరం డోలాను దేశ బహిష్కరణ చేయగా ఇదే సమయంలో భారత్ అతన్ని ఇక్కడకు రప్పించి ఉగ్ర కుట్రలపై విచారించి కీలక సమాచారం రాబట్టింది. డోలా అందించిన సమాచారం ఆధారంగా దావూద్ ఇబ్రహీం భారత్‌లో మరోమారు ఉగ్రదాడికి పథకం రచించినట్లు వెలుగు చూసింది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీలో స్లీపర్ సెల్‌కు చెందిన ఉగ్రవాదులు వున్నట్లు డోలా పోలీసుల విచారణలో తెలపగా వారిని పోలీసులు పట్టుకున్నారు.

### వారం - వర్జ్యం

31-05-2026, అధికజ్యేష్ఠ ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణీ కార్తె
పౌర్ణమి మ.2.15
అనూరాధ సా.4.12
వర్జ్యం : రా.10.29-రా.12.17
దు.సా.4.47-సా.5.39
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - సా.4.30-6.00

### వార్తాఫలం

**మేషం:** మిత్రుల నుండి మీరు ఆశించిన సహాయమును పొందగలుగుతారు. ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం తగదు.

**వృషభం:** మీ అభిప్రాయములను కొన్ని సలహాలను అమలు పరచుట వలన భాగస్వాములు లాభములు పొందుతారు.

**మిథునం:** మీరు నిర్లక్ష్యముతో పోగొట్టుకున్న వస్తువులు కనబడకపోవచ్చును. కుటుంబ సభ్యుల సాయం పొందుతారు.

**కర్కాటకం:** వృత్తి రీత్యా మీరు చేసే ప్రయాణములు అనుకూలిస్తారు. ఖర్చులు అధికంగా ఉంటాయి.

**సింహం:** నంన్న వ్యవహారములు నెరవేరుటకు పలుకుబడి గల వ్యక్తుల సహాయమును తీసికొనుట మంచిది.

**కన్య :** కొత్తగా చేపట్టే ఉద్యోగమునకు సంబంధించి మీరు ధైర్యముతో తీసికొనే నిర్ణయము వలన లాభం పొందుతారు.

**తుల:** వాహనములకు, టెలిఫోన్స్‌కు, ధనవ్యయం గోచరిస్తుంది. నూతన వస్త్రాలు ఖర్చు మీ అంచనాలు దాటుతాయి.

**వృశ్చికం:** అధికారము నుండి మాట పడకుండా ముందు జాగ్రత్త చర్యలను పాటించండి. ఉద్యోగులకు బదిలీలు.

**ధనుస్సు:** మీరు దర్శించుకోవాలి అనుకున్న ప్రదేశమునకు ప్రయాణము అనుకూలిస్తుంది. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి.

**మకరం:** ఆర్యోగమును గురించి వైద్యుని సంప్రదించవలసి వస్తుంది. పురోభివృద్ధి మాత్రం నామమాత్రంగా సాధిస్తారు.

**కుంభం:** ఉమ్మడి ఏ కార్యకలాపములను చేపట్టకండి. బదిలీకి చేసే ప్రయత్నములు ఫలిస్తాయి, శుభవార్తలు అందుకుంటారు.

**మీనం:** వివాదాస్పద వ్యవహారములు పరిష్కార మౌతాయి. టెండర్స్ అతి కష్టము మీద మీకు అనుకూలంగా వస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఇంధనం ఉత్పత్తి

>> నిర్ణయించామని స్పష్టం చేశారు.

దేశంలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరపాలక సంస్థ చెత్త సేకరణ విధానం ఆదర్శమని డిప్యూటీ సిఎం అన్నారు. చెత్తను ప్రజల దగ్గర నుంచి సేకరించి, వినియోగం వరకు స్ఫూర్తిగా నిలుస్తోందనితెలిపారు. ఇండోర్ వేస్ట్ మేనేజ్మెంట్ మోడల్ రాష్ట్రంలోని అర్బన్, గ్రామీణప్రాంతాలకు ఆదర్శం కావాలని అన్నారు. రాష్ట్రాన్ని డంపింగ్ యార్డు రహితంగా తీర్చిదిద్దాలంటే వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు మరిన్ని అవసరం వుందని అన్నారు. చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తి తయారీ ప్లాంట్లలో ఒక మెగావాట్ విద్యుత్తు తయారీకి అవసరం అయ్యే ప్లాంటు నిర్మాణానికి రూ.25 కోట్లు మేర ఖర్చు అవుతుందని. అలాగే ఒక మెగావాట్ విద్యుత్తు తయారీకి సగటున 2.5 టన్నులచెత్త అవసరం అవుతుందని ఈ ప్లాంట్ల ఏర్పాటుతో స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని తెలిపారు. పంచాయతీల్లో చెత్తనిర్వహణకు సంబంధించి క్లస్టర్ల వారీగా అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలని అన్నారు. డంపింగ్ యార్డ్‌లు లేని పంచాయతీలను సాకారం చేసేందుకు వర్క్ షాపులను నిర్వహించేలా చూడాలని స్పష్టం చేశారు.



శనివారం లక్నోలో 'నౌసేన శౌర్య వాటిక' ప్రారంభోత్సవం దృశ్యం

## మహిళా సాధికారతలో 'బ్రాండిక్స్' భేష్

>> తీయ ఎగుమతులు, దిగుమతుల ప్రక్రియను బ్రాండిక్స్ ఇండియా డైరెక్టర్, భారతీయ భాగస్వామి దొరస్వామి మంత్రికి క్షుణ్ణంగా వివరించారు. ఫ్యాక్టరీ అంతటా పర్యటించి కార్మికుల పనితీరును, వారికి కల్పిస్తున్న వసతులను పరిశీలించిన కేంద్రమంత్రి, యాజమాన్యం తీసుకుంటున్న శ్రద్ధను ప్రత్యేకంగా అభినందించారు.కోటి పెట్టుబడికి 50 మందికి ఉపాధిఅనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న ఏకైక రంగం టెక్స్‌టైల్స్ (జౌళి) మాత్రమేనని మంత్రి గిరిరాజ్ సింగ్ స్పష్టం చేశారు. గార్మెంట్ రంగానికి ఉన్న ఉపాధి సామర్థ్యంపై కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్స్‌టైల్ రంగంలో పెట్టే ప్రతి రూ. 1 కోటి పెట్టుబడికి సుమారు 50 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందని ఆయన వెల్లడించారు. బ్రాండిక్స్ వంటి భారీ పరిశ్రమల ఏర్పాటు వల్ల గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు, యువతులు వేల సంఖ్యలో ఉద్యోగాలు సాధిస్తూ ఆర్థికంగా స్థిరపడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. బ్రాండిక్స్ రాకతో ఈ ప్రాంతంలో మహిళా సాధికారత గణనీయంగా పెరిగిందని స్థానికులు తనకు స్వయంగా తెలిపారన్నారు. ఇంట్లో ఒక మహిళ ఆర్థికంగా బలోపేతమైతే ఆ కుటుంబమంతా వృద్ధి చెందుతుందన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుల ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో సరికొత్త విప్లవంభవిష్యత్తు అంతా సాంకేతిక వస్త్రాల దేనని కేంద్ర మంత్రి చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగిన సమావేశంలో ఈ రంగం అభివృద్ధిపై తాము సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ప్రస్తుతం సాధారణ దుస్తులతో పాటు ఏరోస్పేస్, డ్రోన్లు, రక్షణ, వైద్య, వ్యవసాయ రంగాలలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ వినియోగం విపరీతంగా పెరుగుతోందని వివరించారు. ఈ సరికొత్త విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, బ్రాండిక్స్ తరహాలో మరిన్ని పరిశ్రమలు ఇక్కడికి వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్ర పారిశ్రామిక రంగానికి బలమైన ఊతం లభిస్తుందని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జౌళిశాఖ ఉన్నతాధికారులు, బ్రాండిక్స్ ప్రతినిధులు

# సంతకం చేయని ట్రంప్

### ముందుకు కదలని శాంతి ఒప్పందం

### పశ్చిమాసియాలో మరింత పెరిగిన ఉద్రిక్తతలు

**వాషింగ్టన్, మే 30:** మధ్యప్రాచ్యంలో నెలల తరబడి సాగుతున్న భీకర యుద్ధానికి ముగింపు పలికే దిశగా దౌత్య వ్యూహాలు వేగవంతమయ్యాయి. ఇరాన్‌తో శాంతి ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు, దానిపై ఒక తుది నిర్ణయం తీసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోని అత్యంత సురక్షితమైన సిచ్యువేషన్ రూమ్‌లో సలహాదారులతో సమావేశం అయ్యారు. ఈ చర్చల తర్వాత అతి త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా ఒక సంచలన ప్రకటన రాబోతోందని ఆయన సంకేతాలిచ్చారు.అయితే కాల్పుల విరమణ పొడిగింపు ఒప్పందంపై సంతకం చేయకుండానే వెనుదిరిగినట్లు వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదరాలంటే ఇరాన్ ప్రభుత్వం తమ కఠినమైన షరతులకు లొంగాల్సిందేనని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో అల్టిమేటం జారీచేశారు.

ఇరాన్ తన అణ్వాయుధ ఆశయాలను పూర్తిగా వదిలి పెట్టాలి. భవిష్యత్తులో ఇరాన్ దగ్గర ఎలాంటి అణు బాంబులు ఉండకూడదని హామీ ఇవ్వాలి. అంతర్జాతీయ చమురు, వాణిజ్య రవాణాకు గుండెకాయ లాంటి హార్ముజ్ జలసంధిని తక్షణమే రెండు వైపులా తెరవాలి. ఎలాంటి టోల్ టాక్స్ లేకుండా, ఎవరి జోక్యం లేకుండా అంతర్జాతీయ నౌకల రాకపోకలను అనుమతించాలి. హార్ముజ్ జలమార్గంలో ఇరాన్ అమర్చిన భయంకరమైన సముద్రపు మైన్లను తక్షణమే తొలగించాలి. ఇరాన్ వద్ద ఉన్న అత్యంత ప్రమాదకరమైన సుసంపన్న యురేనియం నిల్వలను నాశనం చేయడంపై అమెరికా ప్రత్యేక ప్లాన్ సిద్ధం చేసింది. దాదాపు 11 నెలల క్రితం అమెరికాకు చెందిన శక్తివంతమైన బి2 బాంబర్ యుద్ధ విమానాలు ఇరాన్ అణు కర్మాగారాలపై దాడి చేశాయి. భూగర్భంలో పాతిపెట్టుకుపోయిన ఆ సుసంపన్న యురేనియం పదార్థాన్ని ఇప్పుడు అమెరికా, ఇరాన్ మరియు అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీలు ఉమ్మడిగా తవ్వితీసి పూర్తిగా నాశనం చేస్తాయని ట్రంప్ స్పష్టంచేశారు. ఈ ఒప్పందంలో తదుపరి నోటీసు ఇచ్చేంతవరకు ఎలాంటి డబ్బు మార్పిడి (ఆర్థిక సహాయం) ఉండదని తేల్చిచెప్పారు.

# వందల కోట్లు వసూలు

>> పేర్కొంది. వైసీపీ నేత చెవిరెడ్డితో కలిసి పలుమార్లు విదేశీ పర్యటనలు చేసినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డితో కలిసి చార్టర్డ్ విమానాల్లో ప్రయాణిస్తూ, దేశ విదేశాల్లోని అత్యంత ఖరీదైన హోటళ్లలో బస చేస్తూ కోట్లాది రూపాయలు విలాసాలకు తగలేసినట్లు సిట్ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. మద్యం అక్రమ లావాదేవీల ద్వారా వసూలైన లెక్కల్లో లేని భారీ నగదును దాచడానికి నిందితులు ఒక ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) పలు నగరాల్లోని విలాసవంతమైన అపార్ట్‌మెంట్లను కేవలం నగదు దాచడానికే అద్దెకు తీసుకున్నారు. ఆ ఫ్లాట్లలోని రహస్య ప్రదేశాల్లో పెద్ద ఎత్తున నగదు కట్టలను భద్రపరిచినట్లు సిట్ ఆరోపించింది.ఈ గుట్టు మొత్తాన్ని సిట్ అధికారులు పక్కా టెక్నికల్ ఆధారాలతో బట్టబయలు చేశారు. నిందితుల మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌ల నుంచి సేకరించిన డేటాను డిజిటల్ ఫోరెన్సిక్ విశ్లేషణ చేయడం ద్వారా ఈ వాస్తవాలన్నీ వెలుగులోకి వచ్చాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు, లొకేషన్ డేటా, వాట్సాప్ చాట్‌లను సమగ్రంగా క్రోడీకరించి ఎసిబి కోర్టుకు సమర్పించారు.సిట్ దాఖలు చేసిన ఈ తాజా ఛార్జిషీట్ ఆధారంగా రాబోయే రోజుల్లో మరికొందరు కీలక నేతలకు, అధికారులకు నోటీసులు వచ్చే అవకాశం ఉందనే చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో గట్టిగా వినిపిస్తోంది. కేసులో నిందితుడు కట్టా ప్రణయ్ ప్రకాశ్ ఫోన్‌లను సిట్ అధికారులు ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించి విశ్లేషించగా చిత్రాలతో వైఎస్సార్సీ ముఠా బండారం బయటపడింది. మార్చి 2న ప్రణయ్ ప్రకాశ్‌ను అరెస్ట్ చేసిన సిట్ అధికారులు అతని నుంచి 3 ఫోన్లు స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపించారు. ఆ నివేదికలను తాజాగా న్యాయస్థానానికి సమర్పించారు. మద్యం లంచాల సొమ్ము భద్రపరిచేందుకు తాడేపల్లి సమీపంలోని ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసుకున్న డెన్‌కు ప్రణయ్ ప్రకాశ్ నిర్వాహకుడిగా ఉన్నారు. ఆ సొత్తును గత సార్వత్రిక ఎన్నికల్లో పంపిణీ కోసం ఎప్పటికప్పుడు వైఎస్సార్సీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి మనుషులకు చేర్చడంలో కీలక పాత్రధారిగా వ్యవహరించారు.కట్టా ప్రణయ్ ప్రకాశ్‌తో వైఎస్సార్సీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి టాంజానియాలో చెట్టాపట్టాలు వేసుకుంటూ తిరిగారు. మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొమ్ముతో టాంజానియాలో ఇనుప ఖనిజ కర్మాగారం ఏర్పాటుచేయాలని, జింబాబ్వే సహా పలు ఆఫ్రికా దేశాల్లో పెట్టుబడులు పెట్టాలని వైఎస్సార్సీ ముఠా ముమ్మర యత్నాలు చేసింది. అక్కడ సాధ్యాసాధ్యాల అధ్యయన బాధ్యతల్ని ప్రణయ్ ప్రకాశ్‌కు అప్పగించింది. ఈ కేసు నిందితులైన చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి, వారి సన్నిహితుడు వెంకటేశ్ నాయుడు 2025 జనవరిలో టాంజానియాకు వెళ్లారు. ఆ దేశంలోని దార్ ఎస్ సలామ్ ప్రాంతంలో 2025 ఫిబ్రవరిలో ప్రణయ్ ప్రకాశ్ జూలియస్ నైరేరే అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద చెవిరెడ్డి బాస్కరరెడ్డిని కలిసి చెట్టపట్టాలు వేసుకుని తిరిగారు. టాంజానియాలో కట్టా ప్రణయ్ ప్రకాశ్ చెవిరెడ్డి భాస్కర రెడ్డితో కలిసి 6 రోజులు ఉన్నారు. ఆఫ్రికా దేశాల్లో పెట్టుబడులపై చర్చించారు. మద్యం లంచాల సొమ్ము ఎన్నికల్లో పంపిణీ చేసిన విషయం ఎవరికీ చెప్పొద్దని ప్రణయ్ ప్రకాశ్‌ను చెవిరెడ్డి బాస్కరరెడ్డి ఆదేశించినట్లు సిట్ చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు.మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీలు, బ్రూవరీస్ నుంచి నగదు రూపంలో వసూలు చేసిన లంచాల సొమ్ము దాచేందుకు అక్కడి నుంచి మరో చోటుకు తరలించేందుకు వైఎస్సార్సీపీ ముఠా హైదరాబాద్, అమరావతిల్లో పలుచోట్ల డెన్‌లు ఏర్పాటు చేసుకుంది. వాటిలో హైదరాబాద్ ఖాజాగూడ సర్కిల్‌లోని ఉమాహిల్ క్రెస్ట్ అపార్ట్‌మెంట్ ఒకటి. అక్కడ 2021 జులై 12న ఫొటో తీసుకున్నారు.

చిత్రంలో కనిపిస్తున్న నోట్ల కట్టలన్నీ వివిధ డిస్టిలరీలు, వారి ప్రతినిధుల నుంచి వైఎస్సార్సీ ముఠా వసూలు చేసిన లంచాల సొమ్మే. 2021 జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు బాలాజీ ఎంటర్‌ప్రైజెస్, ఎలైట్ వింటేజ్ విస్కీ బ్రాండ్ ప్రతినిధుల నుంచి వసూలు చేసిన లంచాల సొమ్ము. నెక్టార్ బాట్లింగ్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్, సత్యనారాయణ అనే వ్యక్తి నుంచి వసూలు చేసిన లంచాల సొమ్ము ఉంది. ఓ అట్టపెట్టెలో 20.07 లక్షల రూపాయలు, మరోదానిలో రూ.4 లక్షలు, ఇంకో దానిలో రూ.4.36 లక్షలు ఉన్నట్లు పైన రాసి డెన్‌లో భద్రపరిచారు. మద్యం కుంభకోణం కేసు ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి, మరో నిందితుడు ఈశ్వర్ కిరణ్‌కుమార్ రెడ్డి ఓ ఖరీదైన పబ్‌లో అమ్మాయిలతో ఎంజాయ్ చేస్తున్నట్లు చిత్రంలో ఉంది. మద్యం లంచాల సొమ్ముతో వీరు ఎంత విలాసవంతమైన జీవితం గడిపారో చెప్పేందుకు ఇదో నిదర్శనంగా సిట్ చార్జిషీట్‌లో వివరించింది.

# తిరుమల సమాచారం

### జూన్ 2న వేణుగోపాలస్వామి ఆలయంలో

## కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి అనుబధంగా ఉన్న చిత్తూరుజిల్లా కార్వేటినగరంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జూన్ 2వతేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. ఆ రోజు దయం 7.30 గంటల నుండి 11 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు జూన్ 6 నుండి 14వ తేదీ వరకు జరగనున్నాయి. ఆలయ సంప్రదాయం ప్రకారం బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితరాలను పవిత్ర జలాలతో శుద్ధి చేస్తారు. అనంతరం నామ




కోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. ఈ మహోన్నత కార్యక్రమం అనంతరం ఉదయం 11.30 గంటల నుండి భక్తులను స్వామివారి సర్వ దర్శనానికి అనుమతించనున్నారు.

## సింహవాహనంపై సుదర్శన నరసింహుడు



**తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లాలో నారాయణవనంలోని పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం సింహ వాహనంపై సుదర్శన నరసింహుడి అలంకారంలో శ్రీనివాసుడు భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. అనంత తేజోమూర్తిగా వెలసిన స్వామిసింహవాహనాన్ని అధిరోహించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ ధర్మాన్ని చాటిచెప్పారు. పరాక్రమం, ధైర్యం, తేజస్సు, ఆధిపత్యానికి ప్రతీకైన సింహరూప దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక పారవశ్యంలో మునిగిపోయారు. వాహనం ముందు భక్త బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో గోవింద నామస్మరణ చేస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ అత్యంత వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి స్వామివారి కటాక్షాన్ని పొందారు. సింహవాహనోత్సవం ద్వారా అజ్ఞానాన్ని తొలగించి ధర్మమార్గంలో నడవాలని, విజయస్ఫూర్తితో జీవించాలని శ్రీవారు సందేశమిచ్చారు. రాత్రి 7గంటలకు ముత్యపుపందిరి వాహనంపై స్వామిభక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా గోవిందరాజస్వామి రథోత్సవం

**తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గోవింద నామ స్మరణలతో తిరువీధులు మార్మోగగా, వేలాది మంది భక్తులు భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం 5.40 గంటలకు ప్రారంభమైన రథోత్సవం కర్ణాల వీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు మీదుగా తిరిగి ఆలయ రథమండపానికి చేరుకుంది. మార్గమంతా భక్తులు టెంకాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారికి మంగళారతులు అర్పించారు. రథోత్సవం కేవలం ఉత్సవం మాత్రమే కాదు, ఆత్మజ్ఞానాన్ని బోధించే మహత్తర తాత్త్విక సందేశం. ఆత్మను రథికుడిగా, శరీరాన్ని రథంగా, బుద్ధిని సారథిగా, మనసును పగ్గంగా, ఇంద్రియాలను గుర్రాలుగా, విషయాలను వీధులుగా భావించడం ద్వారా ఆత్మ-అనాత్మ వివేకాన్ని ఈ ఉత్సవం భక్తులకు బోధిస్తుంది.

**వేడుకగా స్నపన తిరుమంజనం:** రథోత్సవం అనంతరం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామికి, నమ్మాళ్వార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రథోత్సవంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టిటిడిబోర్డు సభ్యుదు జి.




భానుప్రకాశ్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ ఏబీ నారాయణ చౌదరి, ఆలయ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, పోలీసు అధికారులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం 5.30 నుండి 6 గంటల వరకు ఊంజల్‌సేవ జరగనుంది. రాత్రి 7 నుండి 9 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

**నేడు కపిలతీర్థంలో చక్రస్నానం:** గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరగా ఆదివారం ఉదయం 8 నుండి 9.30 గంటల వరకు కపిలతీర్థం (ఆళ్వార్ తీర్థం)లో చక్రస్నానం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు స్వామివారు, అమ్మవార్లు తిరుచ్చిపై, చక్రతాళ్వార్ పల్లకీలో కపిలతీర్థానికి ఊరేగింపుగా బయలు దేరనున్నారు. చక్రస్నానం అనంతరం పీఆర్ తోటకు వేంచేపు చేసి, సాయంత్రం 6 గంటలకు తిరిగి ఆలయానికి చేరుకుంటారు.

## గరుడునిపై విహరించిన వేదనారాయణుడు



**తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని చిత్తూరుజిల్లా నాగలాపురంలోని వేదనారాయణస్వామి ఆలయంలో శనివారం కంచి గరుడసేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. కాంచీపురంలోని వరదరాజస్వామి ఆలయంలో జరిగే ప్రసిద్ధ గరుడసేవను పురస్కరించుకుని, వేదనారాయణస్వామి ఆలయంలో ఈ గరుడసేవను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఉదయం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత సర్వాలంకార భూషితుడైన వేదనారాయణస్వామి ఉదయం గరుడవాహనంపై గ్రామ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. గరుడునిపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. వేదఘోషలు, మంగళవాయిద్యాల నడుమ సాగిన ఈ దివ్యోత్సవం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలను పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



## రూ.1.13కోట్ల విద్యుత్ బస్సు విరాళం

### రూ.20లక్షలు విలువైన 15 ట్యాబ్‌ల అందజేత

**తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడికి దాత భారీ విరాళాలిచ్చారు. యాత్రికుల సౌకర్యార్థం తిరుమలలో నడిచేందుకు విద్యుత్ బస్సును, మరో 15ట్యాబ్‌లను విరాళం ఇవ్వడం ప్రత్యేకత. ఢిల్లీలోని నయాతి హెల్త్ కేర్ రీసెర్చ్ ఆగ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నీరారాడియా 1.13 కోట్ల విలువైన విద్యుత్ బస్సు విరాళమిచ్చారు. బస్సుతో బాటు మరో 20లక్షలు విలువైన 15 ట్యాబ్‌లు అందజేశారు. తిరుమలలో భక్తుల కోసం నడుపుతున్న ఉచిత ధర్మరథం సేవలోఈ కొత్త బస్సు రావడంతో మరింత సౌకర్యవంతంగా ఉంటుందని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలను కాలుష్య రహిత పుణ్యక్షేత్రంగా మార్చేందుకు టిటిడి చేస్తున్న కృషికి దాత నీరా రాడియా సహకారం అమూల్యమన్నారు. ఈ విరాళం పర్యావరణ హిత కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు దోహదపడనుందన్నారు. శనివారం ఉదయం తిరుమలలో శ్రీవారి ఆలయం ఎదుట ఈ కొత్త బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాత నీరా రాడియా బస్సు తాళాలను, రికార్డులను టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు. దాతృత్వానికి నిదర్శనంగా నిలిచిన నీరా రాడియాకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే కొండపై ఉచిత ధర్మరధాలు 20 బస్సులు ఉండగా, వాటిలో 14 ఇప్పటికే విద్యుత్ బస్సులే ఉన్నాయి. ఈ బస్సులు 21 బస్ స్టాప్‌ల మీదుగా రోజూ 380 ట్రిప్పులు తిరుగుతూ భక్తులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నాయి. త్వరలోనే మిగిలిన డీజిల్ బస్సుల స్థానంలో కూడా పూర్తిగా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడమే తమ లక్ష్యమని టిటిడి ఛైర్మన్ నాయుడు వివరించారు. అనంతరం ఛైర్మన్, అదనపు ఇఒ దాతతో కలిసి బస్సులో ప్రయాణించి, ప్రయాణికులకు ఈ బస్సు చాలా సౌకర్యవంతంగా ఉందని దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒలోకనాథం, మాజీ బోర్డు సభ్యుడు డి.పి. అనంత, రవాణాశాఖ డీఐ

### సామాన్య భక్తులకు అరుదైన అవకాశం

# మొన్న అభిషేకం..నిన్న తోమాలసేవ వీక్షణ

**తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకొండపై సామాన్య భక్తులకు ఏడుకొండలస్వామి దర్శనం మరింతగా సంతృప్తికరంగా అందించే దిశగా టిటిడి అధికారులు తీసుకుంటున్న ప్రణాళికల్లో మొన్న అభిషేకసేవను కన్నులారా వీక్షించారు. సామాన్యభక్తులకే ప్రాధాన్యతనిస్తున్నామని చెబుతున్న టిటిడి అధికారులు అందుకు తగ్గట్లు శుక్రవారం వేకువజామున తిరుమలేశునికి నిర్వహించే తోమాలసేవ సమయంలోనూ సామాన్యభక్తులను ఆలయంలోపలకు అనుమతించి దర్శనం చేయించడం మరో ప్రత్యేకత. సామాన్య భక్తులకు ఇదో అరుదైన అవకాశంగా భావించి తన్మయత్వం పరవశులయ్యారు. సాధారణంగానే తిరుమలకు వారాంతం శుక్ర,శని, ఆదివారాల్లో విపరీతంగా భక్తులు తరలిరావడం జరుగుతుంది. అలాంటిది వేసవిసెలవులు కొనసాగుతుండటం, మరోవైపు వారాంతం కూడా కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ మరింత పెరిగింది. గత ఇరవై రోజుల నుండి భక్తులతో ఏడుకొండలు కిటకిట లాడుతున్నాయి. కొండపై ఆలయ మాడవీధులన్నీ గోవింద నామస్మరణలతో మార్మోగిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ వేసవిలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. శిలా తోరణం



వరకూ భక్తుల క్యూ లైన్ విస్తరించింది. ఇదే సమయం లో టిటిడి అధికారులు సర్వదర్శన భక్తులకు తోమాల సేవలో శ్రీవారి దర్శన అవకాశం కల్పించడంతో మాటల్లో చెప్పలేనిదిగా వర్ణిస్తున్నారు. గత శుక్రవారం వేకువజామున శ్రీవారి అభిషేకసేవలో తరించిన సామాన్య సర్వదర్శనం భక్తులు ఈ శుక్రవారం తోమాలసేవను వీక్షిస్తూ ఇష్టదైవాన్ని దర్శించుకోవడం అనుభూతికి లోనయ్యారు. ఇదిలా ఉండగా మరో పదిరోజుల్లో వేసవి సెలవులు పూర్తి కావస్తుండటం మరోవైపు దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభం కానుండటంతో తిరుమలకు భక్తులు తరలివస్తున్నారు. ప్రస్తుతం రోజూ 1,500 శ్రీవాణి టికెట్ల పై శ్రీవారి దర్శనం చేయిస్తున్నారు. ఇప్పటికే శ్రీవాణి ట్రస్టుకు విరాళాలు అందజేసి దర్శనం కోసం ఎదురు చూస్తున్న దాతలు సుమారుగా 40వేల మందికిపైగా ఉన్నారనేది టిటిడి వర్గాల సమాచారం. వీరికి ప్రత్యేకంగా దర్శన టికెట్లు ఇవ్వాలని టిటిడి నూతన సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. నూతన విధానంతో అమలుకానున్న శ్రీవాణి బ్రేక్‌లో జూన్ 10వ తేదీ నుండి ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. 2027 మార్చి31 వరకు ఈ విధానం అమలుకానుంది. వేకువజామున శ్రీవారికి నిర్వహించే తోమాల, అర్చనసేవ సమయాల్లో సర్వదర్శన భక్తులను దర్శనానికి అనుమతించాలని నిర్ణయించారు.

గతంలోనూ ఈ విధానం అమలయ్యేది. అయితేశుక్రవారం అభిషేకసేవ అనంతరం జరిగే తోమాల సేవ సమయం తక్కువ ఉందనే భావనతో సామాన్య భక్తులను దర్శనానికి అనుమతించే విధానాన్ని పదేళ్ళ ముందు రద్దు చేశారు. ప్రస్తుతం వేసవిసెలవుల్లోనూ భక్తుల రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో శుక్రవారం తోమాల సేవలో ఇరవై నిమిషాల వ్యవధిలో దాదాపు 1,500 మందికి దర్శనం చేయించారు.

## చరిత్ర జాడల అన్వేషణకు ఎఎస్ఐకి అనుమతి

### వన్యప్రాణులు, అటవీ పరిరక్షణ లక్ష్యాలకు భంగం కలగకుండా అటవీ శాఖ సహకారం: డి.సిఎం పవన్



**విజయవాడ, మే 30, ప్రభాతవార్తప్రతినిధి:** జీవ వైవిధ్యంతో పాటు చారిత్రక పురావస్తు, సాంస్కృతిక సంపదకు నిలయాలు. అలాంటి అమూల్యమైన వారసత్వ సంపదను గుర్తించి, సంరక్షించడంతోపాటు మన చరిత్ర, సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన అవసరం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అటవీ ప్రాంతాల్లోని చారిత్రక కట్టడాలు, పురావస్తు అవశేషాలు ఎకో టూరిజం అభివృద్ధికి సరి కొత్త అవకాశాలు సృష్టిస్తాయని తెలిపారు. ప్రకృతి, వారసత్వ సంపదల పట్ల ప్రజల్లో చైతన్యం కలిగిస్తాయని అభిప్రాయపడ్డారు. నల్లమల అటవీ ప్రాంతంలో దాగి ఉన్న అమూల్యమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను గుర్తించి, సంరక్షించేందుకు, శాసనాల సర్వే నిర్వహించేందుకు భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ)కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. గతంలో వైఎస్ఆర్ కడప జిల్లాలోని లంకమల అటవీ ప్రాంతంలో నిర్వహించిన సర్వేలో క్రీస్తు పూర్వ 1వ శతాబ్దం నుంచి క్రీస్తుశకం 16వ శతాబ్దం వరకు సుమారు 30శాసనాలు వెలుగు చూశాయి. 10 వేల సంవత్సరాల నాటి గుహ చిత్రాలను గుర్తించారు. ఈ శాసనాలు శాతవాహనుల కాలం, బౌద్ధ, శైవ సంప్రదాయాలతో పాటు ప్రాచీన యాత్రా మార్గాలను, ఆది మానవ జీవన విధానాలకు సంబంధించి విలువైన సమాచారాన్ని వెలుగులోకి తెచ్చాయి.

భారత పురావస్తు సంస్థ చేపట్టనున్న తాజా సర్వే తెలుగు, దేవనాగరి లిపుల్లో లిఖించిన శాసనాలపై దృష్టి సారించి మన ప్రాచీన రాజ్యాలు, సంస్కృతి, సంప్రదాయాలు, దక్షిణ భారత చరిత్రను మరింత లోతుగా అధ్యయనం చేసే వీలు కల్పిస్తుంది. ఈ సర్వేపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏఎస్ఐ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ, అటవీ పరిరక్షణ లక్ష్యాలకు భంగం కలగకుండా రాష్ట్ర అటవీ శాఖ అధికారులు పూర్తి సహకారం అందించాలన్నారు. ప్రకృతి సంపదతోపాటు సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ భావితరాలకు అందించే విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తుంద

## డిఎస్సీ నిర్వహణపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం

### విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్

**విజయవాడ,మే30,ప్రభాతవార్తప్రతినిధి:** డీఎస్సీ నిర్వహణపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు. డీఎస్సీ నియామక ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించినట్లు తెలిపారు. డీఎస్సీలో మెరిట్ ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేశామని ఆయన పేర్కొన్నారు. మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ నియామక ప్రక్రియకు రాష్ట్రవ్యాప్తంగా 3.36 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని శశిధర్ తెలిపారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై 226 కేసులు దాఖలైనప్పటికీ, కేవలం 148 రోజుల్లోనే నియామకాలను పూర్తి చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించిందని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. 154 టీసీఎస్ అయాన్ కేంద్రాల్లో విజయవంతంగా పరీక్షలను నిర్వహించినట్లు కోన శశిధర్ తెలిపారు. డీఎస్సీ ప్రశ్నాపత్రాన్ని ఎవరూ మానిప్యులేట్ చేయలేరని స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రం తయారీ నుంచి పరీక్ష నిర్వహణ వరకు పూర్తి స్థాయిలో భద్రతా ప్రమాణాలను పాటించినట్లు వివరించారు. ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలను యాక్సెస్ చేసే అవకాశం కేవలం ఇద్దరు సీనియర్ అధికారులకు మాత్రమే ఉంటుందని తెలిపారు. క్వశ్చన్ బ్యాంక్ పాస్‌వర్డ్‌లు ప్రతిరోజూ మారుతూ ఉండటంతో భద్రత మరింత కఠినంగా ఉంటుందని చెప్పారు. ఆ ఇద్దరు అధికారులు మాత్రమే టీసీఎస్ సిస్టంలో ప్రశ్నలను అప్‌లోడ్ చేస్తారని, పరీక్ష రోజు ప్రశ్నాపత్రం జంబుల్డ్ రూపంలో అభ్యర్థులకు అందుతుందని పేర్కొన్నారు. ప్రశ్నలు ఎన్‌క్రిప్ట్ చేయబడిన విధంగా ఉంటాయని, వాటిని డీకోడ్ చేయడం అసాధ్యమని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా అనేక ప్రతిష్టాత్మక పరీక్షలు ఇదే విధానంలో నిర్వహిస్తున్నట్లు కోన శశిధర్ తెలిపారు. ఏపీ హైకోర్టు సహా అనేక సంస్థల పరీక్షలు కూడా ఇదే విధానంలో నిర్వహిస్తారని వివరించారు.

టీసీఎస్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, కఠినమైన భద్రతా ప్రోటోకాల్ అమల్లో ఉన్నాయని, ఎక్కడా విధాన ఉల్లంఘనలకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఫలితాల ప్రకటన ప్రక్రియలోనూ పారదర్శకత పాటించినట్లు తెలిపారు. డ్రాఫ్ట్ కీ విడుదల చేసిన తర్వాత అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, ఫైనల్ కీని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అన్ని జిల్లాల స్కోర్లను 11వ తేదీన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వెల్లడించారు.

## కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదాం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు హరినాథరెడ్డి




**తిరుపతి, మే30ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికా సామ్రాజ్యవాదానికి, ట్రంప్ విధానాలకు లొంగిపోయి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్లే దేశంలో ఆర్థిక సంక్షోభం, విపరీతమైన ధరల పెరుగుదల దాపురించాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పెంచిన ధరలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. తిరుపతి నగరం బైరాగపట్టెడలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్‌లో శనివారం నదియా అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన హరినాథరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు. ప్రజలను ఖర్చులు తగ్గించుకోవాలని, ప్రయాణాలు మానుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్న పాలకులు, తాము మాత్రం విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారని విమర్శించారు. ఒకరోజు సైకిల్ తొక్కి పొదుపు చర్యలంటూ షో చేసిన నాయకులు, మరుసటి రోజు నుంచే యధాప్రకారంగా కాన్వాయ్‌లతో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.

**జూన్ 1 నుంచి ప్రచారం:** కేంద్రంలోని బిజెపి వైఫల్యాలను, ఈ దుస్థితిని ప్రజలకు వివరించడానికి రాష్ట్రంలోని వామపక్షాలన్నీ కలిసి కార్యాచరణ రూపొందించినట్లు హరినాథరెడ్డి ప్రకటించారు. జూన్ 1 నుండి 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా కరపత్రాలు, సభలు, సమావేశాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిద్దామని, 9వ తేదీ కేంద్ర వైఫల్యాలపై రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహిద్దామన్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, తొమ్మిదో తేదీన జరిగే రాస్తారోకోను విజయవంతం చేయాలని హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

### విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లు

### డివిజన్ల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు



**తిరుపతి,మే 30ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడీసీఎల్ పరిధిలో కొన్ని జిల్లాల్లో బలమైన గాలి, వర్షం కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వుండాలని ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి శనివారం తెలిపారు. బలమైన గాలి, వర్షం కురుస్తున్న నేపథ్యంలో ఎపిఎస్పిడిసిఎల్ అధికారులు, సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు ఒక్కో జిల్లాకు చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయి అధికారిని నోడల్ ఆఫీసరుగా నియమించినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, కండక్టర్, విద్యుత్ స్తంభాలు తదితర పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సంస్థ పరిధిలో సర్కిల్స్, డివిజన్స్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాలి, వర్షం ప్రభావిత ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడం కోసం అధికారులు/సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అందుబాటులో వుండాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపడడం లాంటి సంఘటనలను గుర్తించినట్లయితే తక్షణమే సమీపం లోని విద్యుత్ శాఖ అధికారులు/సిబ్బందికిగానీ, విద్యుత్ బిల్లుపై ముద్రించబడిన తమ ప్రాంత అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నంబరుకుగానీ లేదా టోల్ ఫ్రీనంబర్లు: 1912 , 1800 425 155333కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా సంస్థ వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సిఎండి శివశంకర్ సూచించారు.

## కుప్పంలో పోలీసుల విచారణకు హాజరైన పూడి శ్రీహరి

**కుప్పం, మే 30 ప్రభాతవార్త** మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాజీ సిపిఆర్ఒ, వైకాపా ప్రధాన కార్యదర్శి (మీడియా) పూడి శ్రీహరి శనివారం కుప్పంలో పోలీసుల విచారణ నిమిత్తం హాజరయ్యారు. ఉదయం 11.30గంటల ప్రాంతంలో ఆయన కుప్పం అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. సిఎం చంద్రబాబునాయుడుపై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని తెదేపా నేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గతంలో పూడి శ్రీహరిపై కుప్పం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఆపై కోర్టు గత నెల 30న బెయిల్ మంజూరు చేసింది. అయితే పూడి శ్రీహరికి 35సి(3)బిఎన్ఎస్ కింద నోటీసులు జారీ చేయాలని సైతం కోర్టు ఆదేశించింది. దీంతో పూడి శ్రీహరి శనివారం కుప్పం పోలీస్‌స్టేషన్‌కు విచారణ నిమిత్తం హాజరయ్యారు. కుప్పం డిఎస్పీ పార్థసారథి, సిఐ మల్లేష్ యాదవ్‌లు కేసు విషయంగా పూడి శ్రీహరిని విచారించినట్లు సమాచారం.

## 15 మంది వైద్య విద్యార్థుల డిబార్

**విజయవాడ,మే30, ప్రభాతవార్తప్రతినిధి:** డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎంబీబీఎస్, బీడీఎస్, బీపీటీ, వైద్య పీజీ, ఆయుష్ కోర్సుల వార్షిక పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 21 మంది విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంది. పరీక్షలు పూర్తయిన 15 మందిని ఏడాది పాటు డిబార్ చేసినట్లు వీసీ డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలిపారు. వీరిలో ఆరుగురు ఎంబీబీఎస్, 8 మంది బీడీఎస్, ఒకరు బీపీటీ విద్యార్థులు ఉన్నారు. మిగిలిన ఆరుగురిపై పరీక్షలు ముగిసిన తర్వాత చర్యలు తీసుకోనున్నారు. మాస్ కాపీయింగ్ జరిగిన పరీక్ష కేంద్రాల కళాశాలలకు రూ. 50 వేల జరిమానా విధించారు.

## ఆర్టీసీని ప్రైవేటీకరించే యోచన లేదు: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

**విజయవాడ,మే30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని రవాణా మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. ఏపీఎస్ఆర్టీసీ ఆర్థికంగా నిలకడగా ఉందని, సంస్థకు రూ. 30వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా, ఆర్టీసీ ప్రయాణ ఛార్జీలను పెంచే ఉద్దేశం కూడా లేదని ప్రయాణికులకు తీపి కబురు చెప్పారు. సంస్థను మరింత ఆధునికీకరించేందుకు త్వరలోనే కొత్తగా 2,500 ఎలక్ట్రిక్, 500 సీఎన్జీ బస్సులను ప్రవేశపెట్టబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, కార్మికుల సమస్యలన్నింటినీ రెండేళ్లుగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న అవసరమైన ఉద్యోగాలను కూడా త్వరలోనే భర్తీ చేస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్ఆర్టీసీ ప్రైవేటీకరణ కాబోతోందంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతుంది. ప్రైవేటీకరణ వార్తల నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంప్లాయీస్ యూనియన్ నిరసనలు చేపట్టింది. ఈ ప్రచారంపై రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టతను ఇచ్చారు.

## వడదెబ్బ మృతులకు రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

### సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

**విజయవాడ, మే30ప్రభాతవార్తప్రతినిధి:** వడదెబ్బ మృతులకు రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి శనివారం సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎండలు తీవ్రత వలన వడదెబ్బ తగిలి అనేకమంది మృత్యువాతపడుతున్నారని తెలిపారు. ప్రకృతి విపత్తుల నిధి కింద చనిపోయినవారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. ఉపాధి పథకం సహా అసంఘటిత కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో తగు విశ్రాంతి, ఉపశమనం కలిగించాలని కోరారు. గతంలో ఎన్నడూ లేనంత 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. మే నెల ప్రారంభం నుండి ఈ వడగాడ్పులు మొదలయ్యాయని తెలిపారు మే 22 న ఒక్కరోజే 21 మంది మరణించారని చెప్పారు. అందునా విజయవాడలో 10 మంది మరణించారని తెలిపారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుండి ఉపశమన చర్యలు చేపట్టాలని సిపిఐ(యం) కోరుతున్నదని వి.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు.

## 12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలి

### లిక్కర్ కుంభకోణం ఆరోపణలపై వైఎస్ జగన్ సమాధానం ఇవ్వాలి: మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

**చిత్తూరు, మే 30 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం సత్వరం 12వ పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల చిన్నచూపు చూస్తోందని ధ్వజమెత్తారు. పెరిగిన నిత్యవసర వస్తువులతో ఉద్యోగుల తమ కుటుంబాలను పోషించుకోలేక సతమతమవుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ గత నెల రోజులుగా 12వ పిఆర్‌సిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెండు వారాల్లోపు కేబినెట్ సమావేశాల్లో పెట్టి 12వ పిఆర్‌సిని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.




శనివారం మీడియతో మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నేత చింతామోహన్

అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 4 డిఎలు రావాల్సి వుందని, వీటిని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించకుండా అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన 4 డిఎలను సైతం సత్వరం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు 30 వేల కోట్ల రూపాయలు బకాయి పడిందని, ఈ బకాయిలను ఒక నెల రోజుల్లో చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లిక్కర్ కుంభకోణం నిధులు విదేశాలకు వెళ్ళాయని వార్తలు చక్కర్లు కొడుతున్నాయని, ఈ లిక్కర్ కుంభకోణం ఆరోపణలపై మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పందించి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రానికి 19 సంవత్సరాల పాటు ముఖ్య మంత్రిగా పని చేశానని చెప్పుకుంటున్న సిఎం నారా చంద్రబాబునాయుడు సొంత జిల్లా కేంద్రం చిత్తూరుకు ఏం చేశారని ఆయన నిలదీశారు. కుప్పం, పులివెందులకు మంచినీటిని తీసుకువచ్చానని చెప్పుకుంటున్న సిఎం చిత్తూరుకు ఒక్క గ్లాసు నీటినైనా తెచ్చావా! అని నిలదీశారు. అలాగే దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిలు సైతం జిల్లా కేంద్రం చిత్తూరుకు ఏం తీసుకురాలేదని ఆరోపించారు. తాను ఎంపిగా వున్న సమయంలో చిత్తూరుకు వేలూరు సిఎంసి ఆసుపత్రిని తీసుకువచ్చానని, చిత్తూరులో మంచి మెడికల్ కళాశాల ఏర్పాటు కానుందని ఆయన పేర్కొన్నారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Rayapudi, Thullur Mandal, Amaravati-522237 (A.P.)
NIT No. 02 MAU61-USI0HB(OTH)/93/2026-HB/2nd call, Dt. 30-05-2026
E-PROCUREMENT SHORT TENDER NOTICE (SECOND CALL)
Name of Work: "Engaging of Technical persons for Carpenters, Plumbers, Operators for Operation & Maintenance of Secretariat Buildings:1 to 6 and WTP & STP at AP Secretariat, IGC, Velagapudi for 24 Months". - Estimated Amount: Rs.1,44,00,000/-.
The bid can be downloaded on AP e-procurement portal from 01.06.2026 to 09.06.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid 09.06.2026 up to 15.00 Hrs. Technical bid opening 09.06.2026 @ 16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Rayapudi

# పెట్రో ధరల పెంపుతో అన్ని రంగాలు కుదేలు

పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో ఇల్లు కట్టుకోవాలంటే సామాన్యుడు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంధన ధరలపెరుగుదలవల్ల రవాణా ఛార్జీలు, ముడి సరుకుల ధరలు, కార్మికుల వేతనాలు అమాంతంపెరిగాయి. దీంతో మొత్తం నిర్మాణవ్యయం 5శాతం వరకు పెరిగేఅవకాశం ఉంది. సిమెంట్, ఇసుక, ఉక్కు (స్టీల్), ఇటుకలు వంటి నిర్మాణ సామగ్రిని దూర ప్రాంతాల నుండి హైదరాబాద్ లేదా ఇతర నగరాలకు తీసుకురావడానికి రవాణా ఛార్జీలు భారీగా పెరిగాయి. జేసీబీలు, మిక్సర్లు, క్రేన్లు ఇతర హెవీ మెషినరీ నడపడానికి డీజిల్ అత్యవసరం. ఇంధన ఖర్చులు పెరగడంతో కాంట్రాక్టర్లకు రోజువారీ నిర్వహణ ఖర్చులు తడిసిమోపడవుతున్నాయి. రవాణా వ్యయం పెరగడంతో ఆటోమేటిక్‌గా సిమెంట్, స్టీల్ వంటికీలకమైన నిర్మాణ సామగ్రి ధరలు మార్కెట్‌లో పెరుగుతున్నాయి. నిర్మాణ వ్యయం పెరగడంతో డెవలపర్లు/రియల్టర్లు అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల ధరలను పెంచవలసివస్తుంది. ఫలితంగా సొంత ఇల్లు, స్థలాలుకొనాలనుకునే సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడుతోంది. ఇంధన ధరలపెరుగుదలతో ద్రవ్యోల్బణం పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రోజువారీ జీవనం సాఫీగా సాగాలంటే కార్మికులుసైతం తమవేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ముడిచమురు సంక్షోభంఇలాగే కొనసాగితే, రానున్న రోజుల్లో ధరల మంట మరింత భయంకరంగా ఉండబోతోందనిఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో పెట్రోధరలు మరింతగా పెరుగుతాయన్న ఆందోళనల నేపథ్యంలో పరిమితి ఆదాయం లేని నల్లధనస్వాములకు ఏధరఎంత పెరిగినా ఇబ్బంది ఉండకపోవచ్చేమో కాని రెక్కాడితే డొక్కాడని రోజువారీ కూలీలు, నిరుపేద, మధ్యతరగతి ప్రజల జీవితాలను మాత్రం కోలుకోలేని దెబ్బతీయడం ఖాయంగా కనిపిస్తోంది.

**బోగిని మల్లికార్జున్**

ఇంధన ధరల పెంపుతో పలు రంగాలు కుదేలవుతున్నాయి. పెట్రో ధరల పెంపు ప్రతికూల ప్రభావం రవాణా రంగంపైనే కాకుండా వ్యవసాయం, నిర్మాణ రంగం, ఫుడ్ ఇండస్ట్రీ ఇలా పలు రంగాలను కుదుపు కుదేపేస్తోంది. పెట్రో ధరల పెంపు ఇలానే కొనసాగితే మార్కెట్‌లో ద్రవ్యోల్బణం పెరిగి, బ్యాంక్ వడ్డీ రేట్లు కూడా పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పెట్రో ధరల పెంపు ఇంతటి ఆగిపోదని, రానున్న రోజుల్లో మరింత పెరుగుతాయన్న నిపుణుల హెచ్చరికలు అన్నివర్గాల ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. లీటరు పెట్రోల్, డీజిల్ ధర రూ.150ని తాకే అవకాశముందన్న ప్రచారం దేశ ఆర్థిక మార్కెట్‌ను కుదిపేస్తోంది. వాస్తవానికి దేశంలో పెరుగుతున్న ఇంధన ధరలు ముందుగా సామాన్య ప్రజలు, వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరగడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను రోజుల వ్యవధిలోనే నాలుగుసార్లు పెంచాయి. ఈ పెంపుతో పెట్రోల్, డీజిల్ రేట్లు రెండేళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలోగత 11 రోజుల్లో పెట్రోల్, డీజిల్ రేట్లు సగటున రూ.8మేర పెరిగాయని చెప్పొచ్చు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు పరభావం అత్యంత వేగంగా, నేరుగా పడేది రవాణారంగం పైనే. ప్రతి రోజూ ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, సొంత వాహనాలు వాడే వారిపై తక్షణ భారం పడుతోంది. లారీలు, ట్రక్కుల నిర్వహణ ఖర్చుల్లో కేవలం డీజిల్ వాటానే దాదాపు 55శాతంగా ఉంటుంది. దీనికితోడు టైర్లు, ఇన్సూరెన్స్, టోల్ ఛార్జీలు, మెయింటెనెన్స్ ఖర్చులు ఇప్పటికే పెరిగాయి. ఇప్పుడు లీటరుకు రూ. 8 మేర ధర పెరగడంతో రవాణా వ్యాపారం నిర్వహించడం యజమానులకు అదనపు భారంగా మారింది. అలాగే క్యాబ్ సర్వీసులు, ఆటోలు, స్కూల్ బస్సులు, అంతరాష్ట్ర బస్సు ఛార్జీలు రాబోయే రోజుల్లో మరింత పెరగనున్నాయి. వాస్తవానికి దేశ ఆర్థిక వ్యవస్థకు డీజిల్ ఒక వెన్నెముక లాంటింది. దేశంలోని సప్లై చైన్, లాజిస్టిక్స్ రంగాలతోపాటు వ్యవసాయ రంగం పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో తీవ్రంగా ప్రభావితమవుతోంది. డీజిల్ ధరలు పెరగడంతో ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు సరకు రవాణా ఛార్జీలను పెంచడం ప్రారంభించాయి. దీనివల్ల ఒక నగరం నుంచి మరో నగరానికి సరుకులను తరలించే ఖర్చు పెరుగుతోంది. నిర్వహణ ఖర్చులు భరించలేక కొన్ని ప్రాంతాలలో రవాణా వాహనాలను షెడ్లకే పరిమితం చేస్తు




న్నట్లు తెలుస్తోంది. లారీలు, ఇతర వాణిజ్య వాహనాలకు డీజిల్ ప్రధాన ఇంధనం. పెట్రో ధరలు వరుసగా పెరుగుతుండడంతో సరుకు రవాణా వ్యయం విపరీతంగా పెరుగుతోంది. ఆర్టీసీ బస్సుల నిర్వహణ ఖర్చులు పెరిగి, సంస్థలపై అదనపు భారం పడుతుంది. హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల్లో ఆటోలు, క్యాబ్‌లు నడుపుకునే డ్రైవర్ల రోజువారీ ఆదాయం తగ్గి, జీవనం కష్టతరంగా మారుతుంది. పెట్రో ధరల పెంపుతో దేశవ్యాప్తంగా సామాన్యుడి నెలవారీ బడ్జెట్‌ను ప్రభావితం చేస్తుంది. వరుసగా పెట్రో ధరల పెంపు సామాన్య, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్‌పై తీవ్రమైన అదనపు భారాన్ని మోపుతోంది. ముఖ్యంగా డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా, లాజిస్టిక్స్ రంగానికి అయ్యే ఖర్చులు గణనీయంగా పెరగబోతున్నాయి. పెరిగి పెట్రోధరలకు అనుగుణంగా సరుకు రవాణా ఖర్చులు పెరిగి ఆ ప్రభావం నిత్యావసర వస్తువులైన పాలు, కూరగాయలు, గుడ్లు, బ్రెడ్ వంటి రోజువారీ వస్తువుల ధరలపై పడుతోంది. రవాణా వ్యయం పెరిగిన ప్రతిసారీ మార్కెట్లో వస్తువుల ధరలు ఆటోమేటిక్‌గా పెరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి లారీలద్వారా వచ్చే టమాటాలు, ఉల్లిపాయలు, ఆకు కూరలు, పండ్ల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. అలాగే పాడి పరిశ్రమలకు రవాణా ఖర్చులు పెరగడం వల్ల పాల ప్యాకెట్ల ధరలను సైతం పెంచుతున్నాయి. నిత్యావసర సరుకులు, ప్యాక్ చేసిన ఆహార పదార్థాల పంపిణీ వ్యయం పెరిగిపోతోంది. పెట్రో ధరలపెంపుతో వంట నూనెల ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఒకప్పుడు కిలో రూ.140 ఉన్న వంట నూనె ధర ఇప్పుడు రూ.190కి చేరింది. మధ్యతరగతి ఇళ్లల్లో ఎక్కువగా వాడే 15 కేజీల ఆయిల్ టిన్ ధర రూ. 2,200 నుండి రూ. 2,800 కి పెరగడం గమనార్హం. ఇవే కాకుండా హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా ఫుడ్ రేట్లు భారీగా పెరిగిపోయాయి. తలకిందులవుతున్న మధ్యతరగతి బడ్జెట్‌ఈ ధరల పెరుగుదల వల్ల సగటు కుటుంబాల నెలవారీ బడ్జెట్ 20 శాతం వరకు పెరిగిపోయింది. ఆఫీసులకు, పనులకు వెళ్లే టూవీలర్ వాహనదారులకు నెలకు వెయ్యి రూపాయలకుపైగా అదనంగా పెట్రోల్ ఖర్చవుతోంది. "జీతాలు పెరగడం లేదు కానీ, ఖర్చులు మాత్రం రోజురోజుకూపెరిగిపోతున్నాయి. గతంలో నెల సామాన్లకు రూ.20 వేలు ఖర్చయితే, ఇప్పుడు రూ. 24వేలవుతోంది. పిల్లల చదువులు, ఇతర ఖర్చులు చూసుకోవడమే కష్టంగా మారింది, ఇక పొదుపు అనే ముచ్చటే లేదు అని స్థానిక పౌరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క ఆకాశాన్నంటుతున్న పెట్టుబడులు, ఇంకోవైపు కంటిమీదకునుకు లేకుండా చేస్తున్న ప్రకృతి వైపరీత్యాలు, వీటన్నింటికీ తోడు పండిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇప్పటికే కొట్టుమిట్టాడుతున్న అన్నదాతలకు పెట్రోభారం ఊపిరాడకుండాచేస్తోంది. ఇటీవల వరుసగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు వ్యవసాయ రంగాన్ని కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. లీటరుపై ఏకంగా రూ.8 వరకు ధరలు పెరగడంతో సాగుఖర్చులు భారమై రైతులు విలవిలలాడుతున్నారు. సాగులో కీలకమైన ట్రాక్టర్ ఎక్కాలన్నా, పంటకు నీటిని సరఫరా చేసే ఇంజన్ నడవాలన్నా డీజిలే ముఖ్యం. ఆధునిక వ్యవసాయంలో ప్రతి పనికీ యంత్రాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. పొలం దున్నడానికి, నాట్లువేయడానికి, పంట కోతలకు, చివరకు పండించిన ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించాలన్నా ట్రాక్టర్లు, లారీల అవసరం తప్పనిసరి. వీటన్నింటికీ డీజిలే ఇంధనం. ఇప్పుడు లీటరు ధర అమాంతం పెరిగిపోవడంతో ఎకరాకు అయ్యే సాగుఖర్చు వేలల్లో పెరిగిపోయింది. 'పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చేలా లేదు, ఇక వ్యవసాయం దండగ అనే పరిస్థితి వస్తోంది' అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకోకుండా, రైతాంగాన్ని ఆదుకోవడానికి తక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించి వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుండి గట్టెక్కించాలని రైతుసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వరుసగా డీజిల్ ధరలు పెరుగుతూపోతే వ్యవసాయ పెట్టుబడి విపరీతంగా పెరిగిపోయి రైతులకు లాభాలు గాల్లో కలిసిపోతాయి. ఇది అంతిమంగా దేశంలో తీవ్రమైన ఆహార ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని మార్కెట్‌వర్గాలు భయపడుతున్నాయి. మరోవైపు పెట్రో ధరలపెంపు దెబ్బకు బస్సు ఛార్జీలు, క్యాబ్, ఆటోల రేట్లు అమాంతం పెరగడంతోనే ఆగిపోదని, మనకు రోజూ అలవాటైన స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ యాప్స్, అలాగే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈకామర్స్ సంస్థల డెలివరీ చార్జీలు కూడా భారీగా పెరగబోతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కంపెనీలు తమపైపడే ఈ డీజిల్ భారాన్ని తగ్గించుకోవడానికి కస్టమర్లకు ఇచ్చే డిస్కౌంట్లలోకోత విధించడం లేదా డెలివరీ ఛార్జిలను పెంచడం ఖాయంగా కనిపిస్తోంది. హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే, డాబర్, మారికో వంటి ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీలు ఇప్పటకే ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు పడుతున్నాయి. ఇప్పుడు పెరిగిన రవాణా ఖర్చులు వారి లాభాల మార్జిన్లను మరింత దెబ్బతీస్తాయి. ఇంధన ధరలు ఇలాగే కొన్ని నెలల పాటు కొనసాగితే, కంపెనీలకు రెండు మార్గాలు మాత్రమే మిగులుతాయి. ఒకటి సబ్బులు, బిస్కెట్లు, సర్ఫ్ వంటి ఉత్పత్తుల ధరలను 2 నుండి 5 శాతం పెంచడం లేదా ధర అంతే ఉంచి ప్యాకెట్ బరువును తగ్గించడం. అదే సమయంలో పెట్రోధరల పెంపు పర్యాటక రంగాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ●

# తుపాను వెలిసిందా!

**ఎ.వి.వి ప్రసాద్**

కర్ణాటక

ఒక తుపాను వెలిసింది. లేదు లేదంటూనే గత ఏడెనిమిది నెలలుగా సాగుతున్న సంక్షోభానికి తెరపడింది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామాచేయడం, డిప్యూటీగా ఉన్న డికె శివకుమార్‌కు కాంగ్రెస్ అధిష్ఠానం తలుపులు తెరవడం 'సజావు'గానే సాగిపోయాయి. అధికార మార్పిడి కార్యక్రమం అనేక అపోహలు సృష్టించినా, చివరికి అంతా ప్రశాంతంగానే సాగిందని చెప్పాలి. తేలవలసిన అంశాలు ఇంకా ఒకటి రెండు ఉన్నా, అవి కూడా తేలికగానే సర్దుబాటు కావచ్చు. ఎందుకంటే కాంగ్రెస్‌లో అధిష్ఠానం నిర్ణయమే 'ఫైనల్' గనుక. అధిష్ఠానం చెప్పింది గనుక తాను అధికారం నుంచి వైదొలగుతున్నాననీ, కానీ పూర్తి కాలం సేవలందించాలన్నదే తన అభిమతమనీ సిద్ధరామయ్య చెప్పడాన్ని బట్టి ఆయన వ్యూహం ఎలా ఉండబోతుందనేది తేలికగానే అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ అధిష్ఠానమంటే రాహుల్ గాంధీయే. సోనియా, ఖర్గే కూడా ఈ అంతంత మాత్రమే. సిద్ధరామయ్య కొనసాగడానికి ప్రియాంక గాంధీ మద్దతు ఇచ్చినా, రాహుల్ మాత్రం డికె వైపే మొగ్గు చూపారనీ, దీనిలో ఖర్గే పాత్ర ఏమీ లేదనే అంటున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడుగా ఉన్న ఖర్గే పేరు కూడా కొత్త సిఎం పదవికి ఒక దశలో ప్రచారమైంది. అయితే తనకు అలాంటి ఉద్దేశమేదీ లేదని ఖర్గే స్పష్టం చేశారు. నిజానికి 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడే డికె శివకుమార్ సిఎం అవుతారని అంతా భావించారు. అయితే సామాజిక వర్గాల ప్రాధాన్యత దృష్ట్యా అప్పటికి సిద్ధరామయ్యకు సిఎం సీటు ఇచ్చినా, రెండున్నరేళ్ల తర్వాత డికెకు అప్పగించే విధంగా అప్పట్లో ఇరువర్గాల మధ్య 'అంగీకారం' కుదిరిందనీ, అధిష్ఠానం ఆమోదంతోనే డికె తన వ్యూహాలు రూపొందించారనీ అంటున్నారు. దాని ప్రకారం గత నవంబరులో రెండున్నరేళ్లు పూర్తి కాగానే డికెకు సిఎం పీఠం అప్పగించాలనే డిమాండ్ మొదలయింది. కానీ తనకు ప్రజలలో అమితమైన ఆదరణ ఉన్నదనీ, అధిష్ఠానం తననే అధికారంలో కొనసాగే అవకాశం ఇస్తుందనీ సిద్ధరామయ్య అంటూ వచ్చారు. డికె మాత్రం నిబ్బరంగా 'అంతా అధిష్ఠానం చూసుకొంటుందనే భరోసాతో కాలం గడిపారు. గత

ఏడెనిమిది నెలలుగా అటు సిద్ధరామయ్య, ఇటు డికె ఎవరి ప్రయత్నాలు వారు చేస్తూ వచ్చినా, గత మంగళవారం ఢిల్లీలో ఇరువర్గాలు అధిష్ఠానంతో జరిపిన చర్చల తర్వాత ఒక స్పష్టత వచ్చింది. మరో రెండేళ్లలో జరిగే ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి రావడమే టార్గెట్‌గా అధిష్ఠానం పావులు కదిపింది. డికెకు నాయకత్వం అప్పగిస్తే 'అదనపు ప్రయోజనాలు' కనిపించడంతో, రాహుల్ ఆ మార్పిడికే మొగ్గు చూపారనే అభిప్రాయం వినిపించింది. ఆరోజున అధికార మార్పిడిపై దాదాపు ఏడు గంటల పాటు చర్చలు జరిగినా అసలు ఆ విషయమే ప్రస్తావనకు రాలేదని కాంగ్రెస్ నేతలు బుకాయించారు. కానీ ఆ రాత్రికే సిద్ధరామయ్య తాను వైదొలగుతున్నట్లు



సిద్ధరామయ్య

ప్రకటించడంతో సమీకరణాలు త్వరత్వరగా మారిపోయాయి. డికెకు పీఠం అప్పగిస్తే ఎవరెవరికి డిప్యూటీ సిఎం పదవులు లభిస్తాయనే చర్చలు వెల్లువెత్తాయి. నలుగురి పేర్లు తెరపైకి వచ్చాయి కూడా. దానిపై మళ్లీప్రతిష్టంభన ఏర్పడింది. సిద్ధరామయ్య కురుబ సామాజిక వర్గానికి చెందినా, ఆయన నిర్మించిన 'అహింద' కూటమిలో మైనారిటీలు, ఒబిసిలు, దళితులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ఆయన బలమంతా ఆ కూటమిలోనే ఉంది. శివకుమార్ వొక్కళిగ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో మెజారిటీ నియోజకవర్గాల్లో ఆయనకూ అంతే బలంఉంది. అయితే వొక్కళిగ ఓట్లు కొంత శాతం దేవెగౌడ, కుమారస్వామి నాయకత్వంలోని జెడిఎస్ కు కూడా వెళ్తాయి. కానీ 'అత్యంత సంపన్నుడైన నేత'గా శివకుమార్‌కుగల 'అదనపు బలం' అధిష్ఠానం ఆయన వైపు మొగ్గు చూపేట్లు చేసిందని చెప్పవచ్చు. ఎన్నికల సమయంలోపార్టీని ముందుకు నడిపించగల 'సంపన్న నేత' అవసరం గనుక అధిష్ఠానం మద్దతు ఆయనకే లభించింది. అధికార మార్పిడి సజావుగా సాగినా, 'దెబ్బతిన్న పులి' ఊరికే ఉండదు కదా! తనకు రాజ్యసభ పదవి వంటివి అవసరం లేదనీ, ఎమ్మెల్యేగా 'క్రియాశీలక' రాజకీయాల్లోనే ఉంటాననీ సిద్ధరామయ్య అంటున్నారు. ఆ మాటలను బట్టి ఆయన వ్యూహం ఏమిటో తేలికగానే అర్థమవుతుంది. వివాదాస్పదమైన వెనుకబడిన తరగతుల కమిషన్ సామాజిక, ఆర్థిక కులగణన నివేదికను రాజీనామాకు కొన్నిగంటల ముందు బుధవారం ఆమోదించడం ద్వారా సిద్ధరామయ్య వ్యూహం ఎలా ఉండబోతుందనేది తెలుస్తోంది. అది రొటీన్‌గా జరగవలసిందే అయినా, రాజీనామాకు కొంచెం ముందు మాత్రమే చర్య తీసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కులగణన నివేదిక నిజానికి గత యేడాదే వచ్చినా కొన్ని సామాజిక వర్గాలకు ఆగ్రహం తెప్పించడం ఇష్టం లేక దానిని పక్కన పెట్టారు. కానీ ఇప్పుడు హఠాత్తుగా ఆమోదించడం వెనుక రాజకీయకారణాలు ఉన్నాయనే భావిస్తున్నారు. గత తొమ్మిదేళ్లలో రెండు సార్లు కులగణన జరిగినా, ఆ నివేదికలు అమలు కాలేదు. ఇప్పుడు వాటిని అమలు చేస్తే ఎన్నికల్లో కొత్త సమస్యలు ఉత్పన్న మవుతాయి. తాను సిఎంగా కొనసాగి ఉంటే సిద్ధరామయ్య ఆ నివేదికను ఆమోదించే వారు కాదేమో! కానీ చివరలో ఆమోదించి వెళ్తున్నారు గనుక దాని పర్యవసానాలు కొత్త ప్రభుత్వం ఎదుర్కొనవలసి వస్తుంది. లింగాయత్ సిఎం అయిన వీరేంద్ర పాటిల్‌ను 1990లో రాజీవ్ గాంధీ హఠాత్తుగా తొలగించినప్పటి నుంచి కాంగ్రెస్ ఆవర్గానికిదూరమైంది. పార్టీ తాజాచర్య కూడా మళ్లీ అటువంటి పరిణామాలకే దారి తీయవచ్చు. ఒక తుపాను వెలిసిందికానీ మరో తుపాను రాకుండా పార్టీ అధిష్ఠానం ఆపగలదా! చూడాలి. సిద్ధరామయ్య తలుచుకొంటే 'అహిందా' బలంతో మరో ఉద్యమాన్ని సృష్టించగలరు. ఏం చేస్తారో మరి! ●

# ఎడారిలో 'అణు' కాంప్లెక్స్!

**గన్ని మోహన్**

చైనా

సరిహద్దుల్లో స్థావరాలు ఏర్పాటు చేయడం, తమ సొంతగ్రామాలుగా ఆక్రమిత స్థలాల్లో పాగాలు వేయడం డ్రాగన్‌కు అలవాటన్నది జగమెరిగిన సత్యమే. తనకు ఎదురయ్యే ముప్పులన్నింటినీ ఎదుర్కొనేందుకు వీలుగా ఏకంగా ఒకమిలిటరీ కాంప్లెక్స్‌నే నిర్మిస్తోంది చైనా. జిన్‌పింగ్ హయాంలో పెరుగుతున్న సామ్రాజ్య విస్తరణ కాంక్షకు తోడు ప్రత్యర్థుల మూకుమ్మడి దాడులు చేసినా ధీటుగా తట్టుకునేందుకు వీలుగా ఎప్పటికప్పుడు తన ఆయుధ సంపత్తిని, సైనిక స్థావరాలను మెరుగుపరచుకుంటూ వస్తోంది. తాజాగా చైనాలోని ఒక మారుమూల ఎడారిలో భారీ సైనిక సముదాయానికి రూపకల్పన చేస్తున్న డ్రాగన్ తన చుట్టూ పొంచి ఉన్న ముప్పును ముందే పసిగట్టినట్లుగా తెలుస్తోంది. ఇరాన్‌కు ఆయుధసాయం అందిస్తున్నదన్న భావన అమెరికాలో ఎప్పటి నుంచో ఉంది. మరోవైపు రష్యా, చైనా దోస్తీ సుతరాము ఇష్టంలేదు. ఇక తైవాన్ తమదేనని ఇప్పటికీ చైనా చెపుతూనే ఉంది. దక్షిణచైనా సముద్రజలాలపై మాదే హక్కు అని చాటిచెపుతున్న సంగతి తెలిసిందే. వీటన్నింటితోపాటు నేపాల్ సరిహద్దుల్లోనే తమ చైనా భాషలో గ్రామాలు ఏర్పాటు చేస్తోంది. తద్వారా నేపాల్‌ను భారత్‌పైకి ఉసిగొలిపే చర్యలుచేపట్టింది. తాజాగా చైనా వద్ద ఉన్న అణ్వాయుధాలు అమెరికాలోని ఆనగరాన్ని లక్ష్యంగా చేసుకున్నా ఛేదిస్తాయి. అత్యంత సుదూర శ్రేణి క్షిపణులు కలిగి ఉన్న అణుస్థావరాల సమీపంలోనే బీజింగ్ ప్రయోగాలు, బంకర్లు, కమ్యూనికేషన్‌తో కూడిన విస్తారమైన కాంప్లెక్స్‌ను నిర్మిస్తోంది. చైనా రూపొందించిన సుదూర లక్ష్యంఉన్న క్షిపణి తలచుకుంటే అమెరికాను చుట్టుముట్టేసి రాగలదని ఇప్పటికే రూఢీ అయింది. తన అణు పరిరక్షణ ప్రణాళికలో భాగంగా ఈ క్షిపణులున్న ప్రాంతంలో భారీగా రక్షణ కాంప్లెక్స్‌ను నిర్మిస్తోంది. అష్టభుజి ఆకారంలో నిర్మిస్తున్న ఈ కాంప్లెక్స్‌లలో అణు క్షిపణుల లాంచ్‌పాడ్స్ కూడా ఒక అంతర్భాగం. అలాగే సంచార వైమానిక రక్షణరంగ క్షిపణుల లాంచ్‌పాడ్‌లు, ఎలక్ట్రానిక్ యుద్ధసామగ్రి నిల్వ కేంద్రాలు వంటివికూడా ఉన్నాయి. అమెరికా రక్షణరంగ నిపుణుల అంచనాలప్రకారం చూస్తే ఇంతభారీ ఎత్తున ఎడారి ప్రాంతంలో వాయవ్య ప్రాంతంలో ఈ భారీస్థావరాలు ఏర్పాటు చేస్తున్నందంటే ముప్పు ఉండబోదని చెప్పలేమని కూడా చేస్తున్న వ్యాఖ్యలు ప్రపంచ దేశాలు అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ప్రత్యేకించి పొరుగుననే ఉన్న భారత్‌కు సైతం ఎప్పటికైనా ముప్పే. తమ భారీ అణుస్థావరాలను పరిరక్షించుకోవడంతో పాటు శత్రువుల నుంచి ఎలాంటి ముప్పు ఎదురైనా లిప్త పాటుకాలంలో అధిగమించే సామర్థ్యంతో ఈ నిర్మాణంసాగుతోంది. అంతేకాకుండా వేలాది చదరపు కిలోమీటర్లఎడారి ప్రాంతాన్ని కూడా కవర్ చేసు కుంటూ లక్ష్యాన్ని ఛేదించగలిగే క్షిపణులు చైనా సొంతం. చైనా సైన్యం, జలాంతర్గాములు, విమానాల నుంచి అణ్వాయుధాలను ప్రయోగించ



జిన్‌పింగ్

గలిగినప్పటికీ చైనాకు వాయవ్యంగా ఉన్న జిన్‌జియాంగ్ ప్రాంతం, గాన్సు ప్రాదేశిక ప్రాంతంలోని సిలో క్షేత్రాలే ఇపుడున్న అణ్వాస్త్రాల భద్రతకు ప్రధాన కేంద్రంగా ఉంది. చైనా అభివృద్ధి చేస్తున్న అణుసామర్థ్యం కట్టడికి అమెరికాచేస్తున్న యత్నాలు ఎప్పటికప్పుడు విఫలం అవుతున్నాయి. ఇటీవలి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పర్యటనలోకూడా ప్రస్తావనకు వచ్చినా సఫలంకాలేదు. చైనా అభివృద్ధిచేస్తున్న ఈ అణుస్థావరాలు హామీ అణుక్షిపణి క్షేత్రాలకు నైరుతి దిశగా ఉన్నాయి. రెండు కేంద్రాలు ఎడారిప్రాంతంలోనే రూపుదిద్దుకోవడం చూస్తుంటే ఎప్పటికైనాఇరుగు పొరుగు దేశాలతోపాటు అమెరికాకు కూడా ముప్పుపొంచి ఉందనే చెప్పాలి. అంతేకాకుండా అణుక్షిపణుల లాంచ్‌పాడ్‌లు కూడా ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే ఉత్తర ఆక్టగాన్ చుట్టూ భారీ వాహనాలతో సైనిక, అణు విన్యాసాలు కూడా జరిగినట్లు నిఘా వర్గాలు చెపుతున్నాయి. రెండో ప్రపంచ యుద్ధం ముగిసి 80 ఏళ్లయిన సందర్భంగా చైనా ఇటీవల నిర్వహించిన ఆయుధ ప్రదర్శనలో అణుక్షిపణులను కూడా ప్రదర్శించింది. అంతేకాకుండా భారీ వాహనాల్లో ఖండాంతర అణుక్షిపణులను కూడా విన్యాసాల్లో ప్రదర్శించి చైనా ప్రపంచ దేశాలకు తన సత్తాచాటింది. చైనా రూపొందిస్తున్న ఈ మిలిటరీ కాంప్లెక్స్ తన ఆయుధ పరిరక్షణ, భవిష్యత్తు ప్రయోగాలకోసమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. అయితే చైనాకు ముప్పు ఎవరివైపు నుంచిఉంటుందన్నది ఇతిమిద్ధంగా చెప్పలేం. చైనా దురాక్రమణకు పాల్పడుతున్న దేశాలకు వత్తాసుపలికే దేశాల నుంచే ముప్పుఉంటుందని చైనాకుకూడాతెలుసు. అందుకోసమే సర్వసన్న ద్ధంగా ఉండేందుకు ఈ భారీ అణుక్షిపణి కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసుకుంటోంది. ఇప్పటికే సిక్కిం, భూటాన్ సరిహద్దుల్లోను, నేపాల్ సరిహద్దుల్లోను స్థావరాలు, గ్రామాలు ఏర్పాటుచేసు కున్న చైనా అమెరికా లక్ష్యంగా తన సురక్షిత స్థావరాలను ఏర్పాటు చేసుకుంటున్నదనే భావించాలి. అమెరికాతో ఉన్నవివాదమల్లా చైనాకు అటుతైవాన్, ఇటు దక్షిణ చైనా సముద్ర జలాలేనని చెప్పాలి. అమెరికాతోపాటు ఇపుడు భారత్, ఆస్ట్రేలియా, జపాన్, బ్రిటన్ మరికొన్ని ఇతర దేశాలు కూడా క్వాడ్‌తో కూడమి కట్టాయి. తైవాన్ తమదేనని చెప్పుకోడానికి కారణంకూడా దక్షిణచైనా సముద్రజలాల వివాదాలే. తమ దేశంలో అంతర్భాగంగా చేసుకుంటే ఈజలాలపై హక్కులు తమవే ఉంటాయన్నది చైనా వ్యూహంగా స్పష్టం అవుతోంది. అందుకోసమే ముందు అగ్రరాజ్యాన్ని ధీటుగా ఎదుర్కొనాలంటే అందుకు అనువైన స్థావరాలు, ఆయుధ సామగ్రిని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇరాన్‌కు కారుచౌక ఆయుధాలను చైనాయే సమకూరుస్తోందన్న అమెరికా ఇప్పటికీ అనుమానం వ్యక్తం చేస్తూనే ఉంది. అత్యంత ఆధునిక ఆయుధ సంపత్తి కలిగిన అమెరికాను ఎదుర్కొనేందుకు తమవద్దఉన్న అణు సంపత్తిని కూడా చైనా సిద్ధం చేసుకుంటోంది. ఈక్రమంలో పొరుగుదేశాలు అప్రమత్తం కావాల్సిన అవసరం కూడా ఎంతో ఉంది. ●

# కోట్లాది ప్రాణాలు హరిస్తున్న ధూమపానం

**రామ కిష్టయ్య సంగన భట్ల**

క్రీస్తు పూర్వం 1400ఏళ్ల నాడే పొగాకు వాడకం మొదలైంది. ఉత్తర, దక్షిణ అమెరికా ప్రాంతాల్లోని స్థానిక తెగల వారు పొగాకును దేవుని కానుకగా పరిగణించే వారు. వేడుకల్లో పొగ తాగేవారు. పొగాకు చుట్టల నుంచి వెలు వడే ధూమమేఘాల ద్వారా తమ ప్రార్థనలు భగవంతుని చేరుకుంటాయని వారు నమ్మేవారు. సొలనేసి కుటుంబానికి చెందిన ఒక చిన్న మొక్క ద్వారా తయారీ వల్ల పొగ విడు దల అవుతున్నందు వలన దీనికి 'పొగాకు' అనే పేరు వచ్చింది. దీని ఆకుల నుండి సిగరెట్లు, చుట్టలు తయారు చేస్తారు. దీనిని కొన్ని రకాల తాంబూలాలలో కూడా ఉపయోగిస్తున్నారు. యూరోపియన్లు అమెరికాలో అడుగు పెట్టడం ప్రారంభమయ్యాక క్రీస్తుశకం 16వ శతాబ్దం నాటికి పొగాకు క్రమంగా యూరోపియన్ దేశాలకు, ఆ తర్వాత శరవేగంగా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. బ్రిటిష్ వారి ద్వారా పొగాకు భారత దేశానికి చేరుకుంది. పొగాకు పరిచయం కావడానికి ముందు భారత దేశంలో ఎక్కువగా గంజాయితోనే పొగ తాగేవారు. ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చిన తొలినాళ్లలో పొగాకును ఔషధంగా పరిగణించే వారు. సిగరెట్ల కంపెనీలు వైద్యులతో వ్యాపార ప్రకటనలు ప్రచారం చేసుకునేవి. 20వ శతాబ్దిలో సగానికి సగం కాలం ఇలాగే గడిచింది. పొగాకు వల్ల క్యాన్సర్ వంటి అనర్థాలు తలెత్తుతున్నట్లు గుర్తించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థసహా పలు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు పొగాకు వ్యతిరేక ప్రచారం ప్రారంభించాయి. పలు ప్రభుత్వాలు కూడా పొగాకు వాడకంపై ఆంక్షలు అమలులోకి తెచ్చాయి. బొలీవియా, పెరూ పొగాకు జన్మస్థలంగా పరిగణించ బడతాయి. క్రిస్టోఫర్ కొలంబస్ యాత్రల ద్వారా ఐరోపాకు తీసుకు రాబడినట్లు, అలా పొగాకు సాగు క్రమంగా ఉత్తర అమెరికా, చైనా, భారతదేశం, పూర్వ యుఎస్ ఎస్ఆర్ భూభాగంలో, ట్రాన్స్‌కా కాసియా, ఉజ్బెకిస్తాన్, కజికిస్తాన్, మోల్డోవా, ఉక్రెయిన్, క్రిమియా, క్రాస్నోదర్ భూభాగంలో పెంచడం క్రమానుగతంగా జరిగాయి. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం మే 31న ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా నిర్వహిస్తారు. పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుంచి ఈ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహి స్తోంది. ప్రపంచ వ్యాప్తంగా 110 కోట్ల మంది పొగ తాగుతున్నా రని, ఏటా పొగాకు కారణంగా 70లక్షల మంది మరణిస్తు న్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. 1987లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన సమావేశంలో 1988, ఏప్రిల్ 7న ధూమపాన రహిత దినోత్సవంగా పిలుపు నిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగ దారులను ఏప్రిల్ 7వ తేదీన 24 గంటలపాటు పొగాకు ఉత్పత్తులను వాడకుండా ఉండమని కోరింది. దానిని అనుసరించి 1988 లో జరిగిన సమావేశంలో ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించింది. ప్రపంచం లోనే అత్యధిక శాతం కిరిబాటి దీవిలో మూడులో రెండొంతుల మంది మగవాళ్లు ధూమ పానానికి అలవాటు పడ్డారు. మూడొంతుల మంది ఆడ వాళ్లు కూడా పొగ తాగుతున్నారు. యూరప్‌లోని మాంటె నెగ్రో దేశంలో 46శాతం మంది ప్రజలకు పొగతాగే అల వాటుంది. గ్రీస్‌లో 50శాతం మంది మగవాళ్లు, 35శాతం మంది ఆడవాళ్లు ధూమపానం చేస్తారు. ప్రపంచం లోనే అత్యధికంగా ఈస్ట్ తైమూర్‌లో 80శాతం మంది మగవాళ్లు పొగ తాగుతారు. కానీ 6శాతం మంది ఆడవాళ్లకుమాత్రమే ఆ అలవాటుంది. రష్యాలో 15ఏళ్లు పైబడిన మగవాళ్లలో 60శాతం మంది పొగ తాగుతున్నారు. 23శాతం మంది మహిళలకు ఆ అలవాటుంది. ఇక తక్కువగా పొగ తాగే




వారు ఉండే దేశాలు ఏవంటే ఘనా, ఇథియోపియా, నైజీరియా, ఎరిత్రియా, పనామా. ఈ ఐదు దేశాలూ అతి తక్కువగా పొగ తాగే దేశాల జాబితాలో ముందు వరుసలో ఉన్నాయి. ఆఫ్రికాలో 14శాతం మంది మాత్రమే పొగ తాగుతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఇటీవలి కాలంలో అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారత దేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గినట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. సిగరెట్లు, బీడీలు, సిగార్లు, హుక్కా వంటి ధూమపానం, గుట్కా నమలడం కోసం పొగాకును వివిధ రకాలుగా విక్రయిస్తారు. నికోటిన్ అనేది పొగాకులో ఉండే ప్రధాన విష పదార్థం. ఇది ధూమపానం వ్యసనానికి దారితీస్తుంది. సిగరెట్లు, బీడీలు, గుట్కాలు, నసెం పొడులు, జర్దా, ఖైనీ, స్మోక్‌లెస్ టొబాకో లాంటి పలు రకాలైన పొగాకు ఉత్పత్తులు పలు ఆకర్షణీయ రూపాల్లో మనల్ని వశపరుచుకునేలా చేస్తాయి. వీటికి తోడుగా పొగతాగేవారితో తిరిగే స్నేహితులు, బంధువులు కూడా సెకండ్ హాండ్ స్మోకర్స్‌గా తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు. అవగాహనలేమి లేదా తెలిసి కూడా పొగాకు ఉత్పత్తుల వాడకంతో నిండుప్రాణాలు ప్రమాదం లో పడడం, చివరికి వైద్య ఖర్చులకు కుటుంబాలు బజారున పడతాయి. ఒక్కోసారి ప్రాణాలు కూడా పోతాయి. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు దురలవాటుతో సాలీనా 8.7 మిలియన్ల ప్రాణాలు పోతున్నాయని, అనేక మిలియన్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతు న్నారని గణాంక వివరాలు స్పష్టం చేస్తున్నాయి. 2026 ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం ఇతివృ త్తంగా అన్‌మాస్కింగ్ ది అప్పీల్ కౌంటరింగ్ నికోటిన్ అండ్‌టొబాగో అడిక్షన్ (పొగాకు కంపెనీలవిజ్ఞప్తుల గుట్టు విప్పడం నికోటిన్, పొగాకు వ్యసనాల్ని వ్యతిరేకిద్దాం)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. పొగాకు ఉత్పత్తులను తయారు చేసే కంపెనీ లు వాడే ప్రమాదకర సువాసనలను వెదజల్లే పదార్థాలను వాడడం, మార్కెటింగ్ విధానాల్లో అనైతిక పద్ధతులు వాడడం, ఆకర్షణీయ ప్యాకేజీలను వాడడం, ప్రము ఖులతో ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం, ప్రమాదకర ఇతర పదార్థాలను వాడడం లాంటి పోకడలను వ్యతిరేకిం చడం జరుగుతున్నది. పొగాకు పరిశ్రమలు గుప్పించే ప్రకటనల విషవలయంలో చిక్కి 37 మిలియన్ల 13-15 ఏండ్ల పిల్లలు కూడా సతమతం అవుతున్నారు. పొగాకు, నికోటిన్ ఉత్పత్తుల పరిశ్రమలు దాదాపు 16,000 రకాల సువాసన కలిగిన రసాయన పదార్థాలను కలుపుతున్నట్లు తెలుస్తు న్నది. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికం. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఊపిరి తిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశంఉంది. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న కేన్సర్‌లు, గుండె జబ్బులు, నాన్‌కమ్యూనికెబుల్ వ్యాధులు (ఎన్ సిడిలు) వంటి దీర్ఘకాల శ్వాసకోశ వ్యాధులు ధూమపానం వలనే సంభవిస్తాయి. పొగాకు తాగేవారు శ్వాస సంబంధిత సమస్యలను కలిగి ఉంటారు. ఎందుకంటే, పొగాకు ఊపిరితిత్తులను పూర్తిగా ప్రమాదానికి గురి చేస్తుంది. అంతేకాకుండా, వీరిలో అధిక శ్లేష్మంతో కూడిన దగ్గు కూడా వస్తుంది. 80 శాతం కంటే ఎక్కువ ఊపిరితిత్తుల క్యాన్సర్ మరణాలకు ధూమపానం కారణమని తెలింది. సిగరెట్లలో 70కిపైగా హానికరమైన క్యాన్సర్ కలిగించే రసాయనాలు ఉంటాయి. ప్రస్తుత కోవిడ్ మహమ్మారి విజృంభించిన నేపథ్యంలో పొగ త్రాగడం చాలా వరకు తగ్గింది. పొగ తాగడం వల్ల నేరుగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపే విషయం వల్ల భయం ప్రధాన కారణం అయితే, లాక్‌డౌన్ కట్టుదిట్టమైన చర్యల వల్ల షాపులు ఎక్కువ సమయం మూసి ఉండడం, ఇళ్ల నుండి బయటికి




# గ్రీన్‌కార్డుపై యుటర్న్

## నిబంధనలు సడలించిన అమెరికా

## వలసదారులు స్వదేశం నుంచి దరఖాస్తు చేయాలనే నిబంధనలో మార్పులు

**వాషింగ్టన్, మే 30:** అమెరికాలో శాశ్వత నివాస హక్కు (గ్రీన్‌కార్డు) నిబంధనల విషయంలో అమెరికా యూటర్న్ తీసుకుంది. గ్రీన్‌కార్డు దరఖాస్తు ప్రక్రియ జరుగుతోన్న సమయంలో వలసదారులు యుఎస్‌ను విడిచి వెళ్లాల్సిన అవసరం లేదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ (డిహెచ్‌ఎస్) తాజాగా వెల్లడించింది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తాత్కాలిక వలసదారులు గ్రీన్‌కార్డు దరఖాస్తులు సమర్పించడానికి స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ (యుఎస్‌సిఐఎస్) ఈ నెల 21న చేసిన ప్రకటన గందరగోళానికి దారితీసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా డిహెచ్‌ఎస్ వివరణ ఇచ్చింది. తాజా ప్రకటనలో డిహెచ్‌ఎస్ స్పందిస్తూ.. ఇదేమీ విస్తృతస్థాయి విధాన మార్పేమీ కాదని వెల్లడించింది. దరఖాస్తుదారుడు గ్రీన్‌కార్డు ప్రక్రియను అమెరికాలో ఉండి పూర్తి చేయాలా? స్వదేశానికి వెళ్లాలా? అన్న దానిని ఇమిగ్రేషన్ అధికారి నిర్ణయిస్తారని తెలిపింది. ఇది ఎప్పటి నుంచో అమలులో ఉన్న నిబంధనే అని పేర్కొంది. ఇమిగ్రేషన్ అధికారులకు ఆ విచక్షణాధికారాన్ని గుర్తు చేయడమే మే 21న ఇచ్చిన మార్గదర్శకాల ఉద్దేశమని వివరించింది. శాశ్వత నివాసం కోరుతున్న వలసదారుల దరఖాస్తుల పరిశీలన జరుగుతున్న సమయంలో కూడా వారు యుఎస్‌లో ఉండేందుకు అనుమతి ఉంటుందని స్పష్టం చేసింది. వీసా ఓవర్‌స్టేలు, ఇమిగ్రేషన్‌కు సంబంధించిన ఇతర ఆందోళనలను మాత్రం తాము పరిగణనలోకి తీసుకుంటామని సూచనప్రాయంగా వెల్లడించింది. డిహెచ్‌ఎస్ వివరణ ఇచ్చినప్పటికీ.. ఎలాంటి పరిస్థితుల్లో గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులు యుఎస్‌ను విడిచి వెళ్లాల్సిన అవసరం ఉంటుందో మాత్రం స్పష్టత ఇవ్వలేదు. దాంతో ఈ వ్యవహారంపై వలసదారుల్లో పలు ప్రశనలు మిగిలే ఉన్నాయి.

# 2.0 ఆపరేషన్ సిందూర్‌కు సైనిక బలగాలు సిద్ధం

## ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది



**న్యూఢిల్లీ,మే 30:** ఒకవేళ అవసరమైతే ఆపరేషన్ సింధూర్ 2.0 చేపట్టేందుకు సైనిక బలగాలు సిద్ధంగా ఉన్నట్లు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. ఆధునిక యుద్ధ రీతుల్లో ఆరితేరేందుకు త్రివిధ దళాలు సన్నద్ధం అవుతున్నాయని ఆయన అన్నారు. భూమి, ఆకాశం, సముద్రంలో అత్యాధునిక రీతిలో సైనిక సామర్థ్యాన్ని పెంచుకుంటున్నట్లు చెప్పారు. పుణెలో జరిగిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఉద్రిక్తల పరిస్థితులు తాత్కాలికంగా అదుపులో ఉన్నా కానీ రాబోయే దశకు చెందిన యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు త్రివిధ దళాలు భీకరంగా రెడీ అవుతున్నట్లు ఆయన చెప్పారు. భవిష్యత్తులో జరగబోయే యుద్ధాలు కేవలం సంప్రదాయ రీతికే పరిమితం కావు అని, సైబర్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్, కాగ్నిటివ్ డోమెయిన్లలోనూ యుద్ధ ప్రభావం ఉంటుందని ఆర్మీ చీఫ్ అన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ తన సత్తా చాటిందన్నారు. సైనిక దళాలు చాలా కచ్చితత్వంతో అటాక్ చేయగలవని నిరూపించామన్నారు. యుద్ధ క్షేత్రంలో జరుగుతున్న మార్పుల పట్ల ఆర్మీ జాగృతతో ఉందని, భవిష్యత్తుకు తగ్గట్లుగా అన్ని దళాలు ఆధునిక విధానంలో సమాయత్తం అవుతున్నాయని అన్నారు. మార్పుల్లో భాగంగా దివ్యాస్త్ర బ్యాటరీలు, శక్తిమాన్ రెజిమెంట్స్, భారత్ బెటాలియన్స్‌తో పాటు ఇతర టెక్నాలజీ ఆధారిత సైన్యాన్ని రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. అన్ని అకాడమీల్లో డ్రోన్ల వినియోగంపై శిక్షణ జరుగుతోందన్నారు. ఎన్డీఏ శిక్షణా కేంద్రంలో భారీ డ్రోన్లు, సిములేటర్లతో ఎన్డీఏ క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంలోనూ ముందంజలో ఉన్నట్లు జనరల్ ద్వివేది తెలిపారు. ఓఓడీఏ అబ్జర్వ్, ఓరియంట్, డిసైడ్, యాక్ట్ చక్రాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఏఐ ఆధారిత సేవల వినియోగాన్ని పెంచుతున్నట్లు చెప్పారు.

# విద్యుత్ బిల్లులపై పదిశాతం సర్‌ఛార్జి వసూలు

## రేపటి నుంచే అమలు

**లక్నో, మే 30:** ఎండ తీవ్రతతో ఇప్పటికే భారీగా కరెంట్ బిల్లులు కడుతున్న సామాన్యుడి నెత్తిన ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం మరో పిడుగు వేసింది. జూన్ నెల నుంచి విద్యుత్ బిల్లులను కనీసం 10 శాతం పెంచుతున్నట్లు ప్రక టించింది. ఇంధన ధరల పెరుగుదల కారణంగా ఫ్యూయల్ సర్‌ఛార్జ్ భారం వినియోగదారులకు తప్పడంలేదని ఉత్తరప్రదేశ్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ శనివారం ఒక అధికారిక ప్రకటన విడుదలచేసింది. ఈ పెరిగిన ధరలు జూన్ నెలలో వచ్చే బిల్లింగ్ సైకిల్ నుండే నేరుగా వర్తిస్తాయని యూపీపీసీఎల్ స్పష్టం చేసింది. నిబంధనల ప్రకారం ఈ ఏడాది మార్చి నెలకు సంబంధించి లెక్కించిన ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ అడ్జస్ట్‌మెంట్ సర్‌ఛార్జ్ మొత్తాన్ని జూన్ నెల బిల్లుల్లో వసూలు చేయడం జరుగుతుంది. మార్చి నెలాఖరు నాటికి ఈ అదనపు భారం 10 శాతంగా తేలింది. దీన్ని అన్ని వర్గాల (గృహ, వాణిజ్య, పారిశ్రామిక) వినియోగదారుల బిల్లులకు అదనంగా చేర్చాలని ఆదేశాలు వచ్చాయని అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ గతేడాది తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారమే ఈ అదనపు సర్‌ఛార్జి ఉంటోందని రెగ్యులేటరీ అఫైర్స్ యూనిట్ చీఫ్ ఇంజనీర్ పంకజ్ సక్సేనా ఒక లేఖలో వివరించారు. ఈ కొత్త రూల్స్ ప్రకారం విద్యుత్ ఉత్పత్తి సంస్థలు కొనుగోలు చేసే బొగ్గు, గ్యాస్ వంటి ఇంధన ధరల్లో వచ్చే మార్పులు లేదా అదనపు ప్రసార ఖర్చుల భారాన్ని మూడు నెలల ఆలస్యం తర్వాత నేరుగా కస్టమర్ల అకౌంట్లలోకి బదిలీ చేసే వెసులుబాటు విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కమ్‌లకు) ఉంటుంది. అందువల్లే మార్చి నెలలో కంపెనీలకు అయిన అదనపు ఖర్చును, కరెక్ట్‌గా మూడు నెలల తర్వాత అంటే జూన్ బిల్లుల్లో 10 సర్‌ఛార్జ్ రూపంలో వసూలు చేస్తున్నారు. ఇప్పటికే దేశంలో ఇంధన ధరలు ఆకాశాన్ని తాకు తుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పుడు కరెంట్ బిల్లులు కూడా 10 శాతం పెరగడం మధ్యతరగతి గృహాల నెలవారీ బడ్జెట్‌ను పూర్తిగా అస్తవ్యస్తం చేయనుంది.

# సంపూర్ణ ఆరోగ్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్!

**వాషింగ్టన్, మే 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై శ్వేతసౌధం ముఖ్య నివేదికను విడుదల చేసింది. ట్రంప్‌మంచి ఆరోగ్యంతో ఉన్నారని, కమాండర్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించడానికి పూర్తిగా ఫిట్‌గా ఉన్నారని ఆ నివేదిక స్పష్టం చేసింది. మంగళవారం వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో ట్రంప్‌కు వైద్య పరీక్షలు నిర్వహించగా, ఆయన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ సీన్ బార్బబెల్లా ఈ నివేదికను నిన్న విడుదల చేశారు. పరీక్షల అనంతరం ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో స్పందిస్తూ, ప్రతి ఆరు నెలలకు జరిగే తన సాధారణ వైద్య పరీక్షలు పూర్తయ్యాయని, అన్నీ పర్ఫెక్ట్‌గా ఉన్నాయని పేర్కొన్నారు. వైద్య సేవలు అందించిన డాక్టర్లు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమగ్ర వైద్య పరీక్షల్లో భాగంగా 22 మంది నిపుణులు సీటీ స్కాన్, క్యాన్సర్ స్క్రీనింగ్‌లతో పాటు ఇతర పలు పరీక్షలు నిర్వహించినట్లు నివేదికలో పేర్కొన్నారు. నివేదిక ప్రకారం ట్రంప్ బరువు 108 కిలోగ్రాములుగా (238 పౌండ్లు) నమోదైంది. గత ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన పరీక్షలతో పోలిస్తే ఇది 6 కిలోలు ఎక్కువ. ఆయన బాడీ మాస్ ఇండెక్స్ 29.7గా ఉంది. వైద్యుల ప్రకారం బీఎంఐ 30 దాటితే ఊబకాయంగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో ఆయన ఆహారం, శారీరక శ్రమ, బరువు తగ్గడంపై వైద్యులు కొన్ని సూచనలు చేశారు. అదే సమయంలో ఆయన మేధో, శారీరక పనితీరు అద్భుతంగా ఉందని నివేదిక స్పష్టం చేసింది. మేధోపరమైన సామర్థ్యాన్ని అంచనా వేసే మాంట్రియల్ కాగ్నిటివ్ అసెస్‌మెంట్‌లో ట్రంప్ 30కి 30 మార్కులు సాధించారు. 2018, 2025లో నిర్వహించిన పరీక్షల్లోనూ ఆయన ఇదే స్కోరు సాధించడం గమనార్హం. మందుల వాడకం వల్ల ఆయన కొలెస్ట్రాల్ స్థాయిలు గణనీయంగా మెరుగు పడ్డాయి. 2018లో 223గా ఉన్న టోటల్ కొలెస్ట్రాల్ తగ్గింది. చేతులపై ఉన్న గాయాలను తరచుగా కరచాలనం చేయడంవల్ల వైద్యులు పేర్కొన్నారు.

# లోయలో పడిన శరణార్థుల బస్సు

## - 22 మంది దుర్మరణం.. 36 మందికి గాయాలు - మృతుల్లో మహిళలు, చిన్నారులు అధికం - డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఘోర ప్రమాదం

**కాబూల్, మే 30:** ఆఫ్ఘనిస్తాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదంచోటుచేసుకుంది. పాకిస్తాన్ నుంచి స్వదేశానికి ఆఫ్ఘన్ శరణార్థులతో ప్రయాణిస్తున్న ఓ ట్రక్కు బోల్తా పడటంతో కనీసం 22 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 36 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో మహిళలు, చిన్నారులే అధికంగా ఉండటం ఈ ఘటన తీవ్రతను మరింత పెంచింది. ఈ ప్రమాదం తూర్పు ఆఫ్ఘనిస్తాన్‌లోని లగ్మన్ ప్రావిన్స్ పరిధిలో కాబూల్‌నంగర్‌హార్ ప్రధాన రహదారిపై జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, గంటల తరబడి నిరంతరంగా వాహనం నడిపిన డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ట్రక్కు అదుపు తప్పి రహదారి పక్కనున్న లోతైన కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో భారీ సంఖ్యలో కుటుంబాలు ప్రయాణిస్తున్నట్లు అధికారులు తెలిపారు. లగ్మన్ ప్రావిన్స్ గవర్నర్ ప్రతినిధి అబ్దుల్ మాలిక్ నియాజాయ్ వెల్లడించిన వివరాల ప్రకారం మృతుల్లో 10 మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు ఉన్నారు. పలువురు తీవ్ర గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కొంతమంది పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సహాయక బృందాలు, స్థానిక గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ట్రక్కులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. గాయపడిన వారిని నంగర్‌హార్, జలాలాబాద్ ప్రాంతాల్లోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో చిక్కుకున్నవారంతా పాకిస్తాన్ నుంచి తిరిగి వస్తున్న ఆఫ్ఘన్ శరణార్థులేనని అధికారులు ధృవీకరించారు. 2023లో అక్రమ వలసదారులపై పాకిస్తాన్ ప్రభుత్వం కఠిన చర్యలు ప్రారంభించిన తర్వాత లక్షలాది మంది ఆఫ్ఘన్‌లు తమ స్వదేశానికి తిరిగి రావాల్సి వచ్చింది. దశాబ్దాలుగా పాకిస్తాన్‌లో నివసిస్తూ అక్కడే జీవనం సాగించిన కుటుంబాలు కూడా బలవంతంగా తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ఇరాన్ కూడా ఆఫ్ఘన్ వలసదారులపై కఠిన చర్యలు చేపడుతుండటంతో వేలాది మంది స్వదేశానికి చేరుకుంటున్నారు. అయితే తిరిగి వచ్చిన వారికి సరైన నివాసాలు, ఉపాధి అవకాశాలు, రవాణా సదుపాయాలు లేకపోవడం వల్ల అనేక కష్టాలు ఎదురవుతున్నాయి. ఈ ప్రమాదం కూడా అలాంటి సంక్షోభ పరిస్థితుల్లోనే చోటుచేసుకున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌లో రోడ్డు ప్రమాదాలు సాధారణమవుతున్నాయి. దేశవ్యాప్తంగా పాడైపోయిన రహదారులు, సరైన భద్రతా ప్రమాణాల లేమి, వాహనాల అధిక లోడింగ్, డ్రైవర్ల అలసట, ట్రాఫిక్ నియమాల అమలులో నిర్లక్ష్యం వంటి కారణాల వల్ల ప్రతి సంవత్సరం వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లోని ప్రమాదకర రహదారులు, లోతైన లోయలు ప్రయాణికులకు మరింత ముప్పుగా మారుతున్నాయి.



# ఒక్కపరీక్ష కూడా సవ్యంగా నిర్వహించలేకపోయారు!

## ప్రధాని మోడీపై రాహుల్ ధ్వజం

**న్యూఢిల్లీ, మే 30:** ఎన్డీయే హయాంలో ఒక్క పరీక్ష కూడా నిజాయితీగా నిర్వహించలేదని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమస్త విద్యా వ్యవస్థన్ను పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. శనివారం దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణలో ఆలస్యం జరిగింది. రాహుల్ గాంధీ దీనిపై స్పందించారు. నీట్, సీబీఎస్‌ఈ, ఎస్‌ఎస్‌సీ, ఇప్పుడు క్యూట్. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. ఒక్క పరీక్ష కూడా నిజాయితీగా నిర్వహించలేద్దు అని విమర్శించారు. విశ్వగురు అనే వాదనలను సవాల్ చేశారు. ప్రధాని మోడీ సమస్త విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. మీరు ఏ తరం భవిష్యత్తును నాశనం చేస్తున్నారో, అదే తరం మిమ్మల్ని జవాబుదారీగా నిలబెడుతుంది అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. సీయూఈటీ ఆలస్యం జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో మరో వైఫల్యమని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు, ఢిల్లీ మాజీ సీఎం అతిషి విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

# భారత్‌లో సందడిచేస్తున్న టిఫాని ట్రంప్!

**న్యూఢిల్లీ, మే 30:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబ సభ్యులు మరోసారి భారత దేశంలో సందడి చేస్తున్నారు. ట్రంప్ కుమార్తె టిఫానీ ట్రంప్ ప్రస్తుతం భారత్‌లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పూర్తిగా వ్యక్తిగత పర్యటన నిమిత్తం ఇండియాకు వచ్చిన ఆమె ముందుగా భారతదేశ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే ప్రఖ్యాత స్వామి నారాయణ్ అక్షరధామ్ ఆలయాన్ని సందర్శించారు. అక్షర్‌ధామ్ ఆలయ ప్రాంగణంలోకి అడుగు పెట్టిన టిఫానీ ట్రంప్‌కు అక్కడి నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. ఈక్రమంలోనే అక్కడి అద్భుత శిల్పకళను, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాలను ఆమె అత్యంత ఆసక్తిగా తిలకించారు. ఇక్కడి కట్టడాల వైభవాన్ని చూసి ఆమె పూర్తిగా ఆశ్చర్య పోయారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో కొలువై ఉన్న 108 అడుగుల భారీ నీలకంఠ్ వర్ణీ విగ్రహాన్ని ఆమె ప్రత్యేకంగా సందర్శించి అక్కడే కొంత సమయం గడిపారు. ఈ పర్యటనకు సంబంధించిన అందమైన ఫొటోలను టిఫానీ తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా అభిమానులతో పంచుకోవడంతో ఈ హై ప్రొఫైల్ పర్యటన వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ పర్యటన ముగించుకున్న తర్వాత టిఫానీ ఆగ్రా తాజ్‌మహల్‌ను కూడా సందర్శించారు. చారిత్రక కట్టడం ముందు కూర్చుని ఫోటోలు దిగారు. ఆగ్రా పర్యటన అనంతరం ఆమె రాజస్థాన్‌లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన, ఎడారి నగరం జైసల్మేర్‌లో ఆమె పర్యటించి, అక్కడి కోటలను, సంస్కృతిని వీక్షించారు. ఇది పూర్తిగా టిఫానీ ట్రంప్ వ్యక్తిగత పర్యటన అయినప్పటికీ ఆమె అమెరికా అధ్యక్షుడి కుమార్తె కావడంతో భారత అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర భద్రతా సంస్థలు ఆమె పర్యటించే ప్రాంతాల్లో అత్యంత కట్టుదిట్టమైన, భారీ భద్రతా ఏర్పాట్లను చేశాయి. ఆమె వెళ్లే మార్గాల్లో ప్రత్యేక నిఘా ఉంచారు. టిఫానీ ట్రంప్ భారత దేశానికి రావడం ఇది మొదటి సారి కాదు. గతంలో 2018లో డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఆమె భారత్‌లో అధికారికంగా పర్యటించారు. ఆ సమయంలో తండ్రితో పాటు టిఫానీ కూడా భారత్‌కు విచ్చేసి ఇక్కడి విశేషాలను తిలకించారు.



# నేవీ వైస్ ఛీఫ్‌గా అజయ్‌కొచ్చర్ బాధ్యతల స్వీకరణ



**న్యూఢిల్లీ, మే 30** ఆపరేషన్ సింధూర్ వ్యూహకర్త వైస్ అడ్మిరల్ అజయ్ కొచ్చర్ శుక్రవారం నాడు నేవీ వైస్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మిలిటరీలోని టాప్ నేతల మార్పులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా అజయ్ కొచ్చర్ పదోన్నతి పొందారు. త్రివిధ దళాలు కొత్త చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజా సుబ్రమణి, తదుపరి నేవీ చీఫ్ వైస్ అడ్మిరల్ కే స్వామినాథన్ ఆదివారం రోజున తమ కొత్త బాధ్యలు స్వీకరించనున్నారు. ఇక శుక్రవారం రోజున ముంబైలోని వెస్ట్రన్ నావెల్ కమాండ్‌కు కమాండర్‌గా వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సాయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నేవీ చీఫ్ అడ్మిరల్ డీకే త్రిపాఠి శని, ఆదివారాల్లో పదవీవిరమణ చేయనున్నారు. ఆర్మీ జనరల్ ఉపేంద్ర ద్వివేది జూన్ 30వ తేదీన ఆర్మీ చీఫ్‌గా రిటైర్ కానున్నారు. వైస్ అడ్మిరల్ కొచ్చర్‌ది హర్యానాలోని కర్నాల్. ఆయన తండ్రి హర్యానా ఇరిగేషన్ శాఖలో మాజీ ఇంజినీర్. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన తర్వాత జాతీయ వార్ మెమోరియల్ వద్ద కొచ్చార్ పుష్పగుచ్ఛం ఉంచారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో నేవీకి చెందిన ప్లానింగ్‌ను అడ్మిరల్ కొచ్చార్ చేశారు. ముంబై నుంచి ఆయన ఆ ఆపరేషన్ నిర్వహించారు. పశ్చిమ సముద్ర ప్రాంతంలో ఉన్న శత్రు సమస్యను ఆయన తన ప్లానింగ్‌తో ఎదుర్కొన్నట్లు చెప్పారు. సాంప్రదాయ, సాంప్రదాయేతర శైలిలో వెస్ట్రన్ కమాండ్ ఆ సమయంలో రెస్పాండ్ అయ్యింది. వైస్ అడ్మిరల్ కొచ్చర్ 1988 జూలైలో నేవీలో చేరారు.

# అమరత్వానికి పుతిన్ యాంటీ ఏజింగ్ ప్రాజెక్టు

## 26 బిలియన్ రూబుళ్లతో ప్రణాళిక

## 3-డి ప్రింటింగ్‌తో జీవకణాల రూపకల్పన, అభివృద్ధి

## మినీపిగ్స్‌లో మానవ అవయవాల పెంపు

**మాస్కో, మే 30:** గత కొన్నేళ్లుగా రష్యా అధ్యక్షుడు పుతిన్ అమరత్వం గురించి మాట్లాడుతున్నారు. 73 యేళ్ల వయసున్న పుతిన్ చావును ఎదురించి ఎక్కువ కాలం రష్యా అధ్యక్షుడిగా పనిచేయాలని ఆరాటపడుతున్నారు. ఇప్పటికే మనుషుల అవయవాలపై రష్యా సైంటిస్టులు ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారు. ఇప్పుడు చావును జయించేందుకు 26 బిలియన్ల రూబుల్స్ ఖర్చుతో 'యాంటీ-ఏజింగ్' ప్రాజెక్టును మొదలుపెట్టారు. 3-డి ప్రింటింగ్ ద్వారా జీవకణాలను సృష్టించి వాటిని డెవలప్ చేస్తారు. ఆ తర్వాత మినీపిగ్స్‌లో మానవ అవయవాలను పెంచుతారు. రాబోయే రోజుల్లో మనుషుల పూర్తి అవయవాలను కూడా మార్చేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందట. ఇలా మార్చడం ద్వారా మనుషుల మరణాన్ని వాయిదా వేసుకోవచ్చనేది పుతిన్ ఆలోచన.

**పుతిన్ కూతురు నేతృత్వంలో..**

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు పుతిన్ కూతురు మరియా, ప్రముఖ సైంటిస్టు మైఖేల్ కోవాచుక్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ ప్రాజెక్టు విజయవంతం అయిన తర్వాత అవసరమైతే మనుషుల పూర్తి అవయవాలను మినీపిగ్స్‌లో పెంచే అవయవాలతో రీప్లేస్ చేయొచ్చని కోవాచుక్ మీడియాతో తెలిపారు. అయితే ఈ ప్రాజెక్టుపై రష్యాలో బయోప్రింటింగ్ వ్యవస్థ సృష్టించిన ప్రముఖ సైంటిస్ట్ అలెగ్జాండర్ ఓస్ట్రోవ్‌స్కీ అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు కేవలం కోరికల స్థాయిలోనే ఉందని.. కార్యరూపం దాల్చలేదన్నారు.

# మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై రాళ్లదాడి



**కోల్‌కత్తా, మే 30:** పశ్చిమ బెంగాల్‌లోని సోనార్‌పూర్‌లో శనివారం మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి జరిగింది. ఎన్నికల అనంతర హింసాకాండ బాధితుల కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన సందర్భంగా ఆయనపై గుడ్లు, రాళ్లు విసిరారు. ఇదే సమయంలో బీజేపీ కార్యకర్తలు ఆయనకు వ్యతిరేకంగా దొంగ దొంగ అని నినాదాలు చేశారు. ఈ దాడి నుంచి అభిషేక్‌కు కాపాడేందుకు భద్రత సిబ్బంది తమ హెల్మెట్ ఇచ్చి రక్షణగా నిలిచారు. బీజేపీ కార్యకర్తలే దాడి చేశారని టీఎంసీ ఆరోపించింది. అక్కడ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంతో భద్రతా సిబ్బంది ఆయనను చుట్టుముట్టి రక్షణగా నిలుస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటన అనంతరం అభిషేక్ బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ ఈ దాడిని బీజేపీయే ప్రోత్సహించిందని ఆరోపించారు. ఇదంతా బీజేపీయే ప్రోత్సహించింది. వాళ్లు ఏం చేశారో చూడండి. ఇదేనా వాళ్ల ప్రజాస్వామ్యానికి ఉదాహరణ. నెల కూడా కాలేదు, పోలీసులు ఎక్కడా కనిపించడం లేదని ఆయన అన్నారు. దాడి చేసినవారు తనను చంపడానికే వచ్చారని ఆరోపించిన బెనర్జీ ఈ ఘటన మొత్తం కెమెరాలో రికార్డయిందని పేర్కొన్నారు. వారు నన్ను చంపాలనుకున్నారు. ఈ ఘటన మొత్తం కెమెరాలో రికార్డ్ అయింది. మేము ఈ విషయాన్ని హైకోర్టు దృష్టికి తప్పకుండా తీసుకువస్తాం గవర్నర్‌కు కూడా తెలియజేస్తాం. నేను తప్పకుండా కోర్టును ఆశ్రయిస్తానని ఆయన అన్నారు. తాను తృటిలో తీవ్ర గాయాల నుంచి తప్పించుకున్నానని చెప్పారు. తలకు గాయంకాకుండా తప్పించుకున్నారు అదృష్టవశాత్తు, నేను హెల్మెట్ ధరించాను వారు నా బట్టలు చించి, నా కళ్లజోడు పగలగొట్టారని తెలిపారు. ఘటనా స్థలంలో పోలీసుల ఉనికి లేదు. వారు మమ్మల్ని చంపాలనుకుంటున్నారు. చంపనివ్వండి నేను చావనైనా చస్తాను కానీ ఇక్కడ నుంచి కదలనని అన్నారు. తగిన భద్రతా ఏర్పాట్లు చేసే వరకు తాను వెళ్లబోనని తేల్చిచెప్పారు.

# సంక్షిప్తంగా..

## సోనియాగాంధీకి కంటి శస్త్రచికిత్స



**న్యూఢిల్లీ, మే 30:** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, పార్టీ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ కంటికి శస్త్ర చికిత్స జరిగింది. ఈ సర్జరీ నుంచి కోలుకున్న సోనియా గాంధీ తాజాగా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. న్యూఢిల్లీలోని తన నివాసమైన10 జన్‌పథ్‌కు చేరుకున్నారు. కొద్ది రోజులుగా సోనియా అనారోగ్యంపై చాలా ప్రచారం జరిగింది. ఆమెకు ఏమైంది అనే విషయంలో ఎలాంటి ప్రకటనా రాలేదు. ఇదే సమయంలో ఇటీవల న్యూఢిల్లీలోని గంగారాం ఆస్పత్రిలో చేరినట్లు ప్రచారం జరిగింది. ఆమె తనయుడు రాహుల్ గాంధీ కూడా సోనియా గాంధీని ఆస్పత్రిలో కలిసి వచ్చారు. అయితే, సోనియా గాంధీకి కంటి ఆపరేషన్ జరిగినట్లు తాజాగా వెల్లడైంది.

## రాజస్థాన్‌లో ఇసుక తుఫాను బీభత్సం



**జైపూర్, మే 30:** రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం సృష్టించింది. రాష్ట్రంలోని చురు, శ్రీగంగానగర్, బికనీర్, సీకర్ తదితర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం భీకర గాలులు వణికించాయి. దట్టమైన మేఘాల రూపంలో ఇసుక ఆవరించడంతో ఒక్కసారిగా చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. అనంతరం ఆయా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఇసుక తుపాను కారణంగా వాహనదారులు, స్థానికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దట్టమైన ఇసుక తుపానుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియా లో వైరల్‌గా మారాయి. అంతకుముందు జైపూర్‌లోనూ శుక్రవారం ఇదే విధమైన వాతావరణం కనిపించింది. ఇసుక తుపానుతోపాటు భీకర గాలులు వీచాయి. ధోల్‌పుర్ జిల్లాలో అత్యధికంగా 5.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## భూతగాదాల్లో కాల్పులు - ఒకే కుటుంబంలో ఆరుగురి దారుణ హత్య

**బెంగళూరు, మే 30:** భూ వివాదం నేపథ్యంలో ఒక కుటుంబానికి చెందిన ఆరుగురు వ్యక్తులపై ప్రత్యర్థులు కాల్పులు జరిపారు. ఆ తర్వాత వారిని దారుణంగా నరికి చంపారు. ఈ సంఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది. కర్ణాటకలోని విజయపుర జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గోవిందపూర్ గ్రామానికి చెందిన నిరాలే, గోలగి కుటుంబాల మధ్య చాలా కాలంగా భూవివాదం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో నిరాలే కుటుంబ సభ్యులపై గోలగి కుటుంబ సభ్యులు దాడి చేశారు. ఆరుగురిపై తొలుత కాల్పులు జరిపారు. ఆ తర్వాత వారందరినీ దారుణంగా నరికి చంపారు. ఈ సమాచారం తెలుసుస్తున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతులను చందు నిరాలే, దుండప్ప నిరాలే, శివపుత్ర నిరాలే, రాహుల్ నిరాలే, సమర్థ్ నిరాలే, షబ్బీర్ నదాఫ్‌గా గుర్తించారు.

## కారును ఢీకొట్టి అరకిలోమీటరు ఈడ్చుకెళ్లిన ట్రక్కు




**భువనేశ్వర్, మే 30:** ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో ఓ తండ్రి, కుమార్తె త్రుటిలో పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి వారు ప్రయాణిస్తున్న కారును ఓ ట్రక్కు ఢీకొట్టింది. ఆపై ఓ అరకిలోమీటర్ వరకు ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. భువనేశ్వర్‌లోని పలాసునీ బ్రిడ్జిపై ఈ ఘటన చోటుచేసుకుంది. తండ్రీకూతుళ్లు కారులో వంతెన దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన ఒక భారీ ట్రక్కు దాన్ని బలంగా ఢీకొట్టింది. ఆ తర్వాత కూడా ట్రక్కు డ్రైవర్ తన వాహనాన్ని ఆపకుండా కారును రోడ్డుపై అరకిలోమీటర్‌కుపైగా ఈడ్చుకెళ్లాడు. దాంతో కారులో ఉన్నవారితోపాటు, రోడ్డుపై ఉన్న ప్రయాణికులు కూడా తీవ్ర భయాందోళనకు గురయ్యారు.



## లక్ష్మీనరసింహస్వామి దివ్యాశీస్సులు అందరిపై కలగాలి

### మంత్రి నారా లోకేశ్

**తిరుపతి,మే 30ప్రభాతవార్తప్రతినిధి:** తమిళనాడు రాష్ట్రం రాణిపేట జిల్లా షోలింగర్‌లో కొలువైన ప్రసిద్ధ యోగ లక్షీ ్మ నరసింహస్వామిని రాష్ట్రమంత్రి నారాలోకేశ్ దర్శించుకున్నారు. ఈ సం దర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమిళనాడు పర్యటనలో ఆయన కొండపైకి రోప్‌వేలో వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. 420 మెట్లు నడిచి యోగ ఆంజనేయస్వామి ఆలయ సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి ఆశీస్సులతో తెలు గుప్రజలందరికీ దివ్యాశీస్సులు ఉండాలని ఆకాం క్షించారు. లోకేష్ వెంట తిరుపతి,చిత్తూరు జిల్లా ల టిడిపి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గురజాల జగన్మోహన్ ,డాక్టర్ మురళీ మోహన్ ఉన్నారు. కొండకెళ్ళే మార్గమధ్యలో భక్తులను ఆప్యా యంగా పలకరించిన మంత్రి నారా లోకేష్ తమి ళనాడు వాసులతో మమేకమయ్యారు. ఆలయ వేద పండితులు లోకేష్‌కు వేదాశీర్వచనం అందించి, శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు

## తిరుపతి నగరంలో మార్మోగిన గోవిందనామస్మరణ

**తిరుపతి,మే 30ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన తిరుపతి నగరంలో ప్రతి శనివారం తెల్లవారు జామునే భక్తులు సంప్రదాయ దుస్తుల్లో, ను దుటిపై గోవింద నామాలతో గోవింద నామస్మ రణలతో పునీతులవుతున్నారు. గోవిందరాజ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయ స్వామి గుడి వద్ద నుండి మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య నగర సంకీర్తన ప్రారం భమైంది. గోవింద.. గోవింద.. అనే నామస్మ రణతో తిరుపతి వీధులు ఆధ్యాత్మిక కాంతిని ప్రసరించాయి. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో భక్తి భావాన్ని నింపాలనే లక్ష ్యంతో మండలి సభ్యులు సేవాభావంతో ముందుకు సాగుతున్నారు. సంకీర్తన అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి కార్యక్రమాన్ని ముగి స్తున్నారు. ఈ



కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు మునెప్ప గారి మునినాథరెడ్డి, వాసుదేవ రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి,,విశ్రాంత ఉపాధ్యాయులు విజయభాస్కర్ రెడ్డి, అన్నూరు మునిరత్నమాచారి, పురుషోత్తమ యాదవ్, మిట్టపల్లి బ్రహ్మానందం,కన్నప్ప గారి కేశవులు, నాగేశ్వరరెడ్డి, రాజేంద్రన్,సుధాకర్ చౌదరి, తొం డమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, అరుణమ్మ, జయమ్మ,విజయ కుమారి, అమరావతి,రేవతి,

### మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలపై

## 'జీరో టాలరెన్స్'విధానం

### రైల్వే స్టేషన్, బస్టాండ్ పార్సెల్ కార్యాలయాల్లో విస్తృత తనిఖీలు




**తిరుపతి,మే 30ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలు వినియోగంపై తిరుపతి జిల్లా పోలీస్ శాఖ 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తోంది. యువ తను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపా డడం పోలీస్‌శాఖ ప్రధాన బాధ్యతగా భావి స్తోంది. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజల సహకారంతో మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని తిరు పతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు వెల్ల డించారు. జిల్లా ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ డి. నాగార్జున రెడ్డి సిబ్బంది శనివారం ఉదయం తిరుపతి రైల్వే స్టేషన్, బస్టాండ్ పార్సల్ కార్యాలయాల్లో నార్కోటిక్ డాగ్స్ సహాయంతో విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వస్తువులు, పార్సిళ్లు, సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని సేక రించారు. గంజాయి ఇతర మాదక ద్రవ్యాల అక్ర మ రవాణా, నిల్వలు, సరఫరా కార్యకలాపాలు ఏమైనా జరుగుతున్నాయా అనే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ప్రజల భద్రత, యువత భవిష్యత్తు పరిరక్షణ దృష్ట్యా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు జిల్లావ్యాప్తంగా నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## తిరుమలలో విఐపి దర్శనాలను తక్షణమే రద్దు చేయాలి

### ఎపి చైతన్య వేదిక కన్వీనర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి

**తిరుపతి,మే 30ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న విఐపి , బ్రేక్ దర్శనాల వ్యవస్థను తక్షణమే రద్దు చేయాలని ఏపీ చైతన్య వేదిక కన్వీనర్ డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. ఈ మేరకు శనివారం ఆయన పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. దేవాలయాల్లో విఐపి సంస్కృతి, ప్రత్యేక దర్శనాలపై మద్రాస్ హైకోర్టు ఇటీవల చేసిన కీలక వ్యాఖ్యలను ఏపీ చైతన్య వేదిక హర్షిస్తున్నదని తెలిపారు. దేవాలయంలో దేవు డొక్కడే వీఐపీ, దేవుడి ముందు అందరూ సమా నమే అని న్యాయస్థానం స్పష్టం చేయడం సమా జానికి సరైన దిశానిర్దేశమని పేర్కొన్నారు. తిరు మల తిరుపతి దేవస్థానంలో ప్రస్తుతం అమల వుతున్న వీఐపీ దర్శన విధానం కారణంగా సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంటల తరబడి క్యూల్లో నిరీక్షి ంచే సాధారణ భక్తుల కంటే, రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, సినీ ప్రముఖులు, సిఫార్సులతో వచ్చే వారికి ప్రత్యేక దర్శన



సౌకర్యాలు కల్పించడం అన్యాయమని విమర్శించారు. మద్రాస్ హైకోర్టు చేసిన వ్యాఖ్యలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి దేశంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో విఐపి దర్శనాలు, ప్రత్యేక ప్రవేశాలు, సిఫార్సు ఆధారిత దర్శన విధానాలను రద్దు చేసే దిశగా చర్యలు తీసు కోవాలని కోరారు. ప్రజల విశ్వాసాన్ని కాపాడ టం, దేవాలయాల పవిత్రతను పరిరక్షి ంచడం ప్రభుత్వాల బాధ్యత

## పవన్‌ను విమర్శిస్తే ఊరుకోం

### సుగాలి ప్రీతి విషయంలో న్యాయం చేసింది

### డి.సిఎంనే: జనసేననేత కిరణ్‌రాయల్



**తిరుపతి,మే 30ప్రభాతవార్తప్రతినిధి:** కాపు ముసు గులో పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తే ఊరుకోమని తిరుపతి జిల్లా జనసేన ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ హెచ్చరించారు. సుగాలి ప్రీతి కోసం లక్షలాది మందితో సభపెట్టామని, పవన్ కళ్యాణ్ న్యా యం చేశారన్నారు. దాసరి రాము వైసిపికి అమ్ముడుపోయాడని తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. పవన్ కళ్యాణ్‌ను, నాదెండ్ల మనోహర్‌ను కించపరిచే విధంగా మా ట్లాడుతున్నాడని అన్నా రు. 2019లో జనసేన ఓడిపోయిన తరువాత కొం తమంది పార్టీని వదలి వెళ్ళిపో యారని,వారిలో దాసరి రాము ఉన్నా డన్నారు. రాము సిగ్గు లేకుండా మాట్లాడుతున్నాడని విమ ర్శించారు. నాదెండ్ల మనోహర్‌ను టార్గెట్ చేశారని, రాము నోరు అదుపులో పెట్టుకోవాలని కిరణ్‌రాయల్ ఘాటుగా స్పందించారు. వైసిపి నుంచి గుం టూరు సీటు కోసం రాము అమ్ముడు పోయాడని ఆరోపించారు. వైసిపి సోషల్ మీడియాతోనే పేమెంట్ బ్యాచ్ మాట్లాడుతోందన్నారు.

## ఏఐ యుగంలో ఎంబీఏ విద్యకు నూతన దిశ ఎన్‌సీ-రైమ్- 2026 ఘన విజయం

### నారాయణ ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో భవిష్యత్ మేనేజ్‌మెంట్ విద్యపై జాతీయ సదస్సు



**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 30:** నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఎన్‌సి- రీ ఇమేజింగ్ ఎంబీఏ ఎడ్యుకేషన్ ఇన్ ద ఎరా ఆఫ్ ఏఐ, ఎనాలిస్టిక్స్ అండ్ ఫిన్‌టెక్-రైటమ్- 2026 పేరిట శనివారం ఒకరోజు జాతీయ సదస్సును ఘనంగా నిర్వహించబడింది. ఈ సదస్సు హైబ్రిడ్ (ఆన్లైన్ + ఆఫ్లైన్) విధానంలో నిర్వహించబడగా దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల ఉపకుల పతులు, పరిశ్రమ నిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సదస్సు ప్రధాన అంశం ఏఐ, అనాలటిక్స్, ఫిన్‌టెక్ యుగానికి అనుగుణంగా ఎంబీఏ విద్యకు నూతన రూపకల్పన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, బిజినెస్ అనలిటిక్స్, ఫిన్ టెక్, మెషీన్ లెర్నింగ్ వంటి అంశాలు మేనేజ్ మెంట్ విద్యపై చూపుతున్న ప్రభావం, భవిష్యత్ మేనేజ్ మెంట్ విద్య ఎలా ఉండాలనే అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ రాజశేఖర్ బెల్లంకొండ మాట్లాడుతూ .. ఆధునిక మేనేజ్ మెంట్ విద్య కృత్రిమ మేధస్సు(ఏఐ), డేటా అనలిటిక్స్, ఫిన్‌టెక్ ఆధారిత పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రూపాంతరం చెం దాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ వ్యాపార ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న ఆలోచనలు, పరిశోధన) కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

ముఖ్య వక్తగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ ప్రసం గంలో ఏఐ మేనేజ్ మెంట్ విద్యలో విప్లవాత్మక మార్పులకు దారి తీస్తోందని తెలిపారు. సం ్ర పదాయ ఎంబీఏ బోధన విధానాలు పూర్తిగా మారి పోతున్నాయని, భవిష్యత్ ఎంబీఏ విద్యార్థులు టెక్నాలజీ, నాయకత్వం, నైతిక విలువలు, ఇన్నో వేషన్, సమస్య పరిష్కార సామర్థ్యాలను సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఏఐ ఆధారిత క్లాస్‌రూమ్స్, వ్యక్తిగత అభ్యాసన విధానాలు, డేటా ఆధారిత నిర్ణయాలు, ఇండస్ట్రీ అకాడెమియా భాగస్వామ్యాలు భవిష్యత్ మేనేజ్‌మెంట్ విద్యను ప్రభావితం చేస్తాయని తెలిపారు. ప్రపంచ స్థాయి బిజినెస్ స్కూల్స్ ఇప్పటికే ఏఐ ఆధారిత పాఠ్యాంశాలను ప్రవేశపెడుతున్నాయని, భారతీయ బి-స్కూల్స్ కూడా వేగంగా మారాల్సిన అవసరం ఉంద న్నారు.

ఎంబీఏ విద్యార్థులు "ఉద్యోగం కోసం చదవడం" కంటే "సమస్యలకు పరిష్కారాలు అందించే నాయకులుగా" ఎదగాలని సూచించారు. విశిష్ట అతిథిగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, పరిశోధన, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాభివృద్ధి అత్యవసరమన్నారు. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి పోటీకి సిద్ధమయ్యే విధంగా మేనేజ్ మెంట్ విద్యలో సరికొత్త మా ర్పులు రావాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ మం త్రి డాక్టర్ పొంగూరు నారాయణ తమ సం దేశంలో ఏఐ, అనాలిటిక్స్, ఫిన్‌టెక్ ఆధారిత విద్య భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దుతుందని తెలిపారు. ఇలాంటి జాతీయ సదస్సులు పరిశోధన, అకాడమిక్ నైపుణ్యాలు, పరిశ్రమ విద్యా సంస్థల అనుసంధానాన్ని బలోపేతం చేస్తాయని అభినందించారు.

నారాయణ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ ఇందిర పొంగూరు మాట్లాడుతూ ప్రస్తుతం మేనేజ్ మెంట్ విద్య కేవలం సాంప్రదాయ వ్యాపారజ్ఞానానికే పరిమితం కాకుండా, కృత్రిమ మేధస్సు, డేటా అనలిటిక్స్, ఫైనాన్షియల్ టెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతిక అంశాలతో సమన్వయం కావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధం కావాలంటే సాంకేతిక నైపుణ్యాలతో పాటు పరిశోధనా దృక్పథం, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి జాతీయ సదస్సులు విద్యార్థుల్లో విజ్ఞాన విస్తరణకు దోహదపడతాయని పేర్కొన్నారు.

## తెలుగమ్మాయికి ప్రతిష్టాత్మక పురస్కారం

### మిన్నెసోటా ఆస్పిరేషన్స్ ఇన్ కంప్యూటింగ్‌లో అవార్డ్

### స్టేట్ ఆనరబుల్ మెన్షన్ అందుకున్న గోలి అనన్య

**విజయవాడ,మే30,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ ఐటీ యవనికపై తెలుగు బిడ్డలు మరోసారి తమ సత్తా చాటారు. అమెరికాలో కంప్యూటర్ సైన్స్, టెక్నాలజీ రంగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన యువతకు అందించే ప్రతిష్టాత్మక 2026 మిన్నెసోటా ఆస్పిరేషన్స్ ఇన్ కంప్యూటింగ్ అవార్డుల్లో తెలుగు అమ్మాయి అనన్య గోలి స్టేట్ హానరబుల్ మెన్షన్ పుర స్కారాన్ని కైవసం చేస ుకున్నారు. మిన్నెసోటా టెక్నాలజీ ఫౌండేషన్, నేషనల్ సెంటర్ ఫర్ విమెన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన ప్రతిభావం తుల్లో అనన్య ఒకరిగా నిలిచారు. ఈడెన్ ప్రైరీ హైస్కూల్ లో సోఫో మోర్ చదువుతున్న అనన్య, ఇంత చిన్న వయ సులోనే సాంకేతిక రంగంలో అద్భుతమైన లీడర్ షిప్ నైపుణ్యాలను ప్రదర్శించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ గర్వకారణంగా నిలి చారు. అనన్య



గోలి కేవలం కోడింగ్, చదువులకే పరిమితం కాకుండా సాంకేతిక రంగంలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు అద్భు తమైన కృషి చేస్తున్నారు. ఈడెన్ ప్రైరీ హైస్కూ ల్‌లో టెక్నాలజీ రంగంలో ఉన్న అమ్మాయిలకు అండగా నిలిచేందుకు, వారిని ప్రోత్సహిం చేందుకు టెక్నోవేషన్ చాప్టర్‌ను ఆమె కో ఫౌండర్ గా ప్రారంభించారు. దీని ద్వారా ఎంతో మంది తోటి విద్యార్థినులకు సాంకేతికతపై అవగాహన కల్పిస్తూ, సరికొత్త డిజిటల్ ఆవిష్కరణల వైపు వారిని నడిపిస్తున్నారు. ఐటీ రంగంలో పురు షులతో సమానంగా మహిళలు కూడా రాణిం చగలరని అనన్య తన చేతలతో నిరూపిస్తు న్నారు. ఈ అవార్డు గుర్తింపుతో పాటు అనన్య తన అంకితభావంతో అరుదైన ప్రొఫెషనల్ అవకాశాలను కూడా సొంతం చేసుకున్నారు. గత వేసవిలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన మూడు జాబ్ షాడో అవకాశాలను దక్కించుకుని, కార్పొరేట్ టెక్నాలజీ ప్రపంచాన్ని ఆమె దగ్గరగా పరిశీలించారు. అంతేకాకుండా, ఐటీ రంగానికి చెందిన ప్రముఖ నిపుణుల సమక్షంలో ఒక ప్రొఫెషనల్ మెంటార్‌ను పొంది, తన నైపుణ్యా లకు మరింత పదును పెట్టుకుంటున్నారు. అమెరికాలో జరిగిన పలు కీలకమైన టెక్నాలజీ కాన్ఫరెన్స్‌లలో పాల్గొని, ప్రముఖ గ్లోబల్ టెక్నాలజిస్టులతో నెట్‌వర్కింగ్ చేసే అరుదైన అవకాశాన్ని సైతం ఆమె దక్కించుకోవడం విశేషం. అనన్యతో పాటు ఈడెన్ ప్రైరీ హై స్కూల్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థినులు అవార్డులకు ఎంపికయ్యారు. త్రయి కొప్పరపు (స్టేట్ విన్నర్), హిమజ గుంటూరు (స్టేట్ హానరబుల్ మెన్షన్), సరయు కాచం (స్టేట్ హానరబుల్ మెన్షన్) అందుకున్నారు. వీరితో పాటు సిసిలియా రతెమో, ఆయిషా ఆలం, బ్రూక్‌లిన్ బైఫీల్డ్, శగున్ శ్రీవాస్తవ కూడా ఈ అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.

### జూన్ 1 వ తేదీ నుంచే

## పెన్షన్లు పంపిణి

**విజయవాడ మే 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సామాజిక పెన్షన్ల లబ్ధి దారులకు మరోసారి తీపి కబురు అందించింది. జూన్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడు దల చేసింది. ఇందుకోసం మొత్తం రూ.2,728 కోట్లను కేటాయించింది. ఎప్పటిలాగే వచ్చే నెల మొదటి తారీఖున, అంటూ జూన్ 1 వ తేదీ సోమవరం ఉదయం నుంచే రాష్ట్రవ్యాప్తంగా వృద్దులు వికలాంగులు, వితంతవులు ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఉదయం నుంచే సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి నేరుగా నగదును చేతికి అందించనున్నారు. ఈ జూన్ నెలలో ఏపీ వ్యాప్తంగా మొత్తం 62,34,445 మంది లబ్ధిదారులకు ఈ సామాజిక భద్రతా పెన్షన్లు అందనున్నాయి. ఈసారి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. భర్త లేదా భార్య చని పోయిన వారికి ఇస్తే స్పౌజ్ పెన్షన్లను కొత్తగా మరో 5,606 మందికి మంజూరు చేసింది. ఈ కొత్త స్పౌజ్ పెన్షన్ల పంపిణీ కోసం ప్రత్యేకంగా రూ.2.24 కోట్లను ప్రభుత్వం అదనంగా విడు దల చేసింది. దీనివల్ల ఎంతోమంది నిరుపేద కు టుంబాలకు ఆర్థికంగా పెద్ద ఊరట లభిం చనుంది.

### సెకండరీ ఆసుపత్రుల్లో 238 మంది వైద్యుల నియామకం

**విజయవాడ మే 30 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధి లోని ఆసుపత్రుల్లో 238 మంది వైద్యులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీరిని జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలోని జిల్లా సెలక్షన్ కమిటీల ద్వారా ఒప్పంద పద్ధతిలో నియ మించనుంది. పీజీ చేసిన స్పెషలిస్టు వైద్యులకు నెలకు రూ1.10 లక్షలు, ఎంబీబీఎస్ వైద్యలకు నెలకు రూ.61.960 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. నెల్లూరు , సత్య సాయి, అనంతపురం జిల్లాల్లో ఒక్కో జిల్లాకు 13 మంది చొప్పున, పోలవరం, కోనసీమ, ఏలూరు జిల్లాలకు 11 మంది చొప్పున పార్వతీపురం మన్యం, కృష్ణా ఎన్టీఆర్ , బాపట్ల తిరుపతి జల్లాలకు 10 మంది చొప్పు వైద్యుల ఖాళీలు భర్తీచేస్తారు. తూర్పుగోదావరి, ప్రకాశం, మార్కాపురం, కర్నూలు జిల్లాల్లో తొమ్మిది మంది చొప్పున, అల్లూరి సీతారామరాజు, చితూత్తరు అన్నమయ్య జిల్లాల్లో ఎనిమిది మంది చొప్పున అనకాపల్లి, పశ్చిమగోదావరి, పల్నాడు, నంద్యాల జిల్లాల్లో ఏడుగురు చొప్పున నియమిస్తారు. శ్రీకాకుళం, కాకినాడ, కడప జిల్లాల్లో ఆరుగురు చొప్పున, విజయనగరం జిల్లాల్లో ఐదుగురు , గుంటూరు జిల్లాల్లో నలు గురు విశాఖపట్నం జిల్లాలో ఒకరి చొప్పున నియమించాలని నిర్ణయించారు. సెకండరీ హెల్త్ సంచాలకులు కేవీఎన్ చక్రధరబాబుతో ఆసు పత్రుల్లో ఖాళీలపై మంత్రి సత్యకుమార్ యా దవ్ సమీక్షించారు. 148 మంది సివిల్ అసిస్టెం ట్ సర్జన్లను, 90 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లను సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ జిల్లా ఆసుపత్రుల్లో నియమించేం దుకు మంత్రి ఆమోదం తెలిపారు.

## చారాల దళితవాడలో యువతి ఆత్మహత్య

### పోలీసుల వైఖరిపై మృతురాలి బంధువుల ధర్నా, రాస్తారోకో

**తవణంపల్లె, మే 30 ప్రభాతవార్త:** ప్రేమ విఫలమై యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం అరగొండ గ్రామ పంచాయతీలో శనివారం ఉద యం చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. మండలంలోని అరగొండ గ్రామపంచాయతీ చారాల దళితవాడకు చెందిన రమేష్ చిన్న కుమార్తె కె.కావ్య(18) అనే యువతి అదే గ్రామా నికి చెందిన ఓ యువకుడిని ప్రేమిస్తోంది. అయి తే తన ప్రేమను ఆ యువకుడు తిరస్క రించడంతో మనస్తాపంతో కావ్య శనివారం ఉదయం 10 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్ప డింది. వెంటనే బంధువులు అరగొండ అపోలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెంది నట్లు డాక్టర్లు ధృవీకరించారు. మృతురాలి బంధువుల ధర్నా రాస్తారోకో ప్రేమ విఫలమై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న యువతి సంఘటనపై కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించడంలో స్థానిక పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై మృతురాలి బంధు వులు అరగొండ అపోలో ఆస్పత్రి ఎదుట ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆస్పత్రి వర్గాలు ఎంఎల్‌సి కేసుగా పరిగణిస్తూ తదుపరి చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానిక పోలీసులకు ఉదయం సమా చారం అందించడంతో పాటు జరిగిన సంఘ టనపై మధ్యాహ్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మృతురాలి బంధువులు తెలిపారు. అయినప్పటికి పోలీసులు ఈసంఘటనపై సా యంత్రం 6 గంటల వరకు కేసు నమోదు చేయ డం కానీ, మృత దేహాన్ని పోస్టుమార్టంకు తర లించడం కాని చేపట్టపోవడంతో పోలీసుల వైఖరిని నిరసిస్తూ మృతురాలి బంధువులు ఆ స్పత్రి ఎదుట భైఠాయించి ధర్నా రాస్తారోకోకు పూనుకున్నారు.

## ఎసిబి వలలో సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ఇంజినీర్ తెలుగు రమేష్

### క్వాలిటి సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ. 40 వేలు డిమాండ్

### నగదు తీసుకుంటు అడ్డంగా దొరికిన ఎఇ

**నందికొట్కూరు,మే 30,ప్రభాతవార్త:** సర్వ శిక్ష అభియాన్ అసిస్టెంట్ ఇంజనీర్ తెలుగు రమేష్ రూ. 40 వేలు లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కర్నూలు టెలికాం నగర్‌కు చెందిన జి.శ్రీరా ములు సివిల్ కాంట్రాక్టర్ జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాలలో పాఠశాల భవనాల పనులకు సంభంధించిన బిల్లులు రూ.41.6 లక్షలు రావలసి ఉండడంతో ప్రక్రియలో భాగమైన క్వాలిటి కంట్రోల్ సర్టిఫికెట్ కోరగా ఏఈ రూ.40 డిమాండ్ చేయడంతో కాంట్రాక్టర్ ఏసిబి అధికారులను ఆశ్రయించాడు. దీంతో



కాంట్రాక్టర్ శనివారం ఏసిబి అధికారులకు సమా చారం ఇచ్చి బ్రాహ్మణకొట్కూరు సమీపంలోని నేషనల్ హైవేపై కారులో ఏఈ నగదు తీసుకుంటుండగా ఏసిబి డియస్పీ సోమన్న ఆధ్వ ర్యంలో దాడులు చేసి నగదు స్వాధీనం చేసుకొని ఎఈని అదుపులోకి తీసుకొని విచారణ చేప ట్టారు. ఈ కార్యక్రమంలో ఏసిబి సి.ఐ. కృష్ణయ్య సిబ్బంది పాల్గొన్నారు.

## తుంగభద్ర నదిలో ఐదుగురు గల్లంతు

**మంత్రాలయం, మే 30, ప్రభాతవార్త;** మంత్రాల యంలో విషాధం చోటు చేసుకుంది. తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లి ఐదు మంది శనివారం గల్లంతయ్యారు. ఇందులో ముగ్గురు పురుషులు కాగా, ఒక మహిళ, ఒక బాలుడు ఉన్నారు. వివరాల మేరకు మంత్రాలయం పట్టణానికి చెం దిన శాంతప్ప ఆచారి ఇంటిలో నేడు ఆదిఆవరం సత్యనారాయణ వ్రతం నిర్వ హించాలని కుటుంబ సభ్యులు తమ బం ధువు లను పిలిపించారు. ఇందులో వివిధ పట్ట ణాల నుంచి బంధువులు వచ్చారు. వీరిలో హైద రా బాద్‌కు చెందిన కంసాలి సతీష్ కుమారుడు కంసాలి యువన్‌చంద్ర(5), మంత్రాలయంకు చెందిన కంసాలి రాఘవేంద్ర(25), ఉరవకొండకు చెందిన రత్నమాచారి కుమార్తె సంధ్య(22), ఎమ్మిగ నూరుకు చెందిన ధనుష్(22), కర్నూ లుకు చెందిన సతీష్(35) ఆదోనికి చెందిన అపర్ణ మొ త్తం ఆరు మంది స్నానానికి వెళ్లారు. అయితే ఇం దులో యువన్‌చంద్ర అనే బాలుడు నీటిలో



మునిగిపోగా, బాలుడిని రక్షించడానికి వీరు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండడంతో అందరూ నీటిలో మునిగి గల్లంతయ్యారు. అదృష్టవశాత్తు అపర్ణ అనే బాలికను రక్షించారు. మిగిలిన ఐదు మంది గల్లంతయ్యారు. సీఐ దస్తగిరిబాబు, ఎస్‌ఐలు మల్లికార్జున, విజయ్‌కుమార్, ఎర్రన్నల ఆధ్వర్యంలో అరగోళ్లు, గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. టీడీపీ ఇన్‌చార్జి ఎన్. రాఘవేంద్రరెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరి శీలించారు. గాలింపు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## జూన్ 10 లోపు విద్యుత్ సబ్సిడీ హామీ అమలు చేయాలి

### వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అప్పడా మాజీ వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాం డిమాండ్

**విజయవాడ, మే 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌తో సంబంధం లేకుండా జూన్ 10వ తేదీ లోపు యూనిట్ రూపాయిన్నరకే సబ్సిడీ విద్యుత్ హామీని అమలు చేయాలని, నాన్ ఆక్వా జోన్ రైతులు గత రెండేళ్లుగా చెల్లించిన బిల్లులు రీయింబర్ చేయాలని తాగేపల్లిగూడెం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అప్పడా మాజీ వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాం డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆక్వా రైతులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌తో సంబంధం లేకుండా అందరికీ రూపాయిన్నరకే యూనిట్ విద్యుత్ అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు, రెండేళ్లుగా ఒక్క కొత్త కనెక్షన్ కూడా ఇవ్వలేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సీడ్, ఫీడ్ ధరలు, ఎగుమతులు, అన్నీ అప్సడా నిర్ణయం మేరకు రైతులతో చర్చించి తీసుకునేవాళ్ళలని కానీ కూటమి ప్రభుత్వం వచ3్చక ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ ని నిర్వీర్యం చేసిన దళారుల చేతికి చంద్రబాబు పెత్తనం ఇచ్చాడని మండిపడ్డారు. ఫీడ్ ధరలు కూడా ఇష్టారాజ్యంగా పెంచితే ఊరుకోమని, రైతులతో చర్చించి ఏడాదికి ఒక్కసారే పెంచాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని త్వరలోనే ఆక్వా రైతులతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమావేశం నిర్వహిస్తారని వడ్డి రఘురాం వెల్లడించారు.

# వైభవంగా నృసింహుని కల్యాణోత్సవం

## రాబడి రూ.10,63,184లు



**రాపూరు (నెల్లూరు), మే 30, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో శనివారం ఆలయ ప్రాంగణం నిండిపోయింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చిన మూడవ శనివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకోని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఇందులో బాగంగా తెల్లవారుజామున స్వామి వారి మూల మూర్తికి ప్రత్యేకంగా అభిషేకం,గోపూజ, పూలాంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారికి ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వైభవంగా స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ అర్చక స్వాములు, వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం,గిరిజనవాయిద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలతో పాటు,క్యూలైన్లలో భక్తులకు మంచినీరు,మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణ నిర్వహించారు. శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ॥ 10,63,184 రాబడి వచ్చినట్లు ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళల రూపేణా రూ॥ 3,42,109లు, శ్రీవారి అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ॥ 27,750లు, నిత్య కళ్యాణం ద్వారా రూ, 88 వేలు, 500 రూపాయిల ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.3,31,400లు,దేవస్థానం వసతి ద్వారా రూ.14,400లు, తలనీలలు 3.400 మంది సమర్పించగా తద్వారా రూ. 1,36,000 లు, లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 1,20,285లు, పులిహోరా విక్రయం ద్వారా రూ.14.740లు,వాహనాల పూజల ద్వారా రూ.2,400 లు చొప్పున మొత్తం రూ.10,63,184 రాబడి వచ్చినట్లు జనార్ధన్ రెడ్డి తెలిపారు.

స్వామి వారి అన్న ప్రసాదాన్ని 2021 మంది స్వీకరించారని, రాత్రి 7 గంటల 20 నిమిషాల వరకు మొత్తం 13,652 మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ,ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయిస్వామి, దేవస్థానం సిబ్బంది తదితరులున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశా

# పరిశ్రమలకు వేగవంతంగా అనుమతులు: కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, మే 30, ప్రభాతవార్త :** జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుకు వేగవంతంగా అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. విజయవాడలోని కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డిఐఈపిసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా పారిశ్రమిక అనుమతులు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పారిశ్రామిక చేయూత పథకాల అమలుపై సమావేశంలో చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పెట్టుబడిదారులకు అవసరమైన సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు, యంయంఎస్‌యంఈ పార్కులకు శంకుస్థాపన చేయటం జరిగిందని, వాటన్నిటినీ త్వరితగతిన పూర్తిచేసి పారిశ్రామికవేత్తలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. వివిధ అనుమతులకు సంబంధించి సింగిల్‌డెస్క్ పోర్టల్ ద్వారా వస్తున్న ధరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ పారిశ్రామికి విధానాల కింద 26 క్లెయిమ్‌లకు రూ.3.48కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహాలను తాజాగా కమిటీ ఆమోదం తెలిపిందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో పీయంఈజీపీ, పియం విశ్వకర్మ పథకాల అమలులో పురోగతిని కమిటీలో చర్చించి ధరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు దిశానిర్దేశం చేసారు. ఈసమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి యం.మధు, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ బాబ్జీ, వాసిరెడ్డి మురళీకృష్ణ(ఫ్యాప్సియా), కనకదుర్గ (ఎలీప్), యం.సుదర్శన్(డిఐఏ), ఎల్‌డియం వెంకటసుబ్బయ్య,డ్రగ్స్ డిపార్ట్‌మెంట్ ఏడి శ్రీరామ్మూర్తి, డిఆర్‌డిఏ పిడినాంచారయ్య పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో విద్యకు మహర్దశ

## సొంత నిధులతో విద్యార్థులకు ప్రోత్సాహకాలు

## 200 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేసిన మంత్రి సవిత



**గుంటూరు మే 30 ప్రభాత వార్త ప్రతినిధి :** విద్యతోనే అత్యున్నత స్థానాలు సాధ్యమని, తల్లిదండ్రులు తమ బిడ్డలను ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యమిస్తోందని, ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాలే దీనికి నిదర్శమని అన్నారు. తన తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. గుంటూరు నగరంలోని దేవరసాయి కృష్ణ కల్యాణ మండపంలో టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 104 మంది కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గీయ విద్యార్థులకు ఉమ్మడి గుంటూరు కురమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్త కనకదాస పేరుతో ఏర్పాటు చేసిన ప్రతిభ పురస్కారాలు మంత్రి సవిత శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు కుల సంఘాలు బాసటగా నిలవడం అభినందనీయమన్నారు. విద్యలో రాణిస్తున్న పేద విద్యార్థులకు ఈ సత్కారాలు మరింత ప్రోత్సాహమిస్తాయన్నారు. ఏపీలో విద్యా వ్యవస్థను రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ అత్యున్నత స్థానాలకు తీసుకెళుతున్నారన్నారు. గత పాలనలో భ్రష్టుపట్టిన విద్యా వ్యవస్థను ఆయన గాడిన పెడుతున్నారన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్షలకు ముందు వందరోజుల ప్రణాళికలు అమలు చేసి, అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో ఆయన కృషి మెచ్చుకోదగినదన్నారు. తల్లికి వందనం, విద్యా మిత్ర కిట్లు, సన్నబియ్యంతో భోజనం, నాణ్యమైన విద్య ప్రభుత్వ విద్యా సంస్థల్లో అందుతున్నాయన్నారు. బీసీ గురుకులాలు, బీసీ హాస్టళ్లలో ఆహార, ఆరోగ్య భద్రతతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కేవలం విద్యతోనే సరిపెట్టకుండా, క్రీడల్లోనూ ప్రోత్సహించేలా బీసీ గురుకులాల్లో స్పోర్ట్స్ కిట్లు అందజేయబోతున్నామన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులు, సమాజం గర్వించేలా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లల మనోభావాలకు గౌరవిమిస్తూ, ఉన్నత విద్య చదివేలా ప్రోత్సహించాలన్నారు.

**104 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు**

కురమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గానికి చెందిన 104 మంది విద్యార్థులకు భక్త కనకదాస పురస్కారాలను మంత్రి సవిత అందజేవారు. రూ.3.30 లక్షల విలువ చేసే నగదు ప్రోత్సాహకాలు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. టెన్త్ తో పాటు సెకండ్ ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఈ ప్రోత్సాహకాలు అందజేశారు. టెన్త్, సెకండ్ ఇంటర్ లో కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గంలో మొదటి అయిదు స్థానాల్లో నిలిచిన ఇద్దరు విద్యార్థులకు రూ.5 వేల చొప్పున రూ.10 వేలు అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన 20 మంది టెన్త్, ఇంటర్ విద్యార్థులకు రూ.3 వేల చొప్పున రూ.30 వేలు అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన 20 మంది విద్యార్థులకు రూ.2 వేలు చొప్పున రూ.40 వేలు అందజేశారు. మరో 120 మంది విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున రూ.లక్షా 20 వేలు ప్రోత్సాహక నగదు రూపంలో అందజేశారు. అత్యుమ్మ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సొంతంగా రూ.లక్ష నగదు, 200 స్కూల్ బ్యాగ్ లను మంత్రి సవిత అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ లో, ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గానికి చెందిన నలుగురు విద్యార్థులకు రూ.25 వేల చొప్పున రూ.లక్ష లను మంత్రి సవిత తన తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. 200 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ లు పంపిణీ చేశారు.

# వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతం

## గ్రంధాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల



శిక్షణ పొందుతున్న చిన్నారులతో గ్రందాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరావు తదితరులు

**విజయవాడ, మే 30, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా గ్రంధాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు విజయవంతం అయ్యాయని రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరావు తెలిపారు. విజయవాడ బందర్‌రోడ్డులోని ఠాగూర్ గ్రంధాలయంలో వేసవిశిక్షణా కార్యక్రమాన్ని శనివారం ఛైర్మన్ పరిశీలించారు. ఈసందర్భంగా శిక్షణ పొందుతున్న చిన్నారులతో ముచ్చటించి శిక్షణ శిబిరంలో నేర్పుతున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కోటేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రంధాలయల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలకు విద్యార్ధుల నుండి విశేషస్పందన లభించిందన్నారు. చిన్నారుల్లో సృజనాత్మకతను, క్రమశిక్షణను పెంపొందించేందుకు ఈశిబిరాలు ఉపయోగపడతాయన్నారు. ఈశిబిరాల్లో విద్యార్థులు నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, కళలు, సాంస్కృతిక అంశాలు, వివిధ నైపుణ్యాలను నేర్చుకుంటున్నారని వివరించారు. ఈశిబిరాలకు హాజరవటం ద్వారా విద్యార్దులు మొబైల్ వాడకం తగ్గించి పుస్తకపఠనం వైపు దృష్టి సారిస్తున్నారన్నారు.

ఈకార్యక్రమంలో కృష్ణాజిల్లా గ్రందాలయ ఛైర్మన్ యం.ఎస్.బేగ్, గ్రంధాలయ అధికారి కే.రమా దేవి, గిన్నీస్‌బుక్‌లో స్థానం పొందిన కుసుమ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో ఓ హోటల్‌లో డాలర్లు మాయం

**తిరుపతి,మే 30ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన ఓ భక్తకుటుంబం తిరుపతిలోని ఓ హోటల్ గదిలో దిగారు. శుక్రవారం ఉదయం గది నుండి కుటుంబంతో కలసి తిరుమలకు వెళ్ళారు. శ్రీవారి దర్శనార్ధం తిరిగి గదికి రావడంతో డాలర్లు లేకపోవడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. ఏకంగా వెయ్యిడాలర్లు కనిపించలేదని పోలీసులను ఆశ్రయించారు. తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మారస సరోవరం హోటల్ రూమ్ నెంబర్ 1017 లో ఈ ఘటన జరిగింది. సింగపూర్ నుండి శ్రీవారి దర్శనానికి వచ్చిన ఎన్నారై ఆర్ముగం కుటుంబం శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చి హోటల్ వచ్చి చూసుకోగా లాకార్స్‌లో ఉంచిన వెయ్యి డాలర్స్ మాయమ య్యాయి. దీంతో హోటల్ సిబ్బందిని అడిగినా ఫలితం లేకపోయింది. బాధితుడు ఆర్ముగం అలిపిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీ సులు నమోదు చేసి విచారిస్తున్నారు. అలిపిరి ఎస్ఐ దుర్గాప్రసాద్ హోటల్ సిబ్బందిని విచారణ చేస్తున్నారు.

# పాలకమండలి సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదం



**ఇంద్రకీలాద్రి, మే 30, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయానికి సంబంధించిన పలు టెండర్లను శనివారం జరిగిన పాలక మండలి సమావేశంలో ఆమోదించారు. అప్పగించిన తేదీనుండి 2027 మార్చి 31 వరకు ఆలయంలో పూలు, పూలదండలు టెండర్, ఉభయదాతలు, భక్తులకు, విఐపిలకు అందించే వస్త్ర ప్రసాదం టెండర్, కొండపైన, క్రింద టోల్‌గేట్ టెండర్, అన్నదాన, ప్రసాదాల విభాగంలో ఖాళీడబ్బాలు, గోనె, ప్లాస్టిగ్ సంచుల కొనుగోలు టెండర్, కొండపైన యాగశాల వద్ద రు.9,75,000లతో రిటైనింగ్ వాల్ టెండర్, ఛైర్మన్ చాంబర్ అభివృద్ధి పనుల టెండర్, పలు అభివృది పనులకు రు.40 లక్షల టెండర్, 4 ఎసి బస్సుల టెండర్, దుర్గమ్మవారి ఆలయ దత్తత దేవాలయం తాడేపల్లిలోని శ్రీమద్వీరాంజనేయ స్వామి సమేత కోదండరామస్వామి దేవస్థానంలో 2 సంవత్సరాల తాత్కాలిక పార్కింగ్ లైసెన్సు, జమ్మిదొడ్డి అతిథిగృహంనందు హెచ్‌టి సర్వీస్ ఏర్పాటుకు టెండర్, ఎలక్ట్రిక్ మెటీరియల్ సప్లై టెండర్, క్యూలయిన్ల ఏర్పాటు టెండర్, కేశఖండనశాల, కనకదుర్గానగర్, మహామండపం వరకు పలు అభివృద్ధి కార్యక్రమాల టెండర్, మహామండపం లిఫ్టుల వద్ద నుండి నూతన అన్నదాన భవనం వరకు ఆర్‌సిసి డ్రైన్ ఏర్పాటుకు, కనకదుర్గానగర్‌ల్లో టాయిలెట్ల ఆధునీకరణ టెండర్, కొండ దిగువన పలు ఆర్చిగేట్ల అమరిక టెండర్, శ్రీ అమ్మవారికి సమర్పించే పట్టుచీరెలు, సాధారణ చీరెలు, పలు రకాల రవికె ముక్కలు, వివిధ వస్త్రాలను తీసుకుని విక్రయించుకునే లైసెన్సు ఆమోదం, ఓం టర్నింగ్ వద్ద రు.46లక్షలతో ఆర్‌అండ్ వారిచే రోడ్డు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఆలయంలో ఎలక్ట్రిక్, ట్రాన్స్‌పోర్టు, కంప్యూటర్లు, ఓల్డ్‌టివిలు, పాత అంబులెన్స్, వాహనములను కొనడానికి వేలం పాడుకున్న మణికంఠ కు పాట లీజు ఆమోదం తెలిపారు. దేవస్థానం స్థలం 1.98 సెంట్లు ఖాళీగా వున్న భూముల లీజు ఇవ్వడానికి ఆమోదం తెలిపారు. 2026 మార్చి వరకు ఆదాయ వ్యయాల వివరాలు పరిశీలించి ఆమోదించారు. మొవ్వగ్రామం, పునాదిపాడు ల్లో కౌలుకు ఇవ్వడానికి నిర్వహించిన వేలం ఆమోదించారు. దేవస్థానం కొండ దిగువన వున్న 1395 గజాల గోశాల స్థలాన్ని భూసేకరణ ద్వారా తీసుకోడానికి ఆమోదించారు. ఈ పాలకమండలి సమావేశంలో ఇవో వికె శీనా నాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న నృత్య నిరాజనం:** దుర్గమ్మవారి ఆలయంలో శనివారం విజయవాడకు చెందిన ముద్ర కూచిపూడి డాన్స్ ఇనిస్టిట్యూట్ నాట్య గురువులు భాగవతుల శైలజ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుని స్తుతి, పరమశివుని వైభవాన్ని, తాండవం, అయిగిరి నందిని, ముద్దుగారే యశోద తదితరాలకు కళాకారులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి.

**నేడు పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ:** దుర్గమ్మవారు వేంచేసియున్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ మే 31తేదీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఉదయం 5.30 లకు ఘాట్ రోడ్ శ్రీ కామధేను అమ్మవారి ఆలయం నుండి ప్రారంభం అవుతుందని ఆలయ ఈవో శీనా నాయక్ తెలియజేసారు.

# గొడ్డలి పార్టీలో పెరుగుతున్న అసహనం: సీఎం చంద్రబాబు



**విజయవాడ,మే 30,ప్రభాతవార్తప్రతినిధి:** గొడ్డలి పార్టీ అని ప్రజల్లోకి వెళ్లే కొద్ది సైకోలో ఫ్రస్టేషన్ పెరుగుతోందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని ప్రజలు బాగా గుర్తించారని చెప్పారు. వైఎస్సార్సీపీ నెవ్వర్ ఎగైన్, ఎన్డీయే ఎగైన్ అండ్ ఎగైన్ అనేది కూడా ప్రజల నినాదంగా మారుతోందని వెల్లడించారు. ఇప్పుడు వెలుగులోకి వస్తున్న వైఎస్ కుటుంబ అరాచకాలు తనకు కూడా కొన్ని తెలియవన్నారు. 30 ఏళ్ల క్రితమే కడప జిల్లాలో పాలెగాళ్ల రాజ్యంపై వేసిన పుస్తకాన్ని ఇప్పుడు అందరూ చదువుతున్నారని చెప్పారు. ప్రజాస్వామ్యానికి ఇలాంటి వాళ్లు పనికిరారని స్పష్టంచేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో తాజా రాజకీయ పరిణామాలపై చంద్రబాబు మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. నక్సలైట్లు గన్ తో రాజ్యాధికారాన్ని సాధించలేరని చంద్రబాబు పేర్కొన్నారు. అలాంటిది వీళ్లు గొడ్డలితో ఎలా రాజకీయాలు చేస్తారని ప్రశ్నించారు. హత్య రాజకీయాలు చేసిన వారు రాష్ట్రాన్ని పరిపాలించవచ్చు? కానీ బాధితులు మాత్రం జిల్లా రాజకీయాలు చేయకూడదన్నట్లుగా? వీరి సిద్ధాంతం ఉందని విమర్శించారు. వివేకా హత్య కేసులో సునీత పోరాటంలో న్యాయం ఉందన్నారు. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉందని తెలిపారు. సునీత పోరాటం కారణంగానే ఇప్పటికీ వివేకా హత్య కేసు సజీవంగా ఉందని చెప్పారు. నేటి తరానికి కూడా వీళ్ల హత్య రాజకీయాలు తెలుస్తున్నాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అంతకుముందు చంద్రబాబు ప్రాంతీయ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. అబద్ధాలతో మైండ్ గేమ్ ఆడే గొడ్డలి పార్టీ పట్ల పూర్తి అప్రమత్తంగా ఉంటూ, వారి కుట్రలను సమర్ధంగా తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేశారు.

# పునర్విభజన, మహిళ బిల్లులను విడదీసి చూడొద్దు: సిఎం చంద్రబాబు

## మహానాడు విజయంపై పార్టీ కేడర్‌కు అభినందనలు తెలిపిన సిఎం

**విజయవాడ,మే30,ప్రభాతవార్తప్రతినిధి:** పునర్విభజన, మహిళ బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదని. ఈ రెండు బిల్లులు కలిపి వస్తేనే మహిళలకు న్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ని టీడీపీ ప్రకటించడం దేశ రాజకీయాల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారిందన్నారు. మహిళా రిజర్వేషన్లను అన్ని పార్టీలు స్వాగతించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు. మొదటి నుంచీ మహిళలకు టీడీపీ అండగా ఉందని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు విజయంపై టీడీపీ జనరల్ సెక్రటరీలు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో మహానాడు కార్యక్రమం నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. తొలిసారిగా హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు ఘనవిజయం సాధించిందని పేర్కొన్నారు. మహానాడును సమర్థవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన పార్టీ నేతలు, కార్యకర్తలు, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి. తెలంగాణలో ఉత్సాహంగా మహానాడు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. మహానాడులో ఆమోదించిన 33 మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి అని అన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ తెలంగాణ టీడీపీ సీనియర్ నేత బక్కని నర్సింహులు చేసిన కొన్ని వ్యాఖ్యలు సరికావు.

ఎంతో చరిత్ర, నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే. తెలంగాణ టీడీపీ సీనియర్ నేత బక్కని నర్సింహులు చేసిన కొన్ని వ్యాఖ్యలు సరికావు. ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడకూడదు.


టీడీపీ పుట్టిందే తెలంగాణ గడ్డపై, తెలంగాణలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉంది. టీడీపీ ఆవిర్భావం తర్వాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి. తెలంగాణలో ఉత్సాహంగా మహానాడు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. మహానాడులో ఆమోదించిన 33 మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి అని అన్నారు. డీలిమిటేషన్ విషయంలో 2011 జనాభా లెక్కలైనా, తాజా లెక్కలైనా మనకు నష్టం కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అందుకే ఉన్న స్థానాలను 50 శాతం పెంచితే అందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. పెంచిన స్థానాలను మహిళలకు కేటాయించవచ్చని అభిప్రాయపడ్డారు. దీంతో గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారి ఆలోచన కూడా మారవచ్చని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లుల విషయంలో కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉందన్నారు. రెండు బిల్లులను తీసుకురావడానికి కేంద్రం సిద్ధమవుతోందని, ఆ రెండింటినీ విడదీసి చూడాల్సిన అవసరం ఏముందని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. రెండు బిల్లులు కలిపి వస్తేనే మహిళలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్, పునర్విభజన బిల్లులు తప్పనిసరిగా తీసుకురావాలని, ఇవి దేశ రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొస్తాయని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

**చంద్రబాబును కలిసిన ఆశావహులు**

త్వరలో నాలుగు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ వెలువడనుంది. ఈ క్రమంలో రేస్‌లో ఉన్న ఆశావాహులు చంద్రబాబును కలిసి తమకు అవకాశం పరిశీలించాలని కోరారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలోనూ, సచివాలయంలోనూ, పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇలా ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ చంద్రబాబు, లోకేశ్‌ను కలిసి రాజ్యసభలో తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇలా గత రెండు రోజుల్లో వర్ల రామయ్య, కంభంపాటి రామ్మోహన్ రావు, రెడప్పగారి శ్రీనివాసరెడ్డి, టీడీ జనార్ధన్, చింతకాయల విజయ్, తిప్పేస్వామి తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

## విహార యాత్రలో విషాదం..

# నీటిలో మునిగి పిన్నమ్మ, కుమార్తె మృతి



**ఉరవకొండ, మే 30 ప్రభాతవార్త:** బక్రీద్ పండుగ విహార యాత్ర ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. అనంతపురం జిల్లా ఉరవకొండ మండల పరిధిలోని పి.కౌకుంట్ల గ్రామంవద్ద పీఏబీఆర్ (పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) వెనుక నీటిలో మునిగిపోయి అనంతపురం నగరం ఆజాద్‌నగర్‌కు చెందిన షేక్ ఫరీదా (35) ఆమె అక్క కుమార్తె షేక్ యాస్మిన్ (13) మృతి చెందారు. ఉరవకొండ ఎస్ఐ పి.జనార్ధననాయుడు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు బక్రీద్ పండుగ సందర్భంగా కుటుంబం అంతా ఒకచోట చేరింది. సరదాగా గడపడానికిగాను 9 మంది సభ్యులతో కూడిన కుటుంబం శనివారం ఉదయం ఆటోలో పీఏబీఆర్ డ్యాం చేరుకుంది. అక్కడే భోజనాన్ని తయారు చేయించుకొనడంలో నిమగ్నమయ్యారు. ఇంతలో బాలి షేక్ యాస్మిన్ డ్యాం చివరి నీటిలో ఆడుకొంటూ గుంతలో పడి మునిగిపోతుండగా అక్కడే ఉన్న పిన్నమ్మ షేక్ ఫరీదా ఆమెను రక్షించే క్రమంలో అదే గుంతలోపడి ఇరువురికీ ఈత రాని కారణంగా ఊపిరాడక నీటిలో పడి మునిగిపోయారు. కొద్ది సేపటి తరువాత ఇతర కుటుంబ సభ్యులు అక్కడి చేరుకొని ఇరువురిని బయటకు తీయగా వారు అప్పటికే మృతి చెందారు. మృతురాలు ఫరీదాకు భర్త దాదాపీర్, ఇద్దరు కొడుకులు ఉన్నారు. యాస్మిన్‌కు తండ్రి ఫరూక్, తల్లి కుర్సిద్, అక్క, తమ్ముడు ఉన్నారు. విషయం తెలియగానే ఉరవకొండ ఎస్ఐ పి.జనార్ధననాయుడు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించి బాలిక తల్లి కుర్సిద్ పిర్యాదు మేరకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇరువురి మృతదేహాలను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి ఇక్కడ పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# అహ్మదాబాద్‌లో ఐపిఎల్ మహా సమరం



## ఆర్సీబీ-గుజరాత్ టైటాన్స్ ఫైనల్ ఫైట్ * రెండో కప్ కోసం అమీతుమీ



*రెండు నెలలకు పైగా క్రికెట్ ఫ్యాన్స్‌ను అలరించిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ చివరి అంకానికి చేరుకుంది. ఎన్నో మలుపులు.. మరెన్నో ఉత్కంఠ మ్యాచ్‌లు.. టాప్ జట్లు డీలా, అంచనాలు లేని జట్ల ముందంజ... హీరోలనుకున్న ప్లేయర్లు ఫట్ అయితే.. అన్‌క్యాప్‌డ్ ప్లేయర్లు హిట్టయ్యారు. అయినా అనుభవందే ప్లస్ అయింది.ఇపుడు ఫైనల్ సమరానికి ఐపీఎల్ రెడీ అయింది. 10 జట్ల నుంచి రెండు జట్లు పోరుకు చేరిన ఫైనల్లో ఎవరు దుమ్మురేపుతారు? డిపెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ వరుసగా రెండోసారి కప్ అందుకుంటుందా? సొంతగడ్డ, సొంత అభిమానుల ముందు గుజరాత్ టైటాన్స్ ట్రోఫీతో మురిపిస్తుందా? అన్న ఉత్కంఠ నెలకొంది.*

**అహ్మదాబాద్, మే 30:** ఇండియన్ ప్రీమియర్ లీగ్-2026 తుది అంకానికి సమయం ఆసన్నమైంది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంగా పేరొందిన అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం రాత్రి 7.30 గంటలకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ మధ్య ఫైనల్ పోరు జరగనుంది. సీజన్ మొత్తం ఆధిపత్యం చాటిన రెండుజట్లు చివరి అడుగులో ట్రోఫీ కోసం తలపడుతుండటంతో అభిమానుల్లో ఆసక్తి తారాస్థాయికి చేరుకుంది. లీగ్ దశలో అత్యంత స్థిరమైన ఆటతో అగ్రస్థానంలో నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇప్పటికే క్వాలిఫయర్-1లో గుజరాత్‌పై భారీ విజయంతో మానసిక ఆధిక్యం సాధించింది. మరోవైపు ఆ ఓటమి తర్వాత తేరుకున్న గుజరాత్ టైటాన్స్.. క్వాలిఫయర్-2లో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసి ఫైనల్ చేరింది. హోమ్ గ్రౌండ్‌లో ఆడుతున్న ప్రయోజనం గుజరాత్‌కు కలిసివస్తుండగా, సమతూకమైన జట్టుతో బెంగళూరు ఫేవరెట్‌గా కనిపిస్తోంది.

**అహ్మదాబాద్ పిచ్ బ్యాటర్లకు స్వర్గం**

నరేంద్ర మోదీ స్టేడియం పిచ్ సాధారణంగా బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. ఈ సీజన్‌లో ఇక్కడ 200కుపైగా స్కోర్లు పలుమార్లు నమోదయ్యాయి. అయితే కొత్త బంతితో పేస్ బౌలర్లకు కూడా సహకారం లభిస్తుంది.గణాంకాల ప్రకారం ఇక్కడ మొదట బ్యాటింగ్ చేసిన జట్లే ఎక్కువసార్లు గెలిచాయి. దీంతో టాస్ గెలిచిన కెప్టెన్ ముందుగా బ్యాటింగ్ వైపు మొగ్గు చూపే అవకాశముంది. 200 ప్లస్ స్కోరు నమోదైతే మ్యాచ్‌పై గట్టి పట్టు లభిస్తుంది. ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 229 పరుగుల భారీ స్కోరు సాధించింది.

**కీలకంగా మారే స్టార్ ప్లేయర్లు**

గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. 700కిపైగా పరుగులతో జట్టుకు ప్రధాన బలంగా నిలిచాడు. సాయి సుదర్శన్, జోస్ బట్లర్ కూడా నిలదొక్కుకుంటే గుజరాత్ బ్యాటింగ్ మరింత ప్రమాదకరంగా మారుతుంది. బౌలింగ్‌లో కగిసో రబాడా, రషీద్ ఖాన్ మ్యాచ్‌ను మలుపు తిప్పగలరు. ఆర్సీబీ వైపు చూస్తే రజత్ పాటిదార్ ఈ సీజన్‌లో నాయకత్వంతో పాటు బ్యాటింగ్‌లోనూ మెప్పిస్తున్నాడు. అనుభవజ్ఞుడు విరాట్ కోహ్లీ ఫైనల్ వంటి కీలక మ్యాచ్‌ల్లో తన ప్రభావం చూపగలడు. టిమ్ డేవిడ్ ఫినిషర్ పాత్రలో కీలకం. భువనేశ్వర్ కుమార్, హేజిల్‌వుడ్ కొత్త బంతితో వికెట్లు తీస్తే రాయలల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఆధిక్యం లభించే అవకాశం ఉంది.

**గణాంకాలూ ఆర్సీబీ వైపే**

ఈ సీజన్‌లో ఇరు జట్లు ఇప్పటికే మూడు సార్లు తలపడ్డాయి. అందులో రెండు విజయాలు ఆర్సీబీ ఖాతాలో చేరాయి. మొత్తం హెడ్ టు హెడ్‌లోనూ బెంగళూరుకే స్వల్ప ఆధిక్యం. 9 మ్యాచ్‌ల్లో ఆర్సీబీ 5 సార్లు, గుజరాత్ 4 సార్లు విజయం సాధించాయి. ఆర్సీబీ తన చివరి ఐదు మ్యాచ్‌లలో నాలుగింటిలో గెలిచి మంచి జోష్‌లో ఉంది. క్వాలిఫయర్-1లో గుజరాత్‌పై ఆర్సీబీ సాధించిన భారీ విజయం జట్టుకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. అయితే హోమ్ కండిషన్స్, భారీ మ్యాచ్ ఒత్తిడి గుజరాత్‌ను మరింత ప్రమాదకరంగా మార్చే అవకాశముంది.

**ఎవరి విజయావకాశాలు ఎక్కువ?**

ప్రస్తుత ఫామ్, బ్యాటింగ్ లోతు, బౌలింగ్ సమతూకం చూస్తే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కాస్త ముందంజలో కనిపిస్తోంది. కానీ అహ్మదాబాద్‌లో గుజరాత్‌ను తక్కువ అంచనా వేయడం ప్రమాదమే. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాట్‌తో రాణిస్తే మ్యాచ్ పూర్తిగా మారిపో వచ్చు. మొత్తం మీద అభిమానులకు ఉత్కంఠభరితమైన ఫైనల్ ఖాయమనే అంచనా వ్యక్తమవుతోంది.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు**

వెంకటేష్ అయ్యర్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్ (కెప్టెన్), జితేష్ శర్మ, టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జాకబ్ డఫీ, జోష్ హేజిల్‌వుడ్, రసిఖ్ సలామ్ దార్.

**గుజరాత్ టైటాన్స్**

సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), జోస్ బట్లర్, నిశాంత్ సింధు, వాషింగ్టన్ సుందర్, జేసన్ హోల్డర్, రషీద్ ఖాన్, రవిశ్రీనివాసన్, సాయి కిషోర్, కగిసో రబాడా, ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్

**ఫైనల్ ప్రిడిక్షన్**

ఆర్సీబీ - 55 శాతం, గుజరాత్ టైటాన్స్ - 45 శాతంగా గెలుపు అవకాశాలు ఉంది.ఐపీఎల్-2026కు ముగింపు పలికే ఈ ఫైనల్‌లో ఎవరు ట్రోఫీ అందుకుంటారన్న ఉత్కంఠ ఇప్పుడు దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానులను కట్టిపడేస్తోంది.

## కింగ్ కోహ్లీపైనే ఫోకస్

ఛేజింగ్ కింగ్ విరాట్ కోహ్లీపైనే అందరి దృష్టి. ఈ ఐపీఎల్ సీజన్‌లో గొప్ప ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటికే 600రన్స్ చేశాడు. జీటీపై బెటర్ రికార్డు ఉంది. గుజరాత్ టైటాన్స్‌పై విరాట్ కోహ్లీ బ్యాట్ ఎప్పుడూ గర్జిస్తూనే ఉంది. తొమ్మిది మ్యాచ్‌ల్లో 503 పరుగులు చేసిన కోహ్లీ.. ఫైనల్‌లోనూ ఆర్సీబీకి కీలక ఆయుధంగా మారనున్నాడు. బెంగళూర్‌లో జరిగిన మ్యాచ్‌లో జీటీపై 81పరుగులు చేసి ఒంటి చేత్తో ఆర్సీబీని గెలిపించాడు. ఇక క్వాలిఫయర్-1లో 43 పరుగులతో రాణించాడు. ఫ్లయింగ్ స్టార్ట్ అందించాడు.బిగ్ మ్యాచ్‌ల్లో ఆడడాన్ని ఆస్వాదించే కోహ్లీ జీటీకి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.

| | |
|---|---|
| మ్యాచ్‌లు | 15 |
| పరుగులు | 600 |
| సగటు | 500 |
| స్ట్రయిక్ రేట్ | 164.38 |
| హాఫ్ సెంచరీలు | 5 |
| సెంచరీలు | 1 |

**కోహ్లీ ప్రత్యేకం:** పెద్ద మ్యాచ్‌ల్లో ఒత్తిడిని తట్టుకునే ఆట. జీటీపై మంచి రికార్డు

**రజత్ పాటిదార్(కెప్టెన్)**

మ్యాచ్‌లు : 15
పరుగులు: 486
స్ట్రయిక్ రేట్ : 196.76
హాఫ్ సెంచరీలు: 4
బెస్ట్: 33 బంతుల్లో 93
ప్రత్యేకం : మిడిల్ ఓవర్లలో టెంపో మార్చగలసామర్థ్యం

**భువనేశ్వర్ కుమార్**

వికెట్లు : 26
ఎకానమీ: 8
పవర్ ప్లే వికెట్లు: 16
ప్రత్యేకం:కొత్తబంతితోస్వింగ్

**హేజిల్‌వుడ్**

వికెట్లు : 13
ఎకానమీ: 9.62
పవర్ ప్లే వికెట్లు: 9
డెత్ ఓవర్లలో ప్రభావం
ప్రత్యేకం:హైప్రెజర్ మ్యాచ్‌లలో కచ్చితమైన లైన్-లెంగ్త్

**శుభ్‌మన్ గిల్(కెప్టెన్)**

మ్యాచ్‌లు : 15
పరుగులు: 722
స్ట్రయిక్ రేట్ : 163.71
హాఫ్ సెంచరీలు: 6
సెంచరీలు : 1
బెస్ట్: 53 బంతుల్లో 104
ప్రత్యేకం : జీటీ బ్యాటింగ్‌కు ప్రధాన బలం

**సాయి సుదర్శన్**

మ్యాచ్‌లు : 16
పరుగులు: 710
స్ట్రయిక్ రేట్ : 159.55
హాఫ్ సెంచరీలు: 8
సెంచరీలు : 1
బెస్ట్: 51 బంతుల్లో 100
ప్రత్యేకం : గిల్‌తో కలిసి బలమైన ఓపెనింగ్ జోడీ



గుజరాత్ టైటాన్స్ పేస్‌అటాక్ రబడ, సిరాజ్ ప్రధాన ఆయుధం. ఇద్దరూ ఆరంభంలోనే వికెట్లు అందిస్తున్నారు. రబడ 16 మ్యాచ్‌ల్లో 28 వికెట్లతో పర్పుల్ క్యాప్ రేసులో ఉన్నాడు. సిరాజ్ 16 మ్యాచ్‌ల్లో 18 వికెట్లు పడగొట్టాడు. ఆర్సీబీకి గతంలో పలు సీజన్లు ఆడిన అనుభవం సిరాజ్‌కు ఉంది. కోహ్లీ, పాటిదార్, జితేష్ బలాలు-బలహీనతలపై మంచి అవగాహనఉంది.కొత్తబంతితో స్వింగ్ దొరికితే టాప్ ఆర్డర్ లేపేయగలడు.పిచ్ పేసర్లకు సహకరిస్తే సిరాజ్ మరింత ప్రమాదకరంగా మారే ఛాన్స్ ఉంది.ఫైనల్లో గుజరాత్‌కు ట్రంప్‌కార్డ్‌గా మారనున్నాడు. పవర్ ప్లేలో సిరాజ్ స్పెల్ మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది.

## డబుల్స్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ

**సింగపూర్:** భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి సింగపూర్ ఓపెన్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ సెమీస్‌లో సాత్విక్ జోడీ 21-19, 21-18తో ప్రపంచ నంబర్ వన్ కొరియా జోడీ కిమ్ వోన్‌సియో-సుంగ్ జెను ఓడించింది.52 నిమిషాల్లోనే ప్రత్యర్థులను మట్టి కరిపించింది. భానత జోడీ ఫైనల్ చేరడంతో కనీసం రజతం ఖరారు చేసుకుంది. ఆద్యంతం హోరాహోరీగా జరిగిన సెమీఫైనల్లో భారత జోడీ టాప్ గేర్‌లో ఆడింది. ఆరంభం నుంచి కొరియా జంటకు ముచ్చెమటలు పట్టించిన భారత ద్వయం.. రెండు గేమ్స్‌లనూ అలవోకగా నెగ్గింది. ఆదివారం జరగనున్న ఫైనల్లో సాత్విక్‌చిరాగ్ జోడీ.. ఫజర్ అల్ఫియాన్ - ముహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ (ఇండోనేషియా)/ లియాంగ్ వీ కెంగ్ - వాంగ్ ఛాంగ్ విజేతతో తలపడనుంది.

## ఆసియా క్రీడల సెలెక్షన్ ట్రయల్స్‌లో నిరాశపర్చిన ఫోగట్

**న్యూఢిల్లీ :** ఆసియా క్రీడల్లో పాల్గొనాలన్న రెజ్లర్ వినేశ్ ఫొగట్ ఆశలు ఆవిరయ్యాయి. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన ఏషియన్ గేమ్స్ కోసం సెలెక్షన్ ట్రయల్స్‌లో సెమీ ఫైనల్లోనే ఓడారు. 53 కేజీల విభాగంలో పోటీపడ్డ వినేశ్... 4-6 పాయింట్ల తేడాతో మీనాక్షి గోయత్ చేతిలోపరాజయం చవిచూశారు. హోరాహోరీగా సాగిన పోరులో వినేశ్, మీనాక్షి చాలాసేపు పోటీపడ్డారు. చివరికి విజయం మాత్రం మీనాక్షి కి దక్కడంతో ఆమె ఫైనల్‌కు చేరుకున్నారు.వినేశ్ ఈ పోటీల్లో పాల్గొనేందుకు రెజ్లింగ్ సమాఖ్యతో పోరాడారు. ఆ క్రమంలో సుప్రీంకోర్టు వరకు వెళ్లి.. ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతులు పొందారు. ఓటమి అనంతరం వినేశ్ స్పందించారు. నేను ఓడిపోలేదు. వ్యవస్థతో పోరాడుతున్నాను. ఒంటరి పోరాటం చేస్తున్నాను. తాను ప్రతిదాని కోసం పోరాడాల్సి వచ్చింది. అయినా న్యాయం

## నగల వర్తకులను ముంచేసిన.. పసిడి పన్నులు



**ముంబయి, మే 30:** కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒకే ఒక్క నిర్ణయం దేశంలో పసిడి అమ్మకాలను భారీగా తగ్గించింది. దిగుమతి సుంకాన్ని భారీగా పెంచడంతో విక్రయాలు పడిపోయాయి. ఇరాన్‌ఉద్రిక్తతలతో పెరిగిన ఇంధన,ఆహారధరలు తోడవడంతో జనం అసలు షాపుల వైపు వెళ్లడమే మానేశారు. కేవలం రెండు వారాల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా పసిడి డిమాండ్ ఊహించని విధంగా 70శాతం మేర పడిపోయింది.బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్రం 6 నుంచి ఏకంగా 15 శాతానికి పెంచింది. దీనికి జీఎస్‌టీ కూడా చేరడంతో పసిడిపై పడే మొత్తం పన్ను భారం 9.18 నుంచి 18.45 శాతానికి చేరింది. రూపాయి విలువ పతనం, క్రూడాయిల్ ధరలు పెరగడంతో విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.పన్నుల పెంపు దెబ్బకు దేశవ్యాప్తంగా పసిడి కొనుగోళ్లు భారీగా పడిపోయాయని ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ వెల్లడించింది. గతేడాది మే నెల చివరి 2వారాల్లో 25టన్నులుగా ఉన్న బంగారం డిమాండ్ ఈసారి కేవలం 7.5 టన్నులకే పరిమితమైంది. దేశీయ బంగారం వ్యాపారంలో 65శాతం వాటా ఉన్న అసంఘటిత రంగం ప్రభుత్వ చర్యతో తీవ్రంగా ప్రభావితమైంది.ఈ ఏడాది పసిడికి దూరంగా ఉండాలంటూ ప్రధాని మోదీ దేశ చేసిన విజ్ఞప్తి కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.




## సావరిన్ గోల్డ్ బాండ్స్‌పై 227శాతం రాబడులు

**ముంబయి, మే 30:** సావరిన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ) పథకంలో పెట్టుబడి పెట్టిన వారికి ఆర్బీఐ గుడ్‌న్యూస్ చెప్పింది. ఐదేళ్ల క్రితం జారీ చేసిన ఎస్‌జీబీ 2021-22 సిరీస్-2 బాండ్లకు సంబంధించిన ముందస్తు విమోచన ధర ప్రకటించింది. పెట్టుబడిదారులకు ఊహించని రీతిలో ఏకంగా 227 శాతం అద్భుతమైన రాబడిని అందించేలా యూనిట్‌కు రూ.15,672గా ధరను ఖరారు చేసింది. ఐదేళ్ల కిందట రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసినట్లయితే వారికి ఇప్పుడు రూ. 3.27 లక్షల వరకు రాబడి వచ్చింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం సావరిన్ గోల్డ్ బాండ్లను జారీ చేసిన ఐదేళ్ల తర్వాత, వడ్డీ చెల్లించే తేదీల్లో వాటిని ముందస్తుగానే డబ్బుల్ని విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ సిరీస్ బాండ్లను 2021 జూన్ 1న జారీ చేసినందున, సరిగ్గా ఐదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ ఏడాది జూన్ 1 నుంచి పెట్టుబడిదారులు తమ బాండ్లను నగదుగా మార్చుకునేందుకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది. ముందస్తు విమోచన ధరను నిర్ణయించడానికి ఆర్‌బీఐ ఒక నిర్దిష్ట పద్ధతిని అనుసరిస్తుంది. ఐబీజేఏ ప్రచురించే 999 స్వచ్ఛత కలిగిన బంగారం ధర ఆధారంగా దీనిని లెక్కిస్తారు.

విమోచన తేదీకి ముందున్న మూడు పని దినాల బంగారం ముగింపు ధరల సగటును తీసుకుంటారు. ఈ సిరీస్ కోసం ఈనెల 27,28,29 తేదీల్లోని బంగారం ధరల సగటు ఆధారంగా రూ. 15,672గా ధరను నిర్ణయించారు. 2021లో ఈ బాండ్లను జారీ చేసినప్పుడు, ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారికి ఒక గ్రాము (యూనిట్) ధర రూ.4,792గా ఉంది. ఆఫ్‌లైన్‌లో కొన్నవారికి దీని ధర రూ.4,842గా ఉంది. ఇప్పుడు ఆర్‌బీఐ ప్రకటించిన విమోచన ధర రూ.15,672తో పోలిస్తే, ఆన్‌లైన్ పెట్టుబడిదారులకు ప్రతి గ్రాముపై వడ్డీని మినహాయించి రూ.10,880 నికర లాభం వస్తోంది. కేవలం ఐదేళ్ల కాలంలోనే వారి పెట్టుబడిపై 227.05 శాతం రాబడి లభించినట్లయింది. సాధారణంగా ఎస్‌జీబీల కాలపరిమితి 8 సంవత్సరాలు కాగా, ఐదేళ్ల తర్వాత ఇలాంటి అధిక రాబడితో బయటకు వచ్చే అవకాశం కల్పించడం పెట్టుబడిదారులకు ఎంతో లాభదాయకంగా నిలిచింది.

## స్పేస్‌ఎక్స్ 75బిలియన్ డాలర్ల ఐపిఒపైనే ఇన్వెస్టర్ల ఫోకస్




**న్యూయార్క్, మే 30:** గ్లోబల్ బిలియనీర్ ఎలాన్ మస్క్ మరోసారి ప్రపంచ పెట్టుబడి మార్కెట్లనే తనవైపు తిప్పుకోగలిగారు. ఆయన ఆధ్వర్యంలో నడుస్తున్న స్పేస్‌ఎక్స్ కంపెనీ ఇప్పుడు చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓ కోసం సిద్ధమవుతోంది.ఈప్రతిపాదన పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తూనే,మరోవైపు అనేక ప్రశ్నలను కూడా లేవనెత్తుతోంది. స్పేస్‌ఎక్స్ దాఖలు చేసిన 300 పేజీలకు పైగా ఉన్న ప్రాస్పెక్టస్‌లో కంపెనీ లక్ష్యాలు సాధారణ వ్యాపార ప్రణాళికలను మించి ఉన్నాయి. మానవ జీవితాన్ని బహుగ్రహాలకు విస్తరించడం, చంద్రుడిపై స్థావరాలు నిర్మించడం,ఇతర గ్రహాలపైనగరాలు ఏర్పాటు చేయడం, కృత్రిమ మేధ అభివృద్ధికి సౌరశక్తిని వినియోగించడం వంటి అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రణాళికలను సంస్థ ప్రకటించింది.

భారీ పెట్టుబడులు అవసరమయ్యే ఈ ప్రాజెక్టులు సమీప భవిష్యత్తులో లాభాలను అందిస్తాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్పేస్‌ఎక్స్ ఐపీఓ విజయవంతమైతే కంపెనీ మార్కెట్ విలువ 1.8ట్రిలియన్‌డాలర్లకు చేరుతుందని అంచనా. కంపెనీ దాఖలుచేసిన ప్రాస్పెక్టస్ ప్రకారం, గత ఆర్థిక సంవత్సరంలో స్పేస్‌ఎక్స్ 18.7 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని నమోదు చేసింది.అదే సమయంలో కంపెనీ 4.9 బిలియన్ డాలర్ల నష్టాన్ని కూడా చవిచూసింది. సాధారణంగా ఐపీఓలకు వస్తున్న కంపెనీలు లాభదాయకత వైపు అడుగులు వేస్తున్న దశలో ఉంటాయి.జూన్‌లో జరగనున్న స్పేస్‌ఎక్స్ ఐపీఓ ద్వారా కంపెనీ 75 బిలియన్ డాలర్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది విజయవంతమైతే కంపెనీ మార్కెట్ విలువ సుమారు 1.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉంది. ఈ విలువలతో మస్క్ ప్రపంచంలో తొలి ట్రిలియనీర్‌గా అవతరించే అవకాశాలు ఉన్నాయని నిపుణుల అంచనా.ప్రత్యేక సూపర్‌వోటింగ్ షేర్ల ద్వారా కంపెనీపై పూర్తి నియంత్రణను కూడా మస్క్ కొనసాగించనున్నారు. స్పేస్‌ఎక్స్‌కు ప్రతిపాదించిన 1.8 ట్రిలియన్ డాలర్ల విలువ అనేక ప్రశ్నలకు దారితీస్తోంది. ప్రస్తుతం కంపెనీ ఆదాయంతో పోలిస్తే ఈ విలువ దాదాపు 100రెట్లు ఎక్కువగా ఉంది. సాధారణంగా ఎస్ అండ్ పీ 500లోని ప్రముఖ కంపెనీలు తమ వార్షిక అమ్మకాల విలువకు 3నుంచి నాలుగు రెట్ల మధ్యే ట్రేడ్ అవుతుంటాయి. అలాంటప్పుడు స్పేస్‌ఎక్స్‌కు 100 రెట్లు విలువ ఇవ్వడం అత్యంత ఆశావహ అంచనాగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. స్పేస్‌ఎక్స్‌కు ప్రధాన బలంగా స్టార్‌లింక్ నిలుస్తోంది.

## 1.66 లక్షల కోట్లకు పైగా అన్‌క్లెయిమ్డ్ ఫండ్స్

**న్యూఢిల్లీ, మే 30:** ఖాతాదారులు తమ పేరుపై ఉన్న క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తులను సులభంగా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త పోర్టల్‌ను ప్రారంభించింది. బ్యాంకు ఖాతాలు, బీమా పాలసీలు, షేర్లు, డివిడెండ్లు, పెన్షన్ నిధులు వంటి వివిధ ఆర్థిక సంస్థల్లో నిలిచిపోయిన క్లెయిమ్ చేయని ఆస్తుల వివరాలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడమే ఈ పోర్టల్ లక్ష్యం.ఇప్పటి వరకు క్లెయిమ్ చేయని ఆస్తులను వెతకడానికి ప్రజలు వేర్వేరు సంస్థల వెబ్‌సైట్లను సందర్శించాల్సి వచ్చేది. కొత్త పోర్టల్ ద్వారా బ్యాంకులు, బీమా కంపెనీలు, మ్యూచువల్ ఫండ్లు, షేర్ మార్కెట్ సంబంధిత సంస్థలు, ఇతర ఆర్థిక సంస్థల వద్ద ఉన్న క్లెయిమ్ చేయని నిధుల సమాచారాన్ని ఒకే చోట పరిశీలించవచ్చు. చాలా మంది ఉద్యోగ మార్పులు, చిరునామా మార్పులు, కుటుంబ సభ్యుల మరణం లేదా పాత పెట్టుబడుల వివరాలు మర్చిపోవడం వంటి కారణాల వల్ల తమ ఆర్థిక ఆస్తులను క్లెయిమ్ చేయకుండా వదిలేస్తుంటారు. అలాంటి వారికి ఈ పోర్టల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే మరణించిన కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న డిపాజిట్లు, బీమా మొత్తాలు లేదా ఇతర ఆర్థిక ఆస్తులను గుర్తించడంలో కూడా ఇది సహాయపడుతుంది.

వినియోగదారులు తమ పేరు, మొబైల్ నంబర్, పాన్, ఆధార్ లేదా ఇతర అవసరమైన వివరాలతో పోర్టల్‌లో శోధన చేయవచ్చు. సంబంధిత ఆర్థిక సంస్థల్లో ఉన్న క్లెయిమ్ చేయని ఆస్తుల వివరాలు అందుబాటులోకి వస్తాయి.అనంతరం ఆయా సంస్థల నిబంధనల ప్రకారం క్లెయిమ్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు.ప్రస్తుతం దేశంలో బ్యాంకులవద్దనే 72 వేల కోట్ల అన్‌క్లెయిమ్డ్ మొత్తాలు ఉంటే జీవితబీమా సంస్థ వద్ద 14వేల కోట్లకు పైగా ఈ మొత్తాలున్నాయి. కీలకమైన ఈపిఎఫ్ఒ వద్ద కూడా సుమారు 80 వేల కోట్లకు పైగా ఉన్నాయని అంచనా.ఈమొత్తాలు ఈఏడాది మరింతపెరిగే అవకాశం ఉంది. ఈ మొత్తాలను అసలైన యజమానులు లేదా వారి వారసులకు చేరవేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఈ పోర్టల్ ద్వారా ఆర్థిక వ్యవస్థలో పారదర్శకత పెరగడంతో పాటు, ప్రజలు తమకు చెందిన ఆస్తులను సులభంగా గుర్తించి తిరిగి పొందే అవకాశం లభించనుంది. డిజిటల్ ఇండియా కార్యాచరణలో ప్రభుత్వం ఈవెబ్‌సైట్‌ను తెచ్చింది.




## ఎన్‌ఎస్‌ఇ డెరివేటివ్స్‌లో ట్రేడింగ్ సమయంపొడిగింపు




**ముంబయి, మే 30:** స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేసే పెట్టుబడిదారులు ట్రేడర్ల కోసం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో ట్రేడింగ్ సమయాన్ని 10 నిమిషాలు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మార్పు క్లోజింగ్ ఆక్షన్ సెషన్ (సిఎఎస్) అమలులో భాగంగా తీసుకొస్తున్నట్లు ఎన్‌ఎస్‌ఈ వెల్లడించింది. కొత్త విధానం ప్రకారం, ప్రస్తుతం మధ్యాహ్నం 3:30గంటలకు ముగుస్తున్న ట్రేడింగ్ సెషన్‌ను మధ్యాహ్నం 3:40గంటల వరకు పొడిగించనున్నారు. ఈ మార్పు ఆగస్టు నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. క్లోజింగ్ ఆక్షన్ సెషన్ అనేది మార్కెట్ ముగిసే సమయంలో జరిగే ప్రత్యేక ట్రేడింగ్ ప్రక్రియ. ఈ సమయంలో మార్కెట్ భాగస్వాములు కొనుగోలు, విక్రయ ఆర్డర్లను నమోదు చేస్తారు. వీటి ఆధారంగా ఆయా షేర్లకు తుది ముగింపు ధర నిర్ణయించబడుతుంది. ఈ విధానం ద్వారా మార్కెట్ ముగింపు సమయంలో ధరల నిర్ణయంలో మరింత పారదర్శకత, స్థిరత్వం తీసుకురావడంలక్ష్యంగా ఎన్‌ఎస్‌ఈ పేర్కొంది.ఇతర సెషన్లలో మార్పులుండవు.ప్రీఓపెన్ సెషన్ యథాతథంగా కొనసాగుతుంది. ట్రేడ్ మాడిఫికేషన్ విండోలో ఎలాంటి మార్పు ఉండదు.క్యాష్‌మార్కెట్ ట్రేడింగ్ సమయాల్లో కూడా మార్పులు ఉండవు.కేవలం ఈక్విటీడెరివేటివ్స్ సెగ్మెంట్‌లో మాత్రమే ట్రేడింగ్ సమయం పొడిగిస్తారు. క్యాష్ మార్కెట్‌లో ప్రవేశపెట్టనున్న క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌కు అనుగుణంగా డెరివేటివ్స్ మార్కెట్‌లో కూడా సమన్వయం ఉండేలా ఈనిర్ణయంతీసుకున్నట్లు ఎన్‌ఎస్‌ఈ తెలిపింది. క్యాష్, డెరివేటివ్స్ మార్కెట్ల మధ్య మెరుగైన సమన్వయం,ముగింపు ధరలలో పారదర్శకత, మార్కెట్ స్థిరత్వం,అంతర్జాతీయ మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా వ్యవస్థ అభివృద్ధి సాధ్యమవుతాయని భావిస్తున్నారు. డెరివేటివ్స్ కాంట్రాక్టుల ముగింపు ధరను నిర్ణయించే విధానంలో మార్పు ఉండదని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ స్పష్టం చేసింది.




## స్పైస్‌జెట్‌కు 124 కోట్ల పన్ను నోటీసు

**న్యూఢిల్లీ, మే 30:** బడ్జెట్ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. నెలల తరబడి జీఎస్టీ రిటర్నులు దాఖలు చేయడంలో విఫలమైనందుకు గాను జీఎస్టీ డైరెక్టరేట్ ఆ సంస్థకు రూ. 124.65 కోట్ల పన్ను డిమాండ్ నోటీసు జారీ చేసింది. పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున కంపెనీ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ షోకాజ్ నోటీసు కూడా ఇచ్చింది. నిర్దేశిత గడువులోగా స్పైస్‌జెట్ రిటర్నులు దాఖలు చేయకపోవడంతో జీఎస్టీ చట్టంలోని సెక్షన్62 కింద అధికారులు ప్రొవిజనల్ అసెస్‌మెంట్ నిర్వహించి ఈ పన్ను డిమాండ్‌ను ఖరారు చేశారు. నవంబర్ నెలకు రూ. 44.44 కోట్లు, డిసెంబర్‌కు రూ. 43.79 కోట్లు, జనవరికి రూ. 12.19 కోట్లు, ఫిబ్రవరికి రూ. 12.10 కోట్లు, మార్చి నెలకు రూ. 12.12 కోట్ల చొప్పున బకాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ రద్దుకు సంబంధించి ఈ నెల 25న షోకాజ్ నోటీసు జారీ చేసినప్పటికీ, సంస్థ నుంచి ఇంకా పూర్తిస్థాయి స్పందన రాలేదని అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రిటర్నులను స్పైస్‌జెట్ వెంటనే దాఖలు చేసి, చట్టపరమైన నిబంధనలు పాటించకపోతే, కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులుస్పష్టం చేశారు. స్పైస్‌జెట్ ఇప్పటికే తీవ్ర నష్టాల్లో కొనసాగుతోంది.నిన్నటి ట్రేడింగ్‌లో బీఎస్‌ఈలో స్పైస్‌జెట్ షేరు ధర 0.47 శాతం తగ్గి రూ.12.75 వద్ద ముగిసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot No.37, 38 Industrial Estate, Ramanjaneyapuram, Kadapa-516002. Phone : 2764 4999. Fax: 040-27642512, RNINo. 64846, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.